అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 05-02-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 347 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



వాస్తవాలు తెలియజేద్దాం

14 నుంచి 20వరకు బడ్జెట్‌పై ప్రచార కార్యక్రమాలు : ఐదు వామపక్షాల పిలుపు

కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సూచించిన నేతలు

న్యూఢిల్లీ : సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పి, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ నేతలు సోమవారం ఇక్కడ సమావేశమై కేంద్ర బడ్జెట్‌పై చర్చలు జరిపారు. అనంతరం బడ్జెట్‌లో కొన్ని ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేయాలని పిలుపిచ్చారు. తాము చేసిన ప్రతిపాదనలకు మద్దతుగా ప్రజలను సమీకరించడానికి ఫిబ్రవరి 14 నుంచి 20వరకు వారం రోజుల పాటు సామూహిక ప్రచారాన్ని చేపట్టాలని వామపక్షాలు నిర్ణయించాయి. ఇంటింటికి తిరగడం, వీధి సమావేశాలు నిర్వహించడం, ప్రదర్శనలు, ర్యాలీలు ద్వారా ... 12లో

కులగణన, ఎస్సీ వర్గీకరణలకు ఆమోదం



అసెంబ్లీలో విపక్షాల నిరసనల మధ్య బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రకటించిన సీఎం

- ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చిన ప్రతిపక్షాలు
- ఏటా ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినోత్సవం : ముఖ్యమంత్రి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ కుల సర్వేకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ఈ నివేదికను ప్రవేశపెట్టగా.. శాసనమండలిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. విపక్షాల నిరసనల మధ్య ఉభయ సభల్లోనూ ఈ నివేదికకు ఆమోద ముద్ర పడింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన నివేదికను సైతం శాసనసభ, మండలిలో ప్రవేశపెట్టగా అదీ ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..తాము తెలంగాణలో చేపట్టిన కులగణనను దేశవ్యాప్తంగా చేపట్టాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణపై గతేడాది ఫిబ్రవరి నాలుగో తేదీన మంత్రి వర్గ ఉపసంఘం వేశామనీ, ఈ ఏడాది అదే తేదీన సభా సాక్షిగా నివేదికను ఆమోదింపజేసు కున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇక నుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి నాలుగో తేదీన రాష్ట్రంలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. మంగళవారం ఉదయం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలను క్యాబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం వాటిని ఉభయసభల్లో ప్రవేశపెట్టారు.

ఎస్సీ వర్గీకరణను ముందుగా మేమే అమలు చేస్తాం

- రాజకీయ జీవితంలో ఓ పేజీ రాసుకుంటా
- వర్గీకరణ చేయడం సంతృప్తినిస్తోంది
- దళితుల పట్ల కాంగ్రెస్ పార్టీకి అపారమైన ప్రేమ
- ఫిబ్రవరి 4, 2025 గుర్తుండి పోతుంది

ఎందరో సీఎంలకు రాని అవకాశం నాకొచ్చింది : ఎస్సీ వర్గీకరణ నివేదిక ప్రకటనపై సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలోని మిగిలిన రాష్ట్రాల కంటే ముందే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. తమ ప్రభుత్వం వర్గీకరణకు కట్టుబడి ఉందన్నారు. తన రాజకీయ జీవితాన్ని రాయాల్సి వస్తే ఎస్సీ వర్గీకరణపై ఓ పేజీ రాసుకుంటానన్నారు. ఎంతో మంది సీఎంలకు రాని గొప్ప అవకాశం తనకు రావడం గర్వంగా భావిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ కులాల ఉపవర్గీకరణ విషయంలో తెలంగాణ సర్కారు చిత్తశుద్ధిని చాటుకుంటామని వెల్లడించారు. మంగళవారం నిర్వ హించిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ఆయన ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. దళితుల పట్ల కాంగ్రెస్ పార్టీకి అపారమైన ప్రేమ ఉందని తెలిపారు. ఫిబ్రవరి 4, 2025.. తన రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుండి ...3లో

ఎస్సీవర్గీకరణకు సంపూర్ణ మద్దతు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం చేసిన ప్రకటనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామనీ, ప్రభుత్వం వర్గీరణ కోసం చేసే ప్రతి ప్రయత్నానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. మంగళవారం శాసనసభలో ఎస్సీ వర్గీకరణపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.



కాంగ్రెస్ వర్గీకరణ కోసం పోరాడితే తమ పార్టీ అడ్డుకున్నట్టు చిత్రీకరించే ప్రయత్నాన్ని రేవంత్‌రెడ్డి చేశారని విమర్శించారు. వర్గీకరణ కోసం గాంధీభవన్ వద్ద అమరులైన ఉద్యమ కారులకు, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుంటే తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ గుర్తించి ఆర్థిక ...3లో

తెలంగాణలో బీసీ జనాభా 1,64,09,179

- ఎస్సీలు 61,84,319
- ఎస్టీలు 37,05,929
- ముస్లింలు 44,57,012
- ఓసీ జనాభా 56,01,539
- అసెంబ్లీలో కులగణన నివేదికను ప్రవేశపెట్టిన సీఎం


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను సీఎం వివరించారు. రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే చేయాలని ఫిబ్రవరి 2024లో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కర్నాటక, బీహార్ సహా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామన్నారు. సర్వే నిర్వహించే విధానాలపై వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నామని ... 10లో

న్యాయవ్యవస్థ నుంచి ఎన్నికల సంఘం వరకు

ప్రతిదీ ప్రభుత్వ నియంత్రణే

దళితులు, మైనార్టీలపై దాడులు : సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో న్యాయవ్యవస్థ నుంచి ఎన్నికల సంఘం వరకు ప్రతిదీ ప్రభు త్వం నియంత్రణలో ఉం దని సీపీఐ(ఎం) రాజ్యసభ ఉపనేత జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. దళితులు, మైనార్టీలపై దాడుల పరంపర కొనసాగుతోందని అన్నారు. మంగళవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో సీపీఐ(ఎం) రాజ్యసభ ఉపనేత జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ దేశంలోని దళిత, మైనారిటీ వర్గాలు సంఘ్ పరివార్ పాలనలో భయంతో జీవిస్తున్నాయని అన్నారు. 'ప్రభుత్వం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అని చెబుతోంది. ఈ పాలసీ బాధితురాలైన మహిళ జాకియా జాఫ్రీ మరణించింది. వారు న్యాయం కోసం తిరిగారు. వారికి మాత్రమే కాదు, గుజరాత్ మారణహోమంలో ఊచకోత కోయబడిన వారందరికీ న్యాయం కోసం ఆమె తిరిగారు. ఆమె భర్త ఎహ్సాన్ జాఫ్రీ లోక్‌సభ సభ్యుడు. అయన్ని కూడా నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఇది మైనారిటీలు ఎదుర్కొంటున్న భయానక వాతావరణం' అని పేర్కొన్నారు.

'ఉత్తరప్రదేశ్‌లో ఏం జరుగుతోంది? వివిధ ప్రాంతాలు తవ్వకాలకు, పరీక్షలకు సిద్ధమవుతో న్నాయి. అజ్మీర్ దర్గా కూడా అదే ముప్పును ఎదుర్కొంటోంది. వాజ్‌పేయి, మోడీ ఇద్దరూ అక్కడ విస్తరించడానికి 'చాదర్‌లను' అందించారు. ఆ దర్గాను కూడా కూల్చివేసేందుకు ... 11లో

రాష్ట్ర యూనివర్సిటీలపై

కేంద్రం పెత్తనం

- వైస్రాయ్‌ల మాదిరిగా వ్యవహరించే గవర్నర్లతో స్వాధీనానికి యత్నం
- యూజీసీ సవరణలు సమాఖ్య సూత్రాలకు విరుద్ధం : రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్
- యూజీసీ సవరణ ప్రతిపాదనలు సమీక్షిస్తాం : కేంద్ర మంత్రి

ప్రతిపక్షాలపై విమర్శలే

సమాధానాల్లేవ్

- పార్లమెంట్‌లో ఢిల్లీ ఎన్నికల ప్రచారం
- లోక్‌సభలో ప్రధాని మోడీ ప్రసంగం
- వికసిత్ భారత్ లక్ష్యం సాధిస్తాం
- పదికోట్ల నకిలీ ఖాతాలు తొలగింపు

11లో..



ఫిరాయింపులపై వివరణివ్వండి

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ ఫిరాయించిన 10 మంది శాసన సభ్యులకు మంగళవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు నోటీసులు జారీ చేశారు. పార్టీ మారడానికి గల కారణాలను వెల్లడించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలా నిర్ణయం తీసుకున్నారని కూడా ప్రశ్నించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ...3లో

కదంతొక్కిన వీఆర్ఏలు

మంత్రుల నివాససముదాయ ముట్టడికి యత్నం

అడ్డుకున్న పోలీసులు, రోడ్డుపైనే నిరసన

జీవో 81, 86 ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం : వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ వారసులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వీఆర్ఏలు కదం తొక్కారు. 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న నియామకాలను వెంటనే చేపట్టాలని మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయాల ముట్టడికి యత్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున తరలివచ్చిన వీఆర్ఏలు మినిస్టర్స్ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని 12వ నెంబర్ కమాన్ వద్ద బారికేడ్లు పెట్టి పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, వీఆర్ఏలకు మధ్య తోపులాట జరిగింది. కొంతమంది బారికేడ్లను దూకి మంత్రుల నివాస



సముదాయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించగా వారిని అరెస్ట్ చేశారు. దాంతో ప్రధాన రహదారిపై బైటాయించి ధర్నాకు దిగారు. 61 సంవత్సరాలు వయస్సు పైబడిన వీఆర్ఏల వారసులకు జీవో 81, 86 ప్రకారం వెంటనే ఉద్యోగాలివ్వాలనీ, ప్రభుత్వం నియమించిన కమిటీ రిపోర్ట్ వెల్లడించాలనీ, దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం, రెవెన్యూ మినిస్టర్ డౌన్‌డౌన్, వీ వాంట్ జస్టిస్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనకు ... 11లో



రెండేండ్లలో 1.55కోట్ల మంది తొలగింపు

ఎంఎన్‌జీఆర్ఈఎస్‌పై లోక్‌సభలో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్‌జీఆర్ఈఎస్) నిర్వీర్యం చేసే దిశగా మోడీ సర్కార్ దుందుడుకుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఎంఎన్‌జీఆర్ఈఎస్ కింద.. 2022-24 మధ్యకాలంలో 1.55 కోట్ల మంది కార్మికుల పేర్లను తొలగించినట్టు ... 11లో

ఏడాదిలో 17,654 కంపెనీలు మూత - రాజ్యసభలో కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రా 11లో..



నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

ఒకే విడతలో 70 నియోజకవర్గాలకు పోలింగ్

8న కౌంటింగ్

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు ఉన్నాయి. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏండ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 ఏండ్ల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న (పీడబ్ల్యూడీ) వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు అధికారులు ప్రకటించారు. ఇక వందేండ్లు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏండ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 గా ఉంది. ఫిబ్రవరి 8న పోలైన ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10తో ముగియనుంది.

పసిగుడ్డు పాలకూ కష్టమైతాంది

అడ్డమీదకు పొద్దుగాల ఆరుగంటలకే అచ్చినా 'కూలి' దొరకట్లేదు

- వారంలో రెండ్రోజులు కూడా పని దొరకట్లే
- నెలసందీ ఇదే కథ.. ఉత్త చేతులతోనే ఇంటికి..
- ఏ రోజుకు ఆరోజే అన్నట్టు అడ్డాకూలీల దీనావస్థ
- ఏడాది కాలంగా పడిపోతున్న నిర్మాణరంగ పనులు

మా ఇంటాయన చానేండ్ల కిందటే కాలం చేసిండు. ఏడాది కింద నా అల్లుడూ చనిపోయిండు. నా బిడ్డకు ఇద్దరు ఆడపిల్లలు, ఓ ఆర్నెళ్ల పసి గుడ్డు ఉంది. నా కొడుకుకూ పెండ్లాం, చిన్నచిన్న పిల్లలు ఉన్నరు. మేమిద్దరం అడ్డమీదికొచ్చాక పని దొరికితేనే నాలుగు వేళ్లు నోట్లోకి పోతు న్నయ్. లేదంటే పస్తులుంటున్నం. కలోగంజో తాగి కాలం ఎల్ల దీసుకొత్తన్నంగానీ.. ఇంట్ల ఉన్న పసిగుడ్డు పాలకు కష్టమైతాంది సారూ'.. అంటూ కరీంనగర్ టవర్ సర్కిల్‌లోని అడ్డా కూలి సమ్మక్క గోడు వెళ్లబోసుకుంది.

ఆ అడ్డాలో ఏ కూలిని కదిలించినా సమ్మక్కలాంటి గాథలే వినిపించాయి. మంగళవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు ఆ అడ్డాలోని పరిస్థితులను గమనించిన 'నవతెలంగాణ'కు.. సమ్మక్కలాగే సుమారు 200 మందిలో 150 మంది వరకూ పని దొరక్క వెంటతెచ్చు కున్న సద్దిమూటలతో తిరిగి ఇండ్లకు పయనమవడం కనిపించింది.

'నేనూ నా కొడుకు పొద్దుగాల ఆరింటికి అడ్డమీదకొచ్చినం. 11గంటలైనా ఒక్క మేస్త్రీరాలే. ఒక్క ఇంటి ఓనరూ కనిపించలే. పని ఉందని పిలిచేటోళ్లులేరు.. ఓ రోజు పని దొరికితే మర్నాడు గ్యారంటీ లేదు. ఏ రోజుకారోజు రేపటి కోసం చింతే మాది. ఏరోజూ ధైర్యంగా నిద్ర పోయింది లేదు. ఎప్పుడూ రేపటి గురించి దిగులే..' ఇది హుస్నాబాద్ మండలం అక్కెనపెల్లి గ్రామానికి చెందిన రాజు మనోవేదన

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఏడాది కాలంగా నిర్మాణ సంబంధిత పనులు మందగించడంతో అడ్డా కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కరీంనగర్‌లో ఉదయం 7గంటలకు టవర్‌సర్కిల్ సహా మరో నాలుగు లేబర్ అడ్డాల్లో 'నవతెలంగాణ' పరిశీలించగా.. ఉదయాన్నే సద్దిమూటలు పట్టుకుని అడ్డాలకు చేరుకుంటున్న



అసంఘటిత రంగంలో పెరుగుతున్న అనిశ్చితి

వారిలో అందరికీ పని దొరకలేదు. 'దొరికితే పనికి, లేదంటే మళ్లీ ఇంటికి. ఏ రోజూ మరుసటి రోజుకి గ్యారంటీ ఉండదు. ప్రతిరోజూ ఆ కూలీల్లో 'రేపెలా?' అనే చింతే కనిపించింది. ఆ అడ్డాల మీదకు వేళ్లమీద లెక్కగట్టే మందే కాంట్రాక్టర్లు, కూలీల అవసరం ఉన్నవారు వచ్చారు. ఒక్కసారిగా ఆశ చిగురించి పదుల సంఖ్యలో ఆ కాంట్రాక్టర్ వద్దకు వెళ్లినా ఆయన ... 11లో

తీవ్ర సంక్షోభంలో నిర్మాణ రంగం

'రియల్' రంగానికి కేరాఫ్‌గా ఉన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఒక్కసారిగా చతికిల పడింది. గతేడాది అక్టోబర్ నుంచి పరిస్థితి మరీ దారుణంగా మారింది. 2024కంటే ముందు పరిస్థితులతో పోల్చితే భూముల క్రయవిక్రయాలు ఉమ్మడి జిల్లాలోని 13 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో 45 శాతానికి పడిపోయాయి. అపార్ట్‌మెంట్లు, సొంత గృహాలు, వాణిజ్య భవనాల వంటి కన్‌స్ట్రక్షన్స్ నెమ్మదించాయి. ఈ ఎఫెక్ట్ గ్రానైట్, ఇటుక, సిమెంట్, కంకర వంటి వాటిపైనా పెను ప్రభావమే చూపింది. ఉమ్మడి జిల్లాలోని 125కిపైగా ఉన్న ఇటుకతయారీ కేంద్రాల్లో ఉత్పత్తి 20 నుంచి 30శాతానికి పడిపోయింది. ఇటుకబట్టీల నిర్వాహకులు ప్రొడక్షన్ తగ్గించుకుని కొన్ని చోట్ల లాభం లేకుండా ధరలు తగ్గించి అమ్ముతున్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా పని చేసే రెండు సిమెంట్ కంపెనీలు తమ ప్రొడక్షన్‌లో 20శాతం వరకు తగ్గించాయని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 380కిపైగా గ్రానైట్ కటింగ్ మిషన్లు ... 11లో

భారతీయులను వెనక్కి పంపిన ట్రంప్



- 205 మందితో భారత్‌కు బయలుదేరిన అమెరికా సైనిక విమానం
- సానుకూలంగా స్పందించిన భారత్
- అక్రమ వలసలకు వ్యతిరేకమని స్పష్టీకరణ

10లో.

అమెరికా X చైనా



- బొగ్గు, చమురు వాహనాలు సహా పలు అమెరికా ఉత్పత్తులపై 10శాతం సుంకాలు
- డబ్ల్యూటీఓలో ఫిర్యాదు నమోదు

వివరాలు 10లో..

రోడ్డెక్కిన రైతన్న



- యూకే ఎడిన్‌బర్గ్‌లో ట్రాక్టర్లపై నిరసన
- వారసత్వ పన్ను మార్పులకు వ్యతిరేకంగా ఆందోళన

వివరాలు 11లో



అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ శాపం

- కార్మిక, కర్షక, శ్రామిక ప్రజలకు వ్యతిరేకం : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్
- బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తిరోగమనంగా దేశ అభివృద్ధికి శాపంగా ఉండనున్నదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్ కాలనీలో తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. బడాబాబుల బొజ్జలను మరింతగా నింపేలా మధ్యతరగతి ఉద్యోగులను మభ్యపెట్టేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ఊతమిచ్చేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయమన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ పదేండ్ల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం మోసం కాక మరేమిటని ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి మోసగించిందన్నారు. బీమా రంగంలో ఎఫ్‌డీఐలను 74 శాతం నుంచి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమేనని చెప్పారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమన్నారు.

ఇలా కేంద్ర ప్రభుత్వం మొండిగా బరితెగించి ప్రజావ్యతిరేక విధానాలను అమలు జరుపుతున్న నేపథ్యంలో శ్రామికులు, కర్షకులు, ప్రజానీకం ఐక్యంగా పోరాటాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్, సీఐటీయూ జిల్లా నాయకులు రవికుమార్, క్రాంతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పాలెం చిన్న రాజేందర్, జిల్లా నాయకులు గట్టు శంకర్, బొడ్డు సునీత, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వంగాల విజయలక్ష్మి, సంగం ప్రీతి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భూక్యా నవీన్, బందు సుధాకర్, సరిత, ఎర్ర సుజాత, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరణ్, తరుణ్, ఎన్పీఆర్డీ నాయకులు గడప శేఖర్, గడ్డం సుమలత తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను తప్పించబోయి..

- మహిళా ఎస్ఐ, యువకుడి మృతి
- జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో ఘటన



నవతెలంగాణ - గొల్లపల్లి/ జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరు వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా ఎస్ఐ మృతిచెందారు. ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఎస్ఐ కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎస్ఐ శ్వేతతోపాటు బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం రాత్రి కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని తన స్వగ్రామం ఆర్నకొండకు వచ్చిన ఎస్ఐ శ్వేత కారులో మంగళవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు జగిత్యాలకు బయలుదేరారు. గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు వద్ద ఎదురుగా వస్తున్న బైకును తప్పించే క్రమంలో కారు రోడ్డు పక్కన చెట్టును ఢీకొని ఆమె మృతిచెందారు. దాంతోపాటు బైక్‌పై వస్తున్న మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన నరేష్ కింద పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం జరిగిన సమయంలో సీటు బెల్టు పెట్టుకోకపోవడంతో ఎస్ఐ శ్వేత ప్రాణం కోల్పోయినట్టు తెలుస్తోంది. 2020బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ శ్వేత గతంలో వెల్గటూరు, కథలాపూర్, పెగడపల్లి, కోరుట్లలో పని చేశారు. ఆమె ఇటీవల కోరుట్ల నుంచి జగిత్యాల డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ఇద్దరి మృతదేహాలకు జగిత్యాల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

59 ఉపకులాలు ..3 గ్రూపులు

ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1లోని 15 ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్ (15 ఉపకులాల జనాభా 3.288శాతం)

గ్రూప్-2లోని 18 ఎస్సీ ఉపకులాలకు 9శాతం రిజర్వేషన్ (18 ఉపకులాల జనాభా 62.748శాతం)

గ్రూప్-3లోని ఎస్సీ 26 ఉప కులాలకు 5శాతం రిజర్వేషన్ (26 ఉప కులాల జనాభా 33.963శాతం) ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు సంబంధించి జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య న్యాయ కమిషన్ ఇచ్చిన నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. మొత్తం 59 ఉపకులాలు, 3 గ్రూపులుగా కమిషన్ ఎస్సీలను వర్గీకరించింది. అయితే రిజర్వేషన్ల పరిధి నుంచి క్రీమీలేయర్ మినహాయింపునకు సంబంధించి కమిషన్ చేసిన 4వ సిఫారసును ప్రభుత్వం తిరస్కరించింది. కమిషన్ ఇచ్చే నివేదికలోని ఉపకులాలు, గ్రూపుల వివరాలివే.

కేటగిరి	గ్రూప్ పేరు	కులాల సంఖ్య	జనాభాలో శాతం (2011 జనాభా లెక్కల ప్రకారం)	సిఫారసు చేసిన రిజర్వేషన్ శాతం
గ్రూప్ - I	సామాజికంగా, ఆర్థికంగా మరియు విద్యాపరంగా అత్యంత వెనుకబడిన/ పట్టించుకోని షెడ్యూల్డ్ కులాలు	15	3.288	1
గ్రూప్ - II	మధ్యస్థంగా లబ్ధి పొందిన షెడ్యూల్డ్ కులాలు	18	62.748	9
గ్రూప్ - III	మెరుగైన ప్రయోజనం పొందిన షెడ్యూల్డ్ కులాలు	26	33.963	5
మొత్తం		59	100	15

గ్రూప్ - I

వరుస సంఖ్య	కులం	కులం పేరు	జనాభా	మొత్తం షెడ్యూల్డ్ కులాల జనాభాలో శాతం
1	8	బావురి	127	0.002
2	9	బేడా (బుడ్గ) జంగం	1,11,710	2.141
3	12	చదాటి	125	0.002
4	17	డక్కల్, డొక్కల్వార్	2558	0.049
5	27	జగ్గలి	2579	0.049
6	29	కొలుపులవాండ్లు, పంబాడ, పంబండ, పంబాలా	931	0.018
7	42	మాంగ్	13260	0.254
8	43	మాంగ్ గరోడి	1392	0.027
9	44	మన్నె	29656	0.568
10	45	మష్టి	1246	0.024
11	46	మాతంగి	704	0.013
12	47	మెహతర్	6973	0.134
13	49	ముండాల	212	0.004
14	55	సంబన్	108	0.002
15	56	సప్రు	44	0.001
మొత్తం			171625	3.288

గ్రూప్ - II

వరుస సంఖ్య	కులం	కులం పేరు	జనాభా	మొత్తం షెడ్యూల్డ్ కులాల జనాభాలో శాతం
1	5	అరుంధతియ	107	0.002
2	10	బిండ్ల	13082	0.251
3	14	చమర్, మోచి, ముచి, చమర్-రవిదాస్, చమర్-రోహిదాస్	17068	0.327
4	15	చంబర్	632	0.012
5	16	చండాల	64	0.001
6	18	దండాసి	86	0.002
7	20	డోమ్, డోంబరా, పైడి, పానో	1926	0.037
8	21	ఎల్లమ్మలవార్, ఎల్లమ్మలవాండ్లు	504	0.010
9	23	గోదారి	208	0.004
10	28	జాంబువులు	108	0.002
11	31	మాదిగ	3233642	61.967
12	32	మాదిగ దాసు, మష్టీన్	1663	0.032
13	51	పామిడి	51	0.001
14	52	పంచమ, పరియ	63	0.001
15	54	సమగర	1046	0.020
16	57	సింధోళ్లు (చిందోళ్లు)	3872	0.074
17	58	యాటల	163	0.003
18	59	వల్లువన్	92	0.002
మొత్తం			[illegible]	[illegible]

గ్రూప్ - III

వరుస సంఖ్య	కులం	కులం పేరు	జనాభా	మొత్తం షెడ్యూల్డ్ కులాల జనాభాలో శాతం
1	1	ఆది ఆంధ్ర	2289	0.044
2	2	ఆది ద్రావిడ	651	0.012
3	3	అనాముక్	17	0.0003
4	4	ఆరె మాల	1992	0.038
5	6	అర్వ మాల	8398	0.161
6	7	బారికి	83	0.002
7	11	బ్యాగర, బ్యాగరి	9672	0.185
8	13	చలవాది	160	0.003
9	19	డోర్	2146	0.041
10	22	ఘాసి, హడ్డి, రెల్లి, చాచండి	84	0.002
11	24	గోసంగి	23351	0.447
12	25	హోలెయా	358	0.007
13	26	హోలెయ దాసరి	8482	0.163
14	30	మాదాసి కురువ, మదారి కురువ	3707	0.071
15	33	మహార్	31938	0.612
16	34	మాల, మాల అయ్యవార్	1527143	29.265
17	35	మాల దాసరి	6630	0.139
18	36	మాల దాసు	925	0.018
19	37	మాల హన్నాయి	37	0.001
20	38	మాలజంగం	3187	0.061
21	39	మాల మస్టి	108	0.002
22	40	మాలసాలె, నేతకాని	133072	2.550
23	41	మాల సన్యాసి	162	0.003
24	48	మిత అయ్యల్వార్	3118	0.060
25	50	పాకి, మోటి, తోటి	947	0.018
26	53	రెల్లి	3025	0.058
మొత్తం			1771682	33.963

వర్గీకరణతో వారికి మేలు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆశాభావం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఎస్సీ కులాల వర్గీకరణ కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న వారికి మేలు జరుగుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం శాసనమండలిలో తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్ కులాల్లోని ప్రత్యేక వర్గాల ఉప వర్గీకరణ - డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ (ఏక సభ్య కమిషన్) నివేదికపై ఆయన ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషన్ ఉపకులాల వారీగా మూడు గ్రూపులుగా చేసిందనీ, నాలుగు సిఫారసులను చేసిందని తెలిపారు. గ్రూప్ 1లో నోటిఫై చేయబడిన భర్తీ కాని ఖాళీలను గ్రూప్ 2 ద్వారా, గ్రూప్ 2లో భర్తీ చేయని ఖాళీలను గ్రూప్3 ద్వారా భర్తీ చేయాలనీ, అన్ని గ్రూపుల్లో తగిన అభ్యర్థులు అందుబాటులో లేకుంటే ఆ ఖాళీలను క్యారీ ఫార్వర్డ్ చేయాలని కమిషన్ సూచించిందని చెప్పారు. రోస్టర్ పాయింట్లను ప్రతిపాదించిందని చెప్పారు. ఈ సిఫారసులను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీ చైర్ పర్సన్లు, మేయర్లు తదితర ప్రజా ప్రతినిధులతో పాటు గ్రూప్1 సర్వీసుల్లో ఉన్న వారిని క్రిమిలేయర్‌గా పరిగణించాలని కమిషన్ చేసిన సిఫారసును తిరస్కరించినట్టు చెప్పారు.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ 2004లో సుప్రీంకోర్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదంటూ కొట్టేశాక కాంగ్రెస్ చేసిన నిర్లక్ష్యం కారణంగానే ఆ వర్గాలకు ఇంకా ఎదురుచూపే మిగిలిందని చెప్పారు. ఇప్పటికైనా వర్గీకరణ బిల్లు ఆమోదించి అమలు చేస్తారని ఆశించినా ఆ దిశగా అడుగులు వేయలేదని చెప్పారు. బీఆర్ఎస్ మొదట్నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం చిత్తశుద్ధితో అసెంబ్లీలో తీర్మానించి కేంద్రంలోని బీజేపీని కోరుతూ వచ్చిందని గుర్తుచేశారు. తమ డిమాండ్లను పట్టించుకోని బీజేపీ, ప్రధాని మోడీ ఎస్సీ వర్గీకరణ తామే చేసినట్టు జబ్బలు చరుచుకుంటున్నారని విమర్శించారు. అమలు ఏ విధంగా చేయబోతున్నారనే స్పష్టత లేదని తప్పుపట్టారు. సభ్యులు బండా ప్రకాశ్ మాట్లాడుతూ రాజ్యాంగంలో క్రిమిలేయర్ పదం లేదనీ, కమిషన్లు తమ పరిధి దాటకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. ఎస్సీల వర్గీకరణ వెంటనే అమలు చేయాలని కోరారు. సభ్యులు ఏ.వీ.ఎన్.రెడ్డి మాట్లాడుతూ క్రిమిలేయర్ వర్తింపజేస్తే ఆయా వర్గాల్లోని అందరికీ రిజర్వేషన్ ఫలితాలు వస్తాయని సూచించారు. సభ్యులు తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ సర్వేపై అనేక అనుమానాలున్నాయనీ, ప్రతిపక్షాలకు అవకాశమివ్వొద్దని సూచించారు. గ్రామాల వారీగా 135 కులాల జనాభాను బయటపెట్టాలని కోరారు. మిగిలిన వారిని కులసర్వేలో చేరిస్తేనే ఈ సర్వే దేశానికి ఆదర్శమవుతుందని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు ఎల్.రమణ మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద ఉన్న ఓటర్ల సంఖ్య, బడి పిల్లల సంఖ్య, ఆరేండ్ల లోపు పిల్లల సంఖ్యను కూడితే, ప్రస్తుత సర్వే లెక్కలు సరిపోలడం లేదని తప్పుపట్టారు. భట్టి సమాధానమిస్తూ, బలహీనవర్గాల మేలు కోరే వారెవరూ ఈ సర్వేను వ్యతిరేకించరనీ, రీ సర్వే కోరబోరని తిప్పికొట్టారు. బీసీల జనాభా 56.33 శాతం ఉందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల జనాభాకు తగినట్టు వారి రిజర్వేషన్లు వాటికవే (ఆటోమేటిక్‌గా) పెరుగుతాయని చెప్పారు.

కక్ష కట్టారు.. వేధించారు

- విచారించకుండానే సస్పెన్షన్ చేశారు
- డీడబ్ల్యూఓ తీరుతో మనోవేదనకు గురై సీడీపీఓ(ఎఫ్ఏసీ) ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ- వెంకటాపురం



గతంలో ములుగు జిల్లా ఐసీడీఎస్ వెంకటాపురం ప్రాజెక్టు సీడీపీఓగా విధులు నిర్వహించిన ప్రస్తుత ములుగు డీడబ్ల్యూఓ శిరీష.. పలు అవకతవకలకు పాల్పడ్డారని, సంక్షేమ శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినందుకే తనపై కక్ష కట్టి వేధింపులకు గురి చేశారని, తనపై ఆరోపణలు రాగానే మరుసటి రోజే విచారణ నిర్వహించకుండా సస్పెండ్ చేశారని మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు ములుగు జిల్లా వెంకటాపురం సీడీపీఓ(ఎఫ్ఏసీ) ధనలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 1వ తేదీన (గత శనివారం) తమను వేధిస్తున్నారంటూ కొందరు అంగన్వాడీ కార్యకర్తలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ నిర్వహించకుండా ధనలక్ష్మిని విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో మనస్తాపం చెందిన ఆమె తన నివాసంలో మంగళవారం పదునైన ఆయుధంతో తన చేతి మణికట్టుపై కట్ చేసుకున్నారు. కాగా, ఉదయం పాలు తీసుకొని వచ్చిన వ్యక్తి ఎంత పిలిచినా ధనలక్ష్మి తలుపు తీయకపోవడంతో తలుపును బలంగా నెట్టి ఓపెన్ చేయగా అప్పటికే ఆమె అపస్మారక స్థితిలో పడి ఉంది. హుటాహుటిన వెంకటాపురం వైద్యశాలకు తరలించగా, వైద్యాధికారి సూర్య పరిశీలించి చికిత్స అందించారు. ఎటువంటి ప్రమాదం లేదని, ధనలక్ష్మి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. అయితే సీడీపీఓపై అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన ఆరోపణలను జిల్లాస్థాయి అధికారులు విచారణ నిర్వహించకుండానే సోమవారం ఆమెను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటన విడుదల చేశారు. విచారణ నిర్వహిస్తే గత సీడీపీఓ, ప్రస్తుత డీడబ్ల్యూఓ శిరీష చేసిన అక్రమాలు, పలు అవకతవకలు బహిరంగమవుతాయని ధనలక్ష్మి విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటాపురం ప్రాజెక్టు పరిధిలో గతంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరారు.

అసలేం జరిగింది?

వెంకటాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పర్శికగూడెం, శాంతినగర్, బోదాపురం, ఏందిర 1, రంగరాజపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వాటికి సంబంధించిన అద్దెను డ్రా చేసుకున్నారని, ఐసీడీఎస్ పరిధిలో అనేక అవకతవకలకు పాల్పడ్డారని ప్రస్తుత డీడబ్ల్యూఓ శిరీషపై సీడీపీఓ ధనలక్ష్మి మహిళా సంక్షేమశాఖ డైరెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా గత డిసెంబర్‌లో ఒక సూపర్‌వైజర్ హాజరు పట్టికలో సంతకాలు చేయకున్నా చర్యలు తీసుకోకుండా అడ్డుకున్నారు. రిటైర్ అయిన అలుబాకా 1 ఆయాకు వేతనాలు చేయాలంటూ ఒత్తిడి చేశారు. ఇలా ధనలక్ష్మిపై కక్ష పెట్టుకున్న డీడబ్ల్యూఓ ఎలాంటి విచారణ చేపట్టకుండానే సస్పెండ్ చేసినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ దివాకర పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి తనకు న్యాయం చేయాలని ధనలక్ష్మి కోరారు.

సోదరి దశదిన కర్మకు కేసీఆర్

నవతెలంగాణ-మేడ్చల్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోదరి చీటి సకలమ్మ దశదిన కర్మకు మంగళవారం హాజరయ్యారు. గత నెల 25న ఆమె అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని చంద్రారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన ఆమె దశదినకర్మ కార్యక్రమానికి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ కుమార్, మాజీ ఎంపీలు జోగినిపల్లి సంతోష్ కుమార్, బోయినపల్లి వినోద్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, శేరి సుభాష్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మెన్‌లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం'లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

ప్రభుత్వ పరంగా కుదరకుంటే పార్టీ పరంగా ఇస్తాం

మీరిస్తారా? బీజేపీ, బీఆర్ఎస్‌లకు సీఎం ప్రశ్న

- భూముల వివరాలు అడిగితే
- కేసీఆర్, కేటీఆర్‌కు భయమెందుకంటూ ఎద్దేవా
- ప్రధాని మోడీ జనాభా లెక్కలు తీయలేదంటూ విమర్శలు



కులగణన నివేదికకు శాసనసభ ఆమోదం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయటానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వపరంగా ఇది సాధ్యం కాకపోతే తమ పార్టీ పరంగానైనా చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్‌ల వైఖరేంటంటూ నిలదీశారు. కులగణన సర్వేలో పాల్గొనని ప్రముఖ పేర్లను రాష్ట్ర అసెంబ్లీలో సీఎం చదివి వినిపించారు. అలాగే వాళ్లు ఎందుకు సర్వేలో పాల్గొనలేదో అనే విషయాన్ని కూడా తెలియజేశారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ అసెంబ్లీలో మంగళవారం చర్చ జరిగిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక కులగణన సర్వేలో అనేక మంది ప్రముఖులు పాల్గొనలేదని తెలిపారు. సర్వేలో పాల్గొనని వారు ఎవరెవరో పేర్లతో సహా సభ ముందు పెట్టారని గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు, మాజీ మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, తన్నీరు హరీశ్ రావు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఈ సర్వేలో పాల్గొనలేదని తెలిపారు. ఇదే విషయంపై పలువురిని అడిగితే "నువ్వు ఇచ్చిన సర్వేలో ఐదో పేజీలో భూమి వివరాలు అడిగాం. ఒక్క దెబ్బకు ఎవరూ సమాచారం ఇవ్వలేదు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడు కోట్లా 54 లక్షల మంది సర్వేలో పాల్గొంటే ఇక్కడున్న ఎమ్మెల్యేలు, మంత్రులంతా వివరాలు ఇచ్చారని తెలిపారు. కానీ భూముల వివరాలు అడిగినందుకే కొందరు సర్వేలో పాల్గొనకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంత ముఖ్యమైన చర్చలో తప్పుడు నివేదికలు తీసుకువచ్చి రచ్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేము చెప్పిన ప్రకారం 15 శాతం ఓసీలు ఉంటే 21శాతం అంటూ తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీ జనాభా 51 శాతం అని.. మేం చేసిన సర్వే ప్రకారం బీసీ జనాభా 56 శాతంగా ఉందని తెలిపారు. సర్వేపై అపోహలు సష్టిస్తున్నారని మండి పడ్డారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ అపోహలు సష్టించేలా మాట్లాడుతున్నారనీ, వెనుక నుంచి అబద్ధాలు, అపోహల సంఘం చెప్పే విషయాలను పటించుకోవద్దని బీఆర్ఎస్ సభ్యులనుద్దేశించి చెప్పారు. 1930 నుంచి ప్రతీ పది సంవత్సరాలకు జనాభా లెక్కలు చేశారని తెలిపారు. 2014లో నరేంద్రమోడీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఈ రోజు వరకు జనాభా లెక్కలు చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బలహీన వర్గాలకు వారి హక్కులు ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేని కారణంగా ఈ జనాభా లెక్కలు చేయడం లేదని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చాక 70 సంవత్సరాలు కొనసాగిన జనాభా లెక్కల ప్రక్రియ మోడీ ప్రధాని అయ్యాక ఎందుకు జరగడం లేదని నిలదీశారు. 2024లో చేపట్టిన ఈ లెక్కలే.. అధికారిక లెక్కలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారికం గా సేకరిస్తున్న సమాచారాన్ని ప్రజా ప్రతినిధులుగా ఉండేవారే పక్కదారి పట్టించి... వివరాలు ఇవ్వకుండా సభలో తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలో పాల్గొనని ఎమ్మెల్యేలు ఇప్పటికైనా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇన్నేండ్లూ ఆలస్యమైనప్పటికీ ఇప్పటికైనా బలహీన వర్గాల కోసం పనిచేద్దామని అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఇస్తుందా అని అసెంబ్లీలో సవాల్ చేశారు.

గత ప్రభుత్వం బయటపెట్టలేదెందుకు...?

గత ప్రభుత్వం సమగ్ర సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. "స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తాం.. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం" అని అన్నారు.

బీఆర్ఎస్ నిరసన


సీఎం, మంత్రుల మాట్లాడుతున్న క్రమంలో తమకూ మైక్ ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌ను పదే పదే అడిగారు. మధ్యమధ్యలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి సర్వే, అది ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరంగా చెప్పారు. అంతకుముందు హరీశ్‌రావు తోపాటు ఇతర సభ్యులంతా మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్ పోడియం దగ్గర వెళ్లారు. సీఎం రేవంత్ మాట్లాడుతున్న క్రమంలో బీఆర్ఎస సభ్యులు లేచి నిలబడ్డారు. నినాదాలు చేస్తూ నిరసన చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే, 42 శాతం రిజర్వేషన్ల బిల్లు పెడుతున్నరేమో అనుకున్నామని అన్నారు. చివరకు ఏదో సర్వే రిపోర్టు పెట్టారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చారిత్రాత్మక ప్రత్యేక శాసనసభ సమావేశాల్లో కామారెడ్డి డిక్లరేషన్ తరహాలో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయడానికి బిల్లు ప్రవేశపెడతారేమోననీ, ఆ బిల్లును శాసనసభలో ఆమోదింపజేసి, చట్టబద్ధత కల్పిస్తారేమోనని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. కానీ, సీఎం లేచి నాలుగుపేర్లు చదువుతున్నారనీ, మీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదని వ్యాఖ్యానించారు. గతంలో సీఎం రేవంత్ చేసిన ప్రసంగం యూట్యూబ్‌లో ఉందన్నారు. గతంలో ఎస్‌కేఎస్ సర్వే జరిగినప్పుడు 57 రకాల వివరాలు అడుగుతున్నరు ఎట్లిస్తం ? అని మీరే అన్నారని గుర్తు చేశారు. ఎవరు పడితే వారికి ఇచ్చేస్తామా ? అన్న విషయాన్ని ప్రస్తావిం చారు. శాంతికుమారి, రామకృష్ణారావు, సందీప్‌కుమారి సుల్తానీయా ఉన్నారు, అప్పుడు ఉన్నది అదే అధికారులు, వేరే ఎవరో లేరు. రికార్డు ప్రకారం మాట్లాడుతున్నాను. సమగ్ర కుటుంబ సర్వే చేయించింది ప్రభుత్వమే. ప్రభుత్వ అధికారులే. అది కచ్చితంగా అధికారిక డాక్యుమెంటు అని, వెబ్‌సైట్‌లో పెట్టామని వివరించారు. ఈ నివేదిక అంతా తప్పులతడక అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అన్నారనీ, దాన్ని తగలబెట్టాలని చెబుతున్నారని చెప్పారు. బీసీల జనాభా సంఖ్య సమగ్ర కుటుంబ సర్వేలో ఉందన్నారు. ఈ సర్వేలో 1.85లో ఉన్న బీసీలు ఎట్లా 1.64 లక్షలకు తగ్గారు.. 51 శాతం 46 శాతం ఎలా అయ్యిందని అడుగుతున్నారని చెప్పారు.

సర్వేను సమర్థిస్తున్నాం : అక్బరుద్దీన్



ప్రభుత్వం చేపట్టిన సర్వేను సమర్థిస్తున్నామని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ చెప్పారు. అయితే అసెంబ్లీలో టేబుల్ రూపంలో నివేదికను పెట్టకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే తప్పులను సరిచేయాలని కోరారు. నివేదికను వంద పేజీల రూపంలో అసెంబ్లీలో చర్చకు పెట్టాలని సూచించారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వేలోనూ పొరపాట్లు జరిగాయని అన్నారు. పూర్తిగా అధ్యయనం చేసి వచ్చానని అయన చెప్పారు. బీసీల తరపున ఎంఐఎం పోరాడుతుందన్నారు. బీసీ సర్వేకు పూర్తిస్థాయిలో సమర్థిస్తున్నానని చెప్పారు. సర్వేలో తప్పులను సరిచేసేందుకు ఏఐ టూళ్లను వాడుకోవాలని సలహా ఇచ్చారు. చర్చ అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచన మేరకు నివేదికను సభ ఆమోదానికి పెట్టాలని సీఎం చెప్పారు. సభ్యులంతా చప్పట్లు కొడుతూ కులగణన నివేదికను ఆమోదించారు.

ఏం చేయబోతున్నారు: కూనంనేని



సమగ్ర కుటుంబ సర్వే చేసి బీసీ లెక్కలు తేల్చడం సంతోషకరమని ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు అభిప్రాయపడ్డారు. వాటితో భవిష్యత్‌లో ఏం చేయాలను కుంటున్నారో ప్రభుత్వం చెప్పలేదన్నారు. గతంలో ఎవరూ చేయని పని చేశారంటూ అభినందించారు. తప్పులను సరిచేయాలని సూచించారు. ఒక్కరోజు సర్వేకు, రెండున్నర నెలల సర్వేకు కచ్చితంగా తేడా ఉందని చెప్పారు. రిజర్వేషన్లు ఏమైనా పెంచుతారా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలు, బీసీలకు నైపుణ్యం ఉంటుందని అదే వారికి శాపంగా మారిందని తెలిపారు.

దేశవ్యాప్తంగా కుల సర్వేను నిర్వహించాలి

- కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా కుల సర్వేను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర శాసనసభ తీర్మానించింది. ఈ తీర్మానం ఇలా ఉంది. "తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వేను నిర్వహించింది. ఈ సర్వే రాష్ట్రంలోని వివిధ కులాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ స్థితిగతులను వెలుగులోకి తెచ్చింది. తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతులు (బీసీ), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), రాష్ట్రంలోని ఇతర బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంది. రాష్ట్రంలోని వివిధ కులాల మధ్య వెలువడిన అసమానతలను తగ్గించడానికి అనుకూల విధానాలు, అఫెర్మెటివ్ పాలసీలను రూపొందించడానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉంది. దేశ స్వాతంత్ర్యం నాటి నుంచి ఎదురుచూస్తున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి ఆచరించడం ఆదర్శనీయం. దేశంలోని వివిధ కులాల సంబంధిత స్థితిగతులను అర్థం చేసుకోవడానికి, తెలంగాణలో నిర్వహించిన విధంగానే దేశవ్యాప్తంగా ఇంటింటి సమగ్ర సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వేను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సభ తీర్మానిస్తున్నది."

ఎస్సీ వర్గీకరణను ముందుగా మేమే అమలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పోతుందన్నారు. చాలా రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయే తప్ప...ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదన్నారు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించామన్నారు. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

న్యాయపరమైన చిక్కులు రాకుండా కార్యాచరణ

ఎస్సీ కులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు దేశంలోనే మిగతా రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. ఆయా వర్గాల వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటన చేయటం ద్వారా తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసే బాధ్యతను తమ ప్రభుత్వం, మంత్రులు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా న్యాయ పరమైన ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చర్యలు చేపట్టిందని తెలిపారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును అధ్యయనం చేయటంతోపాటు దానితో ముడిపడి ఉన్న వివిధ అంశాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన సిఫారసులు చేయాలని కోరుతూ గతేడాది సెప్టెంబర్ 12న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన కమిటీ నియమించామన్నారు. ఈ క్రమంలో పలు దఫాలుగా సమావేశమైన కమిటీ...ఎస్సీ వర్గీకరణ అంశంపై విస్తృత చర్చలు జరిపిందని తెలిపారు. ఇందులో భాగంగా ఇతర రాష్ట్రాల్లోనూ ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అమలు తీరును అధ్యయనం చేసేందుకు సీనియర్ అధికారుల బృందాన్ని పంజాబ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలకు పంపిందని చెప్పారు. తర్వాత సుప్రీంకోర్టు తీర్పు అమలుకు అనుసరించాల్సిన విధానాలపై రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ నుంచి న్యాయ సలహాను స్వీకరించిందని తెలిపారు. విస్తృత సమావేశాలు, సంప్రదింపుల తర్వాత వర్గీకరణపై లోతైన అధ్యయనం కోసం ఏకసభ్య న్యాయ కమిషన్ వేయాలని కమిటీ సిఫారసు చేసిందని సీఎం వివరించారు. ఈ కమిషన్ రాష్ట్రంలోని ఎస్సీ కులాలు, ఉపకులాల హేతుబద్ధమైన వర్గీకరణకు అందుబాటులో ఉన్న జనాభా గణన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేపట్టిందని సీఎం గుర్తు చేశారు. ఎస్సీల్లోని వివిధ ఉప సమూహాల మధ్య ఉన్న అంతరాలు గుర్తించేందుకు సమగ్ర అధ్యయనాలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల్లో తగినంత ప్రాతినిధ్యం లేకపోవడంపై దృష్టి సారించిందని చెప్పారు. ఎస్సీల్లోని ఉపసమూహాల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా వెనుకబాటుతనానికి సంబంధించిన వివిధ కోణాలను పరిశీలించిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ కులాల ఉప వర్గీకరణను సమర్థవంతంగా అమలు చేసే విధానంపై నివేదిక ఇచ్చిందన్నారు. రిజర్వేషన్ ప్రయోజనాలను షెడ్యూల్డ్ కులాల్లోని వివిధ ఉప సమూహాలకు పంపిణీ చేసేందుకు చేపట్టాల్సిన ఇతర చర్యలను సూచించిందని తెలిపారు. వీటితోపాటు ఎస్సీల (59 కులాలు) జనాభా, అక్షరాస్యత, ఉపాధి, విద్యా సంస్థలలో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, ఆర్థిక సహాయం, రాజకీయ ప్రాతినిధ్యాలకు సంబంధించిన డేటాను అన్ని ప్రభుత్వ విభాగాలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి విచారణ కమిషన్ సేకరించిందని వివరించారు. వీటన్నింటితో పాటు వివిధ సంస్థలు, సంఘాలు ఇచ్చిన వినతి పత్రాలను, అన్ని విభాగాల నుంచి అందిన సమాచారాన్ని కమిషన్ వివరంగా పరిశీలించి తమ నివేదికను తయారు చేసిందన్నారు. కేవలం 82 రోజుల వ్యవధిలో అధ్యయనం పూర్తి చేసిన కమిషన్ ఈ నెల 3న ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇచ్చిందన్నారు. అంతకు ముందు తెలంగాణ శాసన మండలి కూడా ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిందన్నారు. ఎస్సీల్లో మొత్తం 59 ఉపకులాలను గుర్తించినట్టు కమిషన్ పేర్కొందన్నారు. ఎస్సీలను గ్రూప్-1, 2, 3గా వర్గీకరించాలని సిఫారసు చేసిందన్నారు. గ్రూప్-1లోని 15 ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్ (జనాభా 3.288 శాతం), గ్రూప్-2లోని 18 ఎస్సీ ఉపకులాలకు 9శాతం రిజర్వేషన్ (జనాభా 62.74 శాతం), గ్రూప్-3లోని 26 ఉప కులాలకు 5శాతం రిజర్వేషన్ (జనాభా 33.963శాతం) కల్పించాలని వర్గీకరణ కమిషన్ తన నివేదికలో పేర్కొన్న విషయాన్ని సీఎం వెల్లడించారు.

ఫిబ్రవరి 4న తెలంగాణ సోషల్ జస్టిస్ డే

ఇక ఎవరూ ప్రాణత్యాగాలు చేయాల్సిన అవసరం లేదు

కులగణన కోసం కేంద్రంపై వత్తిడి చేస్తాం

వర్గీకరణ కోసం ఇతర రాష్ట్రాలకు సహకారం అందిస్తాం : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీని ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ సోషల్ జస్టిస్ డే నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో చర్చ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. 2024 ఫిబ్రవరి 4వ తేదీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నామనీ, 2025 ఫిబ్రవరి 4న దాన్ని చట్టరూపంలోకి తెస్తున్నామనీ, అందుకే ఆ తేదీకి ప్రత్యేకత ఉన్నదనీ, దాన్నే తెలంగాణ సోషల్ జస్టిస్ డేగా గుర్తిస్తున్నామని వివరించారు. సుదీర్ఘకాలంగా బడుగు, బలహీనవర్గాలు, మాదిగ ఉప కులాలకు చెందాల్సిన అవకాశాల కోసం పోరాడుతున్నారనీ, దానికోసం ఎన్నో త్యాగాలు, ఆత్మ బలిదానాలు చేశారనీ, అమరుల త్యాగాలకు నీరాజనాలు అని చెప్పారు. ఇన్నేండ్లకు వారి కలలు సాకారం అవుతున్నాయనీ, వారి బలిదానాలు ఊరికే పోలేదని బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఇకపై ఎవరూ ఎలాంటి త్యాగాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. పై బిల్లులకు మంత్రులు, మంత్రివర్గ ఉపసంఘం, అధికారులు సంపూర్ణంగా సహకరించారనీ, శాసనసభలో వర్గీకరణకు ఆమోదం తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. క్రీమీలేయర్ విధానాన్ని శాసనసభ తిరస్కరించిందనీ, ఏబీసీ కేటగిరి అమలు చేస్తామని వివరించారు. ఈ బిల్లులకు చట్టరూపం తెస్తామనీ, ఎవరు అధికారంలో ఉన్నా విధిగా వీటిని సంపూర్ణంగా అమలు చేయాల్సిందేనని చెప్పారు. దేశవ్యాప్తంగా కులగణనకోసం కేంద్రంపై వత్తిడి తెస్తామన్నారు. బలహీనవర్గాలు, మాదిగ ఉపకులాల వర్గీకరణ కోసం ఇతర రాష్ట్రాలకు సహకారం అందిస్తామని తెలిపారు.

అసెంబ్లీ వాయిదా

ఎస్సీ వర్గీకరణ, కులగణనపై చర్చలు, సభ ఆమోదం అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ శాసనసభను నిరవధికంగా వాయిదా వేశారు. సహకరించిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

కుల సర్వే శాస్త్రీయమైనదే



కాదంటే ఉపాధ్యాయులను అవమానించినట్టే

మిగిలిన వారిని సర్వేలో చేర్చాలి : శాసనమండలిలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో చేసిన కుల సర్వే శాస్త్రీయంగా జరిగిందనీ, కాదని ఎవరైనా అంటే ఉపాధ్యాయులను అవమానించినట్టేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. మంగళవారం శాసనమండలి ప్రత్యేక సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే -2024 నివేదికను శాసనమండలిలో ప్రవేశపెట్టారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్ కులాల్లోని ప్రత్యేక వర్గాల ఉప వర్గీకరణ-డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ (ఏక సభ్య కమిషన్) నివేదికపై ప్రకటన చేశారు. ఈ సందర్భంగా అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ సర్వే నివేదికను స్వాగతిస్తున్నట్టు తెలిపారు. సర్వేలో వివరాలు చేర్చని వారు మిగిలి ఉంటే వారిని కూడా చేర్చాలని సూచించారు. కొన్ని మండలాలు, గ్రామాలను ఎంపిక చేసి రీవెరిఫై చేస్తే సరిపోతుందని తెలిపారు. పెరిగిన ఎస్సీ, ఎస్టీ జనాభా దామాషా ప్రకారం వారి రిజర్వేషన్లను పెంచాలని కోరారు.

రాష్ట్రానికి పైసా తేలేకపోయారు

బీజేపీ మంత్రులు, ఎంపీలున్నా ప్రయోజనం శూన్యం



ఆరు గ్యారంటీల అమలుకు ప్రజాపోరాటాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు బీజేపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ రాష్ట్రానికి నిధులు తేవడంలో ఘోరంగా విఫలమయ్యారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు విమర్శించారు. ప్రయివేట్ పెట్టుబడులకు పెద్దపీట వేశారని, ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాల్ని చూపలేకపోయారని అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాల కొనసాగింపుగానే కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టారని అన్నారు. ప్రయివేట్ పెట్టుబడుల వల్ల క్రోని క్యాపిటలిజంతో కొద్దిమంది సంపన్నులే శతకోటీశ్వరులు అవుతున్నారని, ప్రజలందరూ అభివృద్ధి చెందే పరిస్థితి లేకుండా పోతుందని తెలిపారు. ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు బడ్జెట్‌లో ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు లేవన్నారు. మధ్యతరగతి కుటుంబాలకు రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల కొంత ప్రయోజనం చేకూరినప్పటికీ దానివల్ల కేంద్ర ప్రభుత్వానికి లక్ష కోట్ల రూపాయల ఆదాయం తగ్గనుందన్నారు. ఆ లోటును కార్పొరేట్లకు పన్ను విధించడం ద్వారా సమకూర్చుకోవాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం అలాంటి ప్రయత్నం ఏమి చేయలేదన్నారు. ఫలితంగా సంక్షేమ పథకాలకు కోత విధించే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నదని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు 50 శాతం వరకు తగ్గినప్పటికీ దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు పైపైకిపోతున్నాయన్నారు.

బడ్జెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు గురించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం వల్ల దేశ ప్రజలకు తీరని నష్టం వాటిల్లనుందన్నారు. కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం గ్యారంటీ చేస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి మార్కెట్‌లో సరుకుల క్రయవిక్రయాలు పెరుగుతాయని, తద్వారా ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు అవకాశం ఏర్పడు తుందని తెలిపారు. జీడీపీ పెరుగుదలకు శ్రామికుల శ్రమశక్తి బలమైన కారణమని, కార్మికులు, రైతులు, శ్రామికులు సంపదలను సృష్టిస్తుంటే జీడీపీ పెరుగుతుందని అన్నారు. కానీ వారి సంక్షేమానికి ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు.

మహాసభలను జయప్రదం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు : చుక్క రాములు

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు సంగారెడ్డి పట్టణంలో అత్యంత విజయవంతం కావడానికి సహకరించిన కార్మికులు, కర్షకులు, ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చుక్క రాములు అన్నారు. మూడు నెలల పాటు కష్టపడి మహాసభల విజయవంతం కోసం కృషి చేసిన పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మూడ్రోజులపాటు జరిగిన ప్రతినిధుల మహాసభలు, ఒకరోజు జరిగిన బహిరంగ సభ, ర్యాలీని అత్యంత జయప్రదంగా నిర్వహించిన ఆహ్వాన సంఘం కృషి అభినందనీయమన్నారు. వివిధ రూపాల్లో మహాసభల జయప్రదం కోసం సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బీరం మల్లేశం, కె.రాజయ్య, అతిమేల మాణిక్, యం.నరసింహులు పాల్గొన్నారు.

ఫిరాయింపులపై వివరణివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. అయితే వివరణ ఇచ్చేందుకు సమయం కావాలని ఆయా ఎమ్మెల్యేలు కోరినట్టు సమాచారం గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది శాసన సభ్యులు ఆ పార్టీని వీడి అధికార పార్టీలో చేరారు. దీంతో వారి సభ్యత్వం రద్దు చేయాలని బీఆర్ఎస్ గత కొంతకాలంగా న్యాయస్థానాల్లో పోరాడుతున్న సంగతి విదితమే.

బీఆర్ఎస్ అలర్ట్

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు నోటీసులు రావడంతో గులాబీ బాస్ కేసీఆర్ అలర్ట్ అయ్యారు. శాసన సభలో పార్టీ విప్‌గా కేపీ వివేకానందను, శాసనమండలిలో పార్టీ విప్‌గా ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను నియమించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఎంఎల్ఏ, ఎమ్మెల్సీలు స్పీకర్‌ను కలిసి పార్టీ నిర్ణయాన్ని తెలిపారు. పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ను, శాసనమండలి చైర్మెన్‌ను ఈ సందర్భంగా విప్‌లు కోరారు.

ఎస్సీవర్గీకరణకు సంపూర్ణ మద్దతు : కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

సహాయం అందించారని గుర్తుచేశారు. 2014, 19లో అప్పటి సీఎం అసెంబ్లీలో వర్గీకరణపై తీర్మానించిన విషయాన్ని గుర్తుచేశారు. తీర్మాన కాపీని నేరుగా ప్రధాని మోడీకి అందజేశామన్నారు. సామాజిక స్వేచ్ఛ లభించకుండా.. చట్టం ద్వారా లభించే ఏ హక్కు అయినా నిరర్థకమన్న అంబేద్కర్ స్ఫూర్తితో బోధించు సమీకరించి పోరాడు అన్న ఆయన నినాదంతో మా పార్టీ ముందుకు పోయిందన్నారు. వర్గీకరణ కోసం సుప్రీంకోర్టులో దేశంలోని ప్రముఖ న్యాయనిపుణులను పెట్టి కేసు వాదించామన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అవకాశాలు ఉండాలని జస్టిస్ షమీం అక్తర్ నివేదిక చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ హయాంలో దళిత పారిశ్రామిక వేత్తలను తయారు చేశామన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ ఇచ్చిన దళిత గిరిజన డిక్లరేషన్ లో ఇచ్చిన హామీల మేరకు 12 లక్షల దళిత బందును ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు 18 శాతం, గిరిజనులకు 12 శాతం ప్రభుత్వ కాంట్రాక్టు ప్రొక్యూర్‌మెంట్‌లో రిజర్వేషన్ ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.

ఆర్థిక అసమానతలకు ఊతం

ధనికులను.. మరింత ధనికులుగా చేయాలనేదే కేంద్రం ఉద్దేశం

మోడీ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆర్థిక నిపుణులు



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ 2025ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఇందులో రూ.12 లక్షల వరకు వార్షికాదాయం ఉన్నవారికి ఆదాయపన్ను మినహాయింపును ప్రకటించారు. దీంతో వేతన జీవులకు తాము భారీ ఉపశమనాన్ని కల్గించామని మోడీ సర్కారు చెప్పుకుంటున్నది. అయితే,ప్రభుత్వ విశ్లేషణను కొందరు ఆర్థిక నిపుణులు తప్పుబడుతున్నారు. గత ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ప్రభుత్వం ఈ సారి అధిక మొత్తంలో ఆదాయపన్ను రూపంలో ఆర్జించాలని చూస్తున్నదనీ, దానిని బట్టి చూస్తే పన్నుచెల్లింపు వర్గాలలో ఆదాయాలు చాలా పెరగాల్సి ఉంటుంది. ఇదే ప్రజలలో ఆర్థిక అసమానతలకు దారి తీస్తుందని అంటున్నారు. ధనవంతులను.. ఇంకా సంపన్నులుగా చేయాలను కుంటున్న ప్రభుత్వ విధానం ఇందులో స్పష్టంగా కనబడుతున్నదని విశ్లేషిస్తున్నారు. ఇందుకు కొన్ని గణాంకాలను వారు ఉదహరిస్తున్నారు. వీరి విశ్లేషణను బట్టి చూస్తే.. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2022-23లో 2.9 కోట్ల మంది వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ఆదాయపన్ను చెల్లించాయి. వీరిలో దాదాపు 1.25 కోట్ల మంది తమ ఐటీ రిటర్న్‌లలో పన్నుకు ముందు రూ.10 లక్షల కంటే ఎక్కువ స్థూల ఆదాయం ఉన్నట్టు ప్రకటించారు. కొత్త ఆదాయపన్ను రేట్లు ప్రారంభమయ్యేనాటికి ఈ వ్యక్తులు రూ.12 లక్షల ఆదాయ పరిమితిని దాటి ఉంటాచరని చెప్పొచ్చు. కాబట్టి ఈ 1.25 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులు 2025-26లో పన్నులు చెల్లించే అవకాశమున్నది. 2022-23లో చెల్లించిన మొత్తం పన్నులలో ఈ వ్యక్తులు దాదాపు 60 శాతం వాటాను కలిగి ఉన్నారు. వారు తమ స్థూల ఆదాయంలో దాదాపు 13 శాతం ఆదాయపన్నుగా చెల్లించారు. భారత్‌లోని అత్యంత ధనవంతులు ఎక్కువగా మూలధన లాభాల నుంచి సంపాదిస్తారనీ, ఇది తక్కువ పన్నులను ఆకర్షిస్తుందని నిపుణుల అంచనా. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. 2022-23లో.. ఈ వ్యక్తులు మొత్తం స్థూల ఆదాయం రూ.38 లక్షల కోట్లపై రూ.5 లక్షల కోట్ల ఆదాయపన్ను చెల్లించారు. అయితే, 2025-26లో ప్రభుత్వం వారి నుంచి రూ.14 లక్షల కోట్లకు పైగా వసూలు చేయాలని భావిస్తున్నది. అంత ఆదాయపన్ను చెల్లించాలంటే వారి సంపాదన దాదాపు రూ.95 లక్షల కోట్లుగా ఉండాలి. అంటే, వారి స్థూల ఆదాయం 2022-23 నుంచి 2025-26 మధ్య సంవత్సరానికి 36 శాతం చొప్పున పెరగాలి. అది నామినల్ జీడీపీ వృద్ధి రేటు కంటే 3.5 రెట్లు ఎక్కువ. 2013-23 మధ్య సదరు వ్యక్తుల స్థూల ఆదాయం సంవత్సరానికి సుమారు 8.5 శాతం పెరిగింది. నామినల్ జీడీపీ మాత్రం 10.5 శాతం పెరిగింది. కాబట్టి.. వ్యక్తుల స్థూల ఆదాయం అకస్మాత్తుగా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తే.. అసమానత పెరగటాన్ని ఆశించటమేనని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. అంటే.. ధనవంతులు మరింత ధనవంతుల కావాలన్నది ప్రభుత్వ ఉద్దేశమవుతుందని అంటున్నారు. వేతన జీవులకు ఉపశమనం కల్పించామని చెప్తూ.. ధనవంతులు, బడా పారిశ్రామికవేత్తల, కార్పొరేటు శక్తులకు ఫలాలు చేకూరేలా కేంద్రబడ్జెట్‌లో ఆదాయపన్ను మినహాయింపు ఉన్నదని వివరిస్తున్నారు. ఈ 1.25 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులు 1 కోటి కుటుంబాలలో విస్తరించి ఉండే అవకాశమున్నది. భారత్‌లో మొత్తం 34 కోట్ల కుటుంబాలు ఉంటాయని అంచనా. దీని ప్రకారం.. ఇది వీరిని భారత్‌లోని అత్యంత ధనిక మూడు శాతం గృహాలలో ఉంచుతుందని విశ్లేషకులు చెప్తున్నారు.

సంపాదకీయం

విద్యకు ప్రాధాన్యతేది?

'దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుంది' అని పెద్దలంటారు. కానీ పాలకులకు దీని అభివృద్ధి పట్టదు. నాణ్యమైన విద్యను అందిస్తామని హామీనిచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ మాటను ఎప్పుడో మర్చిపోయింది. బడ్జెట్‌లో విద్యకు చేస్తున్న కేటాయింపులు ప్రపంచ దేశాలతో పోల్చితే చాలా తక్కువ. సోషలిస్టు క్యూబాతోనే కాదు అనేక పశ్చిమ, యూరోపియన్ దేశాలు, ఇతర అభివృద్ధి చెందుతున్న బ్రెజిల్, దక్షిణాఫ్రికా, కెన్యా లాంటి దేశాల కంటే చాలా తక్కువ కేటాయింపులు జరుగుతున్నాయి. విద్యారంగం మీద ప్రాధాన్యం మేరకు ఖర్చు చేస్తున్న దేశాలు అభివృద్ధి సాధిస్తున్నాయి. ఈ విషయంలో ఎంతోమంది అనేక రకాల సూచనలు చేసినా, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలూ నివేదికల రూపంలో అందించినా అవి బుట్టదాఖలే. యూపీఏ హయాంలో విద్యారంగం నాశనమైందని, తాము వస్తే నాణ్యమైన విద్యనందించే విధంగా బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయిస్తామని బీజేపీ చెప్పింది. కానీ 2013-14 నుంచి 2024-25 వరకు విద్యకు కేటాయించిన నిధులు నామమాత్రమే. తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్లోనూ అదే పరిస్థితి. "ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్" పేరుతో వేద విద్యకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడమంటే విద్యలోకి మతాన్ని జొప్పించడమే.

ఉన్నత విద్యను మెరుగుపరిచేందుకు భారీగా నిధులు అవసరం. అయితే, ఆ మేరకు నిధుల కేటాయింపు జరగడం లేదు. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో ఈ అంశం పట్టించుకోలేదు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, నిట్‌లు, ఇతర కేంద్ర-రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యనందించడంలో కష్టాలను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ 200 విశ్వవిద్యాలయాల్లో భారతీయ యూనివర్సిటీలు మూడు మాత్రమే ఉన్నాయి. దీనకంతటికీ సరైన నిధుల కేటాయింపులేకపోవడమే. నిధుల కేటాయింపు లేకుండా భారతీయ సంస్థలు అంతర్జాతీయంగా పోటీపడలేని పరిస్థితి.



బీజేపీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది 2013-14 బడ్జెట్‌లో 3.16 శాతం నిధులను విద్యకు కేటాయించగా, 2024-25లో అది 1.53 శాతానికి తగ్గిపోయింది. ఉన్నతవిద్యకు కేటాయింపులు 2013-14లో 1.6 శాతం ఉండగా 2024-25లో ఒక శాతానికి పడిపోయాయి. 2025-26 బడ్జెట్‌లో 2.53 శాతం నిధులను మాత్రమే విద్యకు కేటాయించారు. అందులో పాఠశాల విద్యకు 1.5 శాతం, ఉన్నత విద్యకు 0.98 శాతం నిధులు దక్కాయి. ఈ మాత్రం నిధులతో దేశంలోని లక్షా 50వేల ఉన్నత పాఠశాలల్లోని పదివేల బడుల్లో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను అభివృద్ధి చేస్తామని, వచ్చే నాలుగేండ్లలో నలభైవేల పాఠశాలలకు విస్తరిస్తామని ప్రతిపాదించారు. పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని, రూ.500 కోట్లతో ఏఐ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఆర్థికమంత్రి సెలవిచ్చారు. గతం కంటే ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకున్నా ఆ తర్వాత సవరించిన అంచనాల్లో తగ్గడం గ్యారంటీ. గతేడాది సీఎం పోషణ కింద (మధ్యాహ్న భోజనం పథకం కోసం) రూ.12 వేల కోట్లు కేటాయింపులు జరిగినా సవరించిన అంచనాల్లో పది వేల కోట్లు వరకు పరిమితమైంది. ప్రయోగశాలల అభివృద్ధిలోనూ మార్పులేదు.

ఉన్నత విద్యను మెరుగుపరిచేందుకు భారీగా నిధులు అవసరం. అయితే, ఆ మేరకు నిధుల కేటాయింపు జరగడం లేదు. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో ఈ అంశం పట్టించుకోలేదు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, నిట్‌లు, ఇతర కేంద్ర-రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యనందించడంలో కష్టాలను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ 200 విశ్వవిద్యాలయాల్లో భారతీయ యూనివర్సిటీలు మూడు మాత్రమే ఉన్నాయి. దీనకంతటికీ సరైన నిధుల కేటాయింపులేకపోవడమే. నిధుల కేటాయింపు లేకుండా భారతీయ సంస్థలు అంతర్జాతీయంగా పోటీపడలేని పరిస్థితి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కూడా బడ్జెట్ ప్రాధాన్యం ఇవ్వలేదు. పరిశోధనారంగాన్ని ఈ పదేండ్లలో నిర్లక్ష్యం చేశారు. దేశ అభివృద్ధికి ఉపయోగపడే ఒక్క పరిశోధన కూడా జరగలేదు. ఉపాధిని పెంపొందించడానికి బలమైన వృత్తి శిక్షణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల కోసం సిఫారసులు చేసినప్పటికీ ఆ దృష్టి లేకుండా పోయింది.

ఇటీవలి కాలంలో ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాముఖ్యత తగ్గించి, ప్రయివేట్ రంగాన్ని ప్రోత్సహించే విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. విద్యాసంస్థలు ఆర్థికంగా స్వయం పోషితమవ్వాలనే పేరుతో వాటి ఫీజులను పెంచడం, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యతనివ్వడం, ప్రభుత్వ సహాయాన్ని తగ్గించడం, ఉపాధ్యాయ నియామకాలను తగ్గించడం వంటివి ప్రభుత్వ విధానాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. నూతన జాతీయ విద్యావిధానంలో పేదలకు ఉన్నత విద్య నిరాకరించబడుతోంది. ఈ ప్రయివేటీకరణ ధోరణితో సామాన్యులకు ఉన్నత విద్య మరింత ఖరీదైనదిగా మారుతోంది. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండగా, ప్రభుత్వం బడ్జెట్లో అతి తక్కువ నిధులు కేటాయిస్తూ మౌలిక సౌకర్యాల విషయంలో శ్రద్ధ వహించడం లేదు. ఇది ప్రయివేటు విద్యాలయాల వైపు విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగమే. వాస్తవానికి కొఠారి కమిషన్ ఆరుశాతం స్థూల జాతీయ ఆదాయాన్ని విద్యారంగానికి కేటాయించాలని సూచించింది. ఆ రకంగా విద్యా బడ్జెట్‌ను పెంచి, సామాన్యులకు నాణ్యమైన విద్యనందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యావ్యవస్థ అభివృద్ధి చెందాలంటే, ప్రజలు, విద్యార్థులు, విద్యావేత్తలు అందరూ కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

'ప్రజల మనిషి'...వట్టికోట

అతనొక కమ్యూనిస్టు నేత, అభ్యుదయ రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఓ పోరుపతాక. 'ప్రజలమనిషి' నవల ద్వారా ప్రజల కోసం పనిచేసే నాయకులు ఎలా ఉండాలో దిశానిర్దేశం చేసిన నాయకుడు. ఆయనే ...వట్టికోట అళ్వారుస్వామి. గ్రంథాలయ ఉద్యమకారుడిగా, ప్రచురణకర్తగా తన జీవితంలో విశిష్టమైన పాత్ర పోషించారు "ఒక సందర్భంలో అసలు ఆళ్వార్లు పన్నెండు మందే, పదమూడో ఆళ్వారు మా వట్టికోట ఆళ్వారుస్వామి" అని మహాకవి దాశరథి కీర్తించిన ప్రజారచయిత, నిస్వార్థ సేవా పరాయణుడు వట్టికోట. నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం మండలం (నకిరేకల్ సమీపంలోని) మాధవరం గ్రామంలో 1915 నవంబర్1న నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో ఆళ్వారుస్వామి జన్మించాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోగా పరాయిండ్లలో వంటలు చేసిపెట్టి, పనులు చేస్తూ బతికాడు. అందువల్ల ప్రాథమిక దశలోనూ విద్యాభ్యాసానికి నోచుకోలేదు. పద్నాలుగేండ్ల వయసులో సూర్యాపేటలో



గ్రంథాలయం ద్వారా ఆయనకు పరిచయం మొదలైంది. ఈ గ్రంథాలయంలోనే అనేక పుస్తకాలు చదువుకున్నాడు. సొంతంగా తెలుగు మాత్రమేగాక ఇంగ్లీషు కూడా నేర్చుకున్నాడు. ఈ క్రమంలోనే నకిరేకల్, సూర్యాపేట ప్రాంతాల్లోని ఇండ్లలో వంటపనులు, విజయవాడలోని హోటల్ సర్వర్ వృత్తి వంటి అనేక జీవన ప్రయాణాలు చేశాడు. చివరికి 1936-37 ప్రాంతంలో హైదరాబాద్ చేరి గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్ ఉద్యోగంలో చేరాడు. అప్పటినుండి 1961 ఫిబ్రవరిలో మరణించేవరకూ ఆయన జీవితమంతా సాహిత్య, సామాజిక కార్యక్రమాలకే అంకితం చేశాడు. స్టేట్ కాంగ్రెస్, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ, తెలంగాణ రచయితల సంఘాల వంటి సామాజిక, రాజకీయ, సాహిత్య సంస్థలన్నింటిలో చురుకయిన కార్యకర్తగా, నాయకుడిగా పేరుపొందాడు. ఆల్ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, గుమస్తాల సంఘం, రిక్షా కార్మికుల సంఘం, రైల్వే ఉద్యోగుల ఆందోళన వంటి కార్మికోద్యమాలకు నాయకత్వం వహించాడు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టు పార్టీకి దూరమైనా, 1959లో కేరళలో తొలిసారిగా ఏర్పడిన కమ్యూనిస్టు నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం బర్తరఫ్ చేయగా, నిరసనగా మళ్లీ కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. ఆళ్వారుస్వామి, 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడటానికి ముందటి తెలంగాణ గ్రామీణ ప్రజల జీవన పోరాటంతో 'ప్రజల మనిషి' నవల రూపొందించారు. ఆయన మొదట్లో రచించిన కథల కన్నా 'జైలు లోపల' కథలు భాష, శైలి, కథనం, కథన శిల్పంలో ముఖ్యమైనవి. ఆయన కథా రచనలో చేసిన సాధన, కథన శిల్పంలోని ప్రస్థానం తెలుగు సాహిత్యంలో కొన్ని ఉత్తమమైన, అపురూపమైన కథలను సృష్టించాయి. తెలుగు సాహిత్యానికి గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. తెలంగాణ మాండలికంలో, సహజ సుందరమైన శైలిలో వాస్తవిక జీవితాలకు కథనరూపమిచ్చిన సజీవ శిల్పాలుగా వట్టికోట ఆళ్వారుస్వామి కథలు నిలిచిపోతాయి. ప్రజల్లో చైతన్యం, ప్రశ్నించేతత్వం, సమాజం పట్ల కచ్చితమైన అవగాహన ఉండాలంటే పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని చాటిచెప్పిన ఆళ్వారు గ్రామగ్రామాల్లో ప్రచారం నిర్వహించాడు. పుస్తకాలతోనే గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపాడు. కథకునిగా, నవలాకారునిగా, ప్రజాఉద్యమ నాయకునిగా ఆళ్వారుస్వామి జీవితకాలమంతా చేసిన కృషి ఈనాటి రచయితలకీ, కవులకీ ఆదర్శప్రాయం. తెలంగాణ సాయుధ పోరాటకాలంలో ఆరేండ్లపాటు జైలు జీవితం అనుభవించిన రచయిత ఆళ్వారుస్వామి. జైలునుంచి విడుదలైన తర్వాత కూడా ప్రజల్ని చైతన్య పరిచే విధంగానే ముందుకు నడిచిన నాయకుడు. ఈనాటి సాహిత్యకారులకు ఆళ్వారుస్వామి జీవితం ఆదర్శం. జీవితచరమాంకం వరకు ప్రజలకోసం నిస్వార్థంగా పనిచేసిన ఆళ్వారుస్వామి1961 ఫిబ్రవరి 5న మరణించారు. ప్రతి కవి, రచయిత ఆళ్వారు స్వామిని స్ఫూర్తిగా తీసుకుని మూఢనమ్మకాల్లో కొట్టుకుపోతున్న నేటి సమాజాన్ని శాస్త్రీయ దృక్పథం వైపు పయనించే విధంగా పాటుపడాలి. ప్రతి జిల్లాలో ఆయన పేరు మీద కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించేలా పాలకులపై ఒత్తిడి తీసుకురావాలి. ఆయన వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి.

(నేడు వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతి)

- కామిడి సతీష్ రెడ్డి, 9848445134

సుంకాలను వ్యతిరేకించేవారంతా చైనా అదుపులో ఉన్నట్టేనట!



ఎం కోటేశ్వరరావు
8331013288

డోనాల్డ్ ట్రంప్ ఎన్నికల ముందునుంచీ ప్రకటించినట్టుగానే ప్రపంచ వాణిజ్య పోరుకు తెరలేపాడు. తన పన్నులను వ్యతిరేకించే విదేశమైనా లేక అమెరికాలో ఉన్న కంపెనీ అయినా సరే వారంతా చైనా అదుపులో ఉన్నట్టేనన్నాడు. ఇది రాసిన సమయంలో చెప్పిన మాటలకు, పాఠకులకు చేరే సమయానికి మార్పులు, విస్తరణ జరిగే రీతిలో ట్రంప్ వేగం కనిపిస్తోంది. కెనడా, మెక్సికోల మీద విధించిన పన్నుల అమలు కొంతకాలం వాయిదా వేస్తామనటంతో పాటు 'ఐరోపా మీద త్వరలో విధిస్తా ,వారు అమెరికా పట్ల భయంకరంగా వ్యవహరించారు, లాభాలకు ఒక అవకాశంగా తీసుకున్నారు, చైనా మీద ప్రకటించిన మొత్తాన్ని పెంచుతా' అన్నాడు. స్వంత జనాలు, కంపెనీలతో పాటు ప్రపంచవృద్ధికి నష్టం, అమెరికా పలుకుబడికీ దెబ్బ అన్న అనేక మంది ఆర్థికవేత్తల హెచ్చరికలను ఖాతరు చేయటం లేదు. కెనడా, మెక్సికోలపై 25శాతం, చైనా వస్తు దిగుమతుల మీద పదిశాతం పన్ను విధిస్తూ ఫిబ్రవరి ఒకటవ తేదీన ఉత్తర్వులు జారీ చేశాడు. ఇప్పటి వరకు వెల్లడైన వైఖరులను చూస్తే అదిరించి బెదిరించి దారికి తెచ్చుకోవాలన్న ఎత్తుగడ కనిపిస్తోంది.పన్నులను వ్యతిరేకిస్తున్న వారు ఎవరైనా కుహనా వార్తల వాల్‌స్ట్రీట్ జర్నల్, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే(హెడ్జ్ ఫండ్స్) వారు లేదా సంస్థలు చైనా అదుపులో ఉన్నట్టే అన్నాడు. తన నిర్ణయాలకు అద్భుత స్పందన వస్తున్నదని చెప్పుకున్నాడు. ఇతర దేశాలకు రాయితీల రూపంలో అమెరికా లక్షల కోట్ల డాలర్లు నష్టపోతున్నదన్నాడు. జనాలకు ఆర్థికంగా కొంత నొప్పి కలగవచ్చుగానీ అమెరికా ప్రయోజనాలకు ఆ మాత్రం భరించక తప్పదన్నాడు. దక్షిణాఫ్రికా భూములను గుంజు కుంటున్నదని, కొన్ని సామాజిక తరగతుల పట్ల చెడుగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ఆ దేశానికి రానున్న రోజుల్లో నిధులు నిలిపివేస్తామని, గతంలో ఇచ్చినవాటి మీద దర్యాప్తు చేస్తామని చెప్పాడు.

ఖండనలతో పాటు యావత్ ప్రపంచం అప్రమత్తమై ఎలా ఎదుర్కోవాలా అన్న శోధనలో పడింది. అక్రమంగా దిగుమతి అవుతున్న ఫెంటానిల్ నిరోధానికి జాతీయ అత్యవసర పరిస్థితిని ట్రంప్ ప్రకటించాడు.కృత్రిమ సింథటిక్, నల్లమందుతో తయారుచేసే నొప్పి నివారణ, మత్తు మందును ఫెంటానిల్ అని పిలుస్తున్నారు. దీన్ని ఔషధంగా వినియోగించటానికి అనుమతి ఉంది. మాదక ద్రవ్యంగా కూడా వినియోగిస్తున్నారు.అక్రమంగా దిగుమతి అవుతున్న ఫెంటానిల్ అమెరికాలో లక్షల మంది ప్రాణాలు తీసిందని అధ్యక్ష భవన మీడియా కార్యదర్శి కారోలిన్ లీవిట్ ఆరోపించారు. డోనాల్డ్ ట్రంప్ అంటే అమెరికా, అమెరికా అంటే ట్రంప్ అన్నట్లుగా పరిస్థితి తయారుకావటంతో కొంతమంది ఇప్పుడు ట్రంపెరికా అని పిలుస్తున్నారు. తాము చర్చలను తప్ప ఘర్షణను కోరుకోలేదని, కానీ ప్రతికూల చర్యలకు పూనుకోక తప్పటం లేదని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షియిన్‌బామ్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. మెక్సికో ప్రయోజనాల రక్షణకు అవసరమైన చర్యలన్నింటినీ తీసుకోవాలని తమ ఆర్థిక మంత్రిని కోరినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల ముఠాలతో మెక్సికో ప్రభుత్వం కుమ్మక్కయినందునే తాము పన్నులు విధించాల్సి వస్తోందంటూ అధ్యక్షభవనం చెప్పిన సాకును ఆమె ఖండించారు. అమెరికా నుంచి దిగుమతయ్యే ఏయేవస్తువులను లక్ష్యంగా చేసుకోవాలో ఇంకా వెల్లడించలేదు. స్వతంత్ర మెక్సికో చరిత్రలో జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటని, అమెరికా-కెనడా-మెక్సికో కుదుర్చుకున్న ఒప్పందానికి ఇది విరుద్ధమని పాలకపార్టీ నేత రికార్డో, ఆర్థిక మంత్రి ఎబ్రార్డ్ ప్రకటించాడు. తాము నష్టపోతామని, వారికీ అదే జరుగుతుందన్నారు.ప్రస్తుతం అమెరికాకు ఎగుమతుల్లో చైనాతో మెక్సికో పోటీపడుతోంది. మూడోవంతు మెక్సికో జీడీపీ అమెరికాకు ఎగుమతులపై ఆధారపడి ఉంది. ఎగుమతి, దిగుమతుల్లో మెక్సికో వాణిజ్య మిగుల్లో ఉంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే పంది మాంసం, జున్ను, వ్యవసాయ ఉత్పత్తులు, ఉక్కు, అల్యూమినియం వస్తువుల మీద ఐదు నుంచి ఇరవైశాతం వరకు పన్నులు విధించాలని ఆలోచిస్తున్నది. బీరు,వైన్,పండ్లు, పండ్ల రసాలతో సహా అమెరికా నుంచి వచ్చే వస్తువులపై ఇరవైఐదు శాతం పన్ను విధించనున్నట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్ ప్రకటించాడు. తొమ్మిదివేల కిలోమీటర్ల దూరం ఉన్న సరిహద్దులో ఇరు దేశాల వాణిజ్య లావాదేవీలు రోజుకు రెండున్నర బిలియన్ల డాలర్ల మేర జరుగుతున్నాయి. పన్నుల విధింపు తమ మీద ఆర్థిక యుద్ధం ప్రకటించటం, రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక బంధాన్ని ఉల్లంఘించటమే అంటూ దీన్ని తాము, కెనడియన్లతో కలసి ప్రతిఘటిస్తామని బ్రిటీష్ కొలంబియా ప్రధాని డేవిడ్ ఇబై ప్రకటించాడు. డాలర్‌కు డాలర్ అన్న పద్ధతిలో దెబ్బతీస్తామని కెనడాలోని ఓంటారియో రాష్ట్ర నేతలు చెప్పారు. తమ మీద అడ్డగోలుగా పన్ను విధిస్తే గట్టిగా ప్రతి స్పందిస్తామని ఐరోపా యూనియన్ ప్రతినిధి వ్యాఖ్యానించాడు.

ట్రంప్ చర్యను ఖండిస్తూ చర్చలకు ద్వారాలను తెరిచే ఉంచామని చైనా వాణిజ్య, ఆర్థిక మంత్రిత్వశాఖలు ప్రకటించాయి. ప్రపంచ వాణిజ్య సంస్థలో పన్నుల విధింపును సవాలు చేస్తామని ప్రకటించాయి. ఫెంటానిల్ అమెరికా సమస్య. దాని మీద ఏ చర్య తీసుకున్నా తాము మద్దతు ఇస్తామని చైనా స్పష్టం చేసింది. తాము ఇప్పటికే అమెరికాకు సహ కరిస్తున్నామని, గణనీయమైన ఫలితాలు కూడా వచ్చాయన్నారు. ట్రంపు పన్నులు చైనా ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బ కాదని వాణిజ్యరంగ నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆర్థిక రంగం మీద అమెరికా పన్నులు ఎలాంటి ప్రభావితం కలిగిస్తాయోనన్న ఆందోళన చెందుతున్నట్లు జపాన్ ఆర్థిక మంత్రి కాటో చెప్పాడు.తమ మీద ప్రభావం ఎలా ఉంటుందో చూసి తగిన చర్యలు తీసుకుంటామన్నాడు. మెక్సికోలో ఉత్పత్తి కేంద్రాలున్న దక్షిణ కొరియా కంపెనీల మీద ఎలాంటి ప్రభావం పడుతుందో సన్నిహితంగా గమనించాలని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ శాంగ్ మోక్ ప్రభుత్వ సంస్థలను ఆదేశించాడు. కొన్ని కంపెనీలు అమెరికాలో ఉత్పత్తి జరపాలని ఆలోచిస్తున్నాయి. పీజా, కార్ల ధరలు పెరుగుతాయి సిద్ధంగా ఉండండి అంటూ అమెరికా సెనెట్‌లో ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ సెనెటర్ చార్లెస్ షుమర్ హెచ్చరించాడు. కార్ల విడి భాగాల దిగుమతులపై పన్ను విధించి ధరలు పెరిగేందుకు దోహదం చేయవద్దని అమెరికన్ ఆటోమోటివ్ పాలసీ మండలి అధ్యక్షుడు మాట్ బ్లంట్ కోరాడు. పరిణామాలు, పర్యవసానాలను ఎదుర్కొనేందుకు భారత్‌తో సహా వర్ధమాన దేశాలన్నీ సిద్ధమవ్వాలని కోటక్ మహీంద్ర బ్యాంక్ స్థాపకుడు ఉదయ్ కోటక్ కోరారు. తమకు నష్టం చేసే దేశాలన్నింటి మీద పన్నులు వేస్తానని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా వస్తువులను అన్యాయంగా భారత్ అడ్డుకుంటున్నదని ఆరోపించాడు.



ట్రంప్ పన్నులతో జరిగేదేమిటి అన్న చర్చ ఎన్నికలకు ముందే ప్రారంభమైంది. బస్తీమే సవాల్ అంటూ అన్ని దేశాల మీద తొడగొట్టిన కారణంగా మిగతా దేశాలన్నింటికీ కలిపి ఎంత నష్టం జరుగుతుందో ఒక్క అమెరికాకు అంత ఉంటుంది. ఏయేవస్తువుల మీద పన్నులు విధిస్తారు, చేసిన ప్రకటనలు, ఇచ్చిన ఆదేశాలకు ట్రంప్ కట్టుబడి ఉంటాడా అన్నది కూడా చూడాల్సి ఉంది. బెదిరించటం వెనక్కు తగ్గటం అతని చరిత్ర. తొలిసారి అధికారానికి వచ్చినపుడు అక్రమ వలసలను నివారించడంలో విఫలమైనందున మెక్సికో వస్తువులపై ఐదు నుంచి 25శాతం పన్నులు విధిస్తానని ప్రకటించాడు. తరువాత వెనక్కు తగ్గాడు. నిఘంటువులో దేవుడు, ప్రేమ, మతం తరువాత అందమైన పదం పన్నులు అని ట్రంప్ వర్ణించాడు. అమెరికా చరిత్రలో 1890 దశకంలో 25వ అధ్యక్షుడు విలియమ్ మెకన్లీ ఎడా పెడా పన్నులు విధించిన నేతగా నమోదయ్యాడు. ఇప్పుడు ట్రంప్ అదేబాటలో నడుస్తున్నట్టు వర్ణిస్తున్నారు.

ట్రంప్ పన్నులతో జరిగేదేమిటి అన్న చర్చ ఎన్నికలకు ముందే ప్రారంభమైంది. బస్తీమే సవాల్ అంటూ అన్ని దేశాల మీద తొడగొట్టిన కారణంగా మిగతా దేశాలన్నింటికీ కలిపి ఎంత నష్టం జరుగుతుందో ఒక్క అమెరికాకు అంత ఉంటుంది. ఏయేవస్తువుల మీద పన్నులు విధిస్తారు, చేసిన ప్రకటనలు, ఇచ్చిన ఆదేశాలకు ట్రంప్ కట్టుబడి ఉంటాడా అన్నది కూడా చూడాల్సి ఉంది. బెదిరించటం వెనక్కు తగ్గటం అతని చరిత్ర. తొలిసారి అధికారానికి వచ్చినపుడు అక్రమ వలసలను నివారించడంలో విఫలమైనందున మెక్సికో వస్తువులపై ఐదు నుంచి 25శాతం పన్నులు విధిస్తానని ప్రకటించాడు. తరువాత వెనక్కు తగ్గాడు. నిఘంటువులో దేవుడు, ప్రేమ, మతం తరువాత అందమైన పదం పన్నులు అని ట్రంప్ వర్ణించాడు. అమెరికా చరిత్రలో 1890 దశకంలో 25వ అధ్యక్షుడు విలియమ్ మెకన్లీ ఎడా పెడా పన్నులు విధించిన నేతగా నమోదయ్యాడు. ఇప్పుడు ట్రంప్ అదేబాటలో నడుస్తున్నట్టు వర్ణిస్తున్నారు.ఇప్పటికే పెద్ద ఎత్తున లోటుబడ్జెట్‌తో ఉండగా పన్నులు తగ్గించాలని ట్రంప్ తలపెట్టాడు, తద్వారా వచ్చిన నష్టాన్ని విదేశీ దిగుమతులపై పన్ను విధింపుతో పూడ్చాలని చూస్తున్నాడు. అయితే దానికి దేశకార్మికవర్గాన్ని ఫణంగా పెట్టాలని చూస్తున్నాడు. దిగుమతి పన్నులు వేల కోట్ల డాలర్లు బహుశా లక్షల కోట్లు కూడా తమ ఖజానాలోకి వచ్చిపడవచ్చని ప్రపంచ ఆర్థికవేదిక సమావేశాల్లో ట్రంప్ చెప్పాడు.

అమెరికా విధించే పన్నులు ఎలా ఉండబోతున్నాయి, సామాన్యుల మీద ఎంత భారం పడుతుందన్నది ఇప్పుడు పెద్ద చర్చగా ఉంది. టాక్స్ ఫౌండేషన్ సంస్థ చెబుతున్నదానిని బట్టి కెనడా, మెక్సికోల మీద పన్ను కారణంగా అమెరికా జీడీపీ 0.8శాతం దిగజారుతుంది, 1.3 ఎగుమతులు, 2.8శాతాల చొప్పున దిగుమతులు తగ్గుతాయి.లక్షా 84వేల ఉద్యోగాలు పోతాయి. ఎంత భారం పడుతుందనే లెక్కలు అన్నీ ఒకే విధంగా లేవు. పన్ను మొత్తం 272 బిలియన్ డాలర్లు ఉంటే కుటుంబానికి ఏటా 2,600 డాలర్లు అదనపు భారం అని కార్నే క్రాస్ బోర్డర్ సొల్యూషన్స్ పేర్కొన్నది. కెనడా, మెక్సికో దిగుమతుల మీద 25శాతం చొప్పున అమలు చేస్తే 232.5 బి.డాలర్లు, చైనా వస్తువులపై 43.2 మొత్తం 275.7బి. డాలర్లని దీని ప్రకారం 33 కోట్ల జనాభాలో తలకు 835 డాలర్ల చొప్పున నలుగురున్న ప్రతి కుటుంబం మీద 3,342 డాలర్లని మరో లెక్క. చైనా వస్తువులపై 60శాతం, మిగతా వాటిపై 20శాతం విధిస్తే ఏటా కుటుంబం మీద 2,600 డాలర్ల భారమని పీటర్సన్ ఇనిస్టిట్యూట్, మొత్తం మీద పదిశాతం విధిస్తే 2,045 డాలర్లని టాక్స్ ఫౌండేషన్, నేషనల్ రిటెయిల్ ఫెడరేషన్ అంచనా ప్రకారం 7,600 డాలర్లు ఉంటుంది. ఈ పన్నులతో కంపెనీలు, వినియోగదారుల నుంచి ప్రతిఘటన ఎదురు కావచ్చని కూడా చెబుతున్నారు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు ట్రంప్ విధించిన పన్నులకు ప్రతిగా ఐరోపా యూనియన్, చైనా చర్యలు తీసుకున్నాయి.

వ్యవసాయ రంగంలో ట్రంప్ మద్దతుదార్లు, ఇతరులూ నష్టపోయారు. జూరిచ్ విశ్వవిద్యాలయం,మచాసుచెట్స్, హార్వర్డ్, ప్రపంచ బ్యాంకు చేసిన అధ్యయనాల ప్రకారం ట్రంప్ విధించిన పన్నులు అమెరికాలో ఉపాధిని పునరుద్ధరించలేదని, అలాగని ఉపాధిని తగ్గించలేదని కూడా తేలింది. అందువలన ఇప్పుడు ట్రంప్ చెబుతున్న మాటలు, చేతల ప్రభావం, పరిణామాలు, పర్యవసానాలు వెంటనే వెల్లడయ్యే అవకాశాలు లేవు.భారత్‌తో సహా వివిధ దేశాల్లో స్టాక్‌మార్కెట్లు, కరెన్సీ విలువల్లో ఒడిదుడుకులు మాత్రం కనిపిస్తున్నాయి.

ప్రాణంతీస్తే పరువు నిలబడుతుందా?



టి.స్కైలాబ్ బాబు
9177549646

నేటి ఆధునిక యుగంలో ఆటవిక కులదురహంకార హత్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. చదువుకున్న మూర్ఖులే కులం పట్టింపులకు లోనవుతున్నారు. 'మాది అగ్రకులం, మా పరువు పోయింది' అనే పేరుతో ఉన్మాదం తలకెక్కించుకొని ప్రాణ మిత్రుడిని సైతం పొలిపెడు తున్నారు. శాస్త్ర,సాంకేతిక రంగం ఆకాశమంతా ఎత్తుకు ఎదుగుతుంటే సాటిమనిషిని తక్కువ కులం పేరుతో హతమరుస్తున్న మధ్యయుగాల కాలం నాటి మానసికస్థితి నేటికీ కొనసాగుతుండటం ఆందోళనాకరం. ఇది మనదేశ వెనుకబాటుతనం.

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26న సూర్యాపేట జిల్లా, మండలం పిల్లలమర్రి వద్ద ఓ దళిత యువకుడు కిరాతక హత్యకు గురయ్యాడు. బావిలో శవమై తేలాడు. 'కులం తక్కువవాడితో నా చెల్లెలు కాపురాన్ని కొనసాగనివ్వమని' తన బావమరుదులే అతన్ని కడతేర్చారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి పిల్లలమర్రికి చెందిన కోట్ల భార్గవి గత మూడేండ్లుగా ప్రేమించుకున్నారు. 2024 ఆగస్టు 7న నకిరేకల్ ఓ దేవాలయంలో వివాహం చేసుకున్నారు. వారి పెండ్లి తర్వాత భార్గవి అరవైఐదేండ్ల కోట్ల భిక్షమమ్మ (నాయనమ్మ) 'ఆది మాలోడిని చేసుకుంటే మన పరువుంటుందా? మనకులంలో తలెత్తుకుని ఎలా తిరగాలి? వాడిని బతకనియద్దు' అంటూ భార్గవి సోదరులు నవీన్, వంశీలను రెచ్చగొట్టింది. అంతేకాదు, 'వాడి శవాన్ని నేను కళ్లారా చూడాలి. మీరు మన కులం పరువు నిల బెట్టాలని' చెప్పింది. నాయనమ్మ మాట ప్రకారం గతంలో ఓసారి హత్యకు పథకం వేసి విఫలయ్యారు. తర్వాత ఇరువురి స్నేహితుడైన బైరి నరేష్ సహకారంతో బంటిని హత్యచేసి శభాష్ అనిపించుకున్నారు. వాస్తవానికి బంటి, నవీన్, వంశీ, నరేష్ స్నేహితులు. కులం ముందు దోస్తానా కూడా ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఇంతకన్నా దారుణం ఏముంటుంది? ప్రాణం తీస్తే పరువు నిలబడుతుందా, ఇప్పుడు నిలబడిందా, భార్గవి జీవితం ఏమైపోవాలి? తమకు ఇష్టమైనవారిని కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవడం కూడా నేరమా, చట్ట విరుద్ధమా?

భార్గవి తన పెండ్లి తర్వాత కుటుంబ సభ్యులు మూడునెల్లపాటు ఆమెను నానా వేధింపులకు గురిచేశారు. తమ మాటకాదని వేరే కులానికి చెందిన వ్యక్తిని ఎలా పెండ్లి చేసుకుంటావని గొడవకు దిగారు. వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. అయితే తాను మేజర్‌నని, ఇష్టపూర్వకంగానే బంటిని పెండ్లి చేసుకున్నాని భార్గవి చెప్పడంతో పోలీసులు ఆమె కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.అయినా వారు మారలేదు. బంటిని హత్య చేయడానికే నిర్ణయించుకున్నారు. మరో స్నేహితుడు బైరి మహేశ్ సాయం తీసుకుని హత్యకు కుట్రపన్నారు. ఇందులో నాయనమ్మది ప్రధానపాత్ర. వేరే కులానికి చెందిన వ్యక్తిని తన మనవరాలు పెండ్లి చేసుకోవడం, పైగా తమ కళ్లెదుట ఊర్లోనే కాపురం పెట్టడాన్ని ఆమె జీర్ణించుకోలేక పోయింది. పరువు.. పరువు అంటూ రాత్రి, పగలు తన మనవళ్లను రెచ్చగొట్టింది. తన మనవరాలిని పెండ్లి చేసుకున్న ఆ కుర్రాడ్ని చంపాలని ఆదేశించింది. నాయనమ్మ కోరిక తీర్చేందుకు, ఆమె కండ్లల్లో ఆనందం చూడాలని ఆ మనవళ్లు ఇద్దరూ బార్గవి భర్తను అత్యంత క్రూరంగా చంపారు. కారులో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి 'ఇదిగో చంపాం చూడు' అంటూ నాయనమ్మకు బంటి శవాన్ని చూపించగా 'మీరిద్దరూ నా పరువు కాపాడారు' అంటూ రక్తంతో తడిసిన తన మనవళ్ల చేతులు చూసి ఆమె ఆనందపడింది. తన ఆఖరి కోరిక తీర్చినందుకు వారిని ముద్దాడింది. ఇంతటి కులఉన్మాదాన్ని రెచ్చగొడుతూ సాటి మనిషి అనే తేడా లేకుండా హత్య చేయించడం ద్వారా ఆరుపదుల వయసు దాటినా ఆ వృద్ధురాలు ఏం సాధించింది? తన మనవరాలి నిండుజీవితాన్ని కాలరాసింది. అంతేకాదు, ఆమెను వితంతువుగా మార్చింది. ఈ ఘటన తర్వాత భార్గవి సోదరులు నవీన్, వంశీ, తండ్రి సైదులు, నాయనమ్మకు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అయినప్పటికీ ఆ వృద్ధురాలు భిక్షమమ్మలో ఎలాంటి పశ్చాత్తాపం లేదు. భర్తని కోల్పోయిన భార్గవి కన్నీరుమున్నీరుగా ఏడుస్తున్నా ఆమె మనసు కరగలేదు. 'వద్దని చెప్పినా కులంతక్కువోడిని పెండ్లిచేసుకున్నందుకు నా మనవరాలికి తగిన శాస్తి జరగాల్సిందే' అందంటే ఆమె క్రూరత్వానికి ఇంతకన్న నిదర్శనమేముంటుంది?



ఒక్క భార్గవికే కాదు, కులాంతర,మతాంతర వివాలు చేసుకున్నవారందరికీ ప్రభుత్వమే రక్షణ కల్పించాలి. కుల దురహంకార హత్యల్ని అరికట్టేందుకుగాను ఒక చట్టమే తీసుకురావాలి. కులాంతర, మతాంతర వివాహాల్ని ప్రోత్సహించేలా సాంస్కృతిక కళాసంస్థల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయలి. ఆ వివాహాలు చట్టబద్ధమేనని చాటిచెప్పాలి. వారిపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించాలి. కులాంతర మతాంతర వివాహాలకు ప్రత్యేక రక్షణ చట్టం చేస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలి. ఇప్పటికే కేరళలో వామపక్ష ప్రభుత్వం, తమిళనాడు డీఎంకే సర్కార్ కులాంతర వివాహం చేసుకున్న దంపతుల్లో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగమిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నాయి.ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం కూడా పయనించాలి.

వడ్లకొండ కృష్ణ (బంటి) కుటుంబ నేపథ్యం పరిశీలిస్తే హృదయం చలిస్తుంది. తల్లి లేదు, తండ్రి వృద్ధుడు. తండ్రిని పోషించే వారెవరూ లేరు. అక్కకు వివాహమై మణుగూరలో ఉంటోంది. ప్రస్తుతానికి గుంటస్థలం, రేకుల ఇల్లు తప్ప వేరే ఆస్తిపాస్తులేమీ లేవు. సెంటు భూమి కూడా లేదు. ఇప్పుడు ఆ వృద్ధుని బాధ్యత ఎవరిది? ఇది ఒక హత్యగానే కాదు, సమాజాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్లే చర్యగా పౌర సమాజం చూడాలి. ఎందుకంటే, రాష్ట్రంలో భూస్వామ్య భావజాలం పెరుగుతున్నది చెప్పడానికి ఇలాంటి ఘటనలే నిదర్శనం. అందులో భాగమే బుసలుకొట్టే కుల విషసర్పం. రాష్ట్రంలో ఈ దశాబ్దకాలంగా జరిగిన 128 కులదురహంకార హత్యల్ని పరిశీలిస్తే గనుక రోజురోజుకూ కుల అధిపత్యం పెచ్చుమీరుతోందని తెలుస్తోంది. ఒక బంటి హత్యనే కాదు, మిర్యాలగూడలో పెరుమాండ్ల ప్రణయ్‌ని హత్య చేయించిన మారుతిరావు ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. తన కూతురిని వితంతువుగా, తన మనుమడిని తండ్రిలేని పిల్లవాడిని చేశాడు. ఇందులో మారుతిరావు సాధించిందేమిటి? కులంతో రగిలిపోవడం తప్ప. ఆంబోజి నరేశ్‌తో పాటు తన కన్న కూతురు స్వాతిని బాత్రూమ్‌లో ఉరేసి చంపిన తుమ్మల శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల చనిపోయాడు. ఏం సాధించాడు? రెండు నిండు ప్రాణాలను బలిగొన్నాడు. భువనగిరిలో రామకృష్ణగౌడ్ ముదిరాజ్ యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడని యువతి తండ్రి రామకృష్ణ గౌడ్‌ను హత్య చేశాడు. ఇటీవల ఇబ్రహీంపట్నం మండలంలో రాయపోల్ గ్రామంలో నాగమణి అనే కానిస్టేబుల్ అదే గ్రామానికి చెందిన ఎస్సీ యువ కుడిని ప్రేమించి పెండ్లి చేసుకుందని ఆమె తమ్ముడు పరమేష్ నాగమణిని కిరాతకంగా కారుతో ఢీకొట్టి చంపేశాడు. ఈ వరుస హత్యల్ని చూస్తే కులాంతర,మతాంతర వివాహాలు చేసుకున్నవారి పరిస్థితి ఎంతటి ప్రమాదకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇటీవల హత్యకు గురైన బంటి కుటుంబాన్ని సర్కారే ఆదుకోవాలి. ఇప్పటికే నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూం ఇల్లు లేదా ఇందిరమ్మ ఇండ్లలో గాని ఒక ఇల్లు మంజూరు చేయాలి. భార్గవి తన తల్లిగారింటిని వదిలి అత్తింట్లోనే ఉంటున్న నేపథ్యంలో వారి కుటుంబపోషణకు ఆమె ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ఆ కుటుంబాన్ని పూర్తిగా ఆదుకోవాలి. ఒక్క భార్గవికే కాదు, కులాంతర,మతాంతర వివాలు చేసుకున్న వారందరికీ ప్రభుత్వమే రక్షణ కల్పించాలి. కుల దురహంకార హత్యల్ని అరికట్టేందుకుగాను ఒక చట్టమే తీసుకురావాలి. కులాంతర, మతాంతర వివాహాల్ని ప్రోత్సహించేలా సాంస్కృతిక కళాసంస్థల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయలి. ఆ వివాహాలు చట్టబద్ధమేనని చాటిచెప్పాలి. వారిపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించాలి. కులాంతర మతాంతర వివాహాలకు ప్రత్యేక రక్షణ చట్టం చేస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలి. ఇప్పటికే కేరళలో వామపక్ష ప్రభుత్వం, తమిళనాడు డీఎంకే సర్కార్ కులాంతర వివాహం చేసుకున్న దంపతుల్లో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగమిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నాయి. ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం కూడా పయనించాలి.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
బుధవారం | ఫిబ్రవరి 05, 2025 | www.navatelangana.com



క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి

నవతెలంగాణ-ముదిగొండ

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతిభాయి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని ముదిగొండ, వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. పాఠశాలలో పిల్లలందరికీ అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈనెల 10న నులిపురుగుల దినోత్సవం విజయవంతం చేయాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు.అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ చందునాయక్ డిపిఓ దుర్గ,ముదిగొండ,వల్లభి పిహెచ్సి వైద్యాధికారులు అంకం అరుణాదేవి, కందిబండ ధర్మేంద్ర, సిహెచ్ఓ మధుసూదన్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డిబోయిన రామారావు, హెల్త్ సూపర్వైజర్స్ లత, పద్మావతి, రవికుమార్, ప్రవీణ్, దేవేందర్, ఫార్మసిస్టు సత్యవతి, స్టాఫ్ నర్స్ కుమారి, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



డిజిటల్ పంట సర్వేని పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య

నవతెలంగాణ - బోనకల్

క్షేత్రస్థాయిలో నిర్వహించే డిజిటల్ పంట సర్వే అని పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక నందు మండల వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యాసంగిలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే గురించి దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో నిర్వహించే డిజిటల్ పంట సర్వేని పారదర్శకంగా నిర్వహించాలని, అలాగే సర్వే నిర్వహిస్తున్నపుడు ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని సూచించారు. డిజిటల్ పంట సర్వే చేపట్టడం ద్వారా పంట లెక్కలు కచ్చితత్వం, ఎరువుల సరఫరా, కొనుగోళ్లు, మార్కెటింగ్ వంటి ముందస్తు ప్రణాళికల కోసం ఉపయోగపడుతుందన్నారు. ఆదే విధంగా పీఎం కిసాన్ పథకంకి సంబంధించి ఈ-కెవైసి, ఆధార్ సీడింగ్, ఫీసికల్ వేరిఫికేషన్, పెండింగ్ రైతుల వివరాలు ఆన్లైన్ త్వరితగతిన పూర్తి చేయాలి అని చెప్పారు. రైతు బీమా లబ్దిదారులకు సంబంధించిన వివరాలను త్వరగా సేకరించి ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గతంలో తుఫాను ప్రభావంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో పంట నష్ట సర్వే నిర్వహించిన సమయంలో అనేక విమర్శలు వచ్చాయని, ప్రస్తుతం ఈ సర్వేలో అటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా సమగ్రంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు నాగినేని నాగ సాయి, బంధం రజిత, పండగ అనూష, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ, షేక్ హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



కేవీపీఎస్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- కూసుమంచి

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా క్యాలెండర్‌ను తహసిల్దార్ కరుణ శ్రీ, ఎస్సై నాగరాజు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి కెవిపిఎస్ జిల్లా క్యాలెండర్ సాంఘిక సంఘ సంస్కరణ ఉద్యమ మహానుభావుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, పెరియర్ రామస్వామి, నారాయణ గురు, పుచ్చలపల్లి సుందరయ్య వారి ఫోటోలతో ముద్రించడం జరుగుతుందన్నారు. అట్టడుగునా ఉన్న ప్రజల కొరకు వారిచేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని మనమందరం ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే ఫిబ్రవరి 16న జరిగే పాలేరు డివిజన్ విస్తృత సమావేశానికి మండల నుండి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు మామిడాల ఉపేందర్, మండల కార్యదర్శి గోపి జానకి రాములు, నాయకులు ఉసికెల నాగరాజు, మునగాల నవీన్, శ్రీను పాల్గొన్నారు



కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

- వ్యవసాయ కార్మికులకు, ఉపాధికి, నిధులు పెంచాలి
- వ్యకాస జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ

నవతెలంగాణ-వైరాటౌన్

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరాటౌన్, రూరల్ మండల కమిటీల సంయుక్త సమావేశం వైరా బోడేపుడి భవనంలో వ్యకాస పట్టణ కార్యదర్శి గుమ్మా నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి తూము సుధాకర్ మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ కూలీలకు అన్యాయం జరిగిందని, బడ్జెట్ మార్చి న్యాయం చేయాలని, ఉపాధి పనికి ఎక్కువ నిధులు కేటాయించాలని, సన్న, చిన్న రైతులకు, కూలీలకు, వ్యతిరేకంగా ఈ బడ్జెట్ ఉందని, బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా బడ్జెట్ ఉండటాన్ని ఖండించారు. ఈ బడ్జెట్లో సవరించి పేదలకు అనుకూలంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం బడ్జెట్ పత్రాలు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తోట నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు బాణాల శ్రీనివాసరావు, చింతనిప్పు చలపతిరావు, షేక్ రెహానా బి, షేక్ మజీద్, బి.బాణాల వెంకటాచారి, ఓర్సు సీతారాములు, శివాజీ, యనమద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రివేళలో రోడ్లపై తిరుగుతున్న 10 మందిపై కేసు నమోదు

- నగరంలో విస్తృతంగా పోలీసు తనిఖీలు
- ఖమ్మం వన్ టౌన్ సిఐ ఉదయ్ కుమార్



నవతెలంగాణ-ఖమ్మం

పని లేకుండా అర్ధరాత్రి సమయాల్లో రోడ్లపై వాహనాలతో తిరుగుతున్న 10 మంది యువకులపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు ఖమ్మం వన్ టౌన్ సిఐ ఉదయ్ కుమార్ తెలిపారు. బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, రాష్ డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించిషాపులు తెరవడం, పని లేకున్నా రోడ్లపై రావడం, బర్త్ డేల పేరుతో నడి రోడ్డుపై వాహనాలు అడ్డం పెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించేవారిపై ప్రత్యేక దృష్టి సారించి సిటీ పోలీస్ యాక్టు అమలు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అలాంటి వ్యక్తులకు జరిమానా, జైలు శిక్ష కూడా పడే అవకాశాలు ఉన్నాయన్నారు.

చివర భూములకు అందని సాగర్‌నీరు

- ఎండిపోతున్న మొక్కజొన్న పంట



నవతెలంగాణ - బోనకల్

బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆళ్లపాడు, నారాయణపురం, డబ్బాకుపల్లి, పోలంపల్లి తదితర మైనర్లకు కలకోట మేజర్‌కు పూర్తి స్థాయిలో సాగర్ నీరు అందక మొక్కజొన్న పంట ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోనే బోనకల్లు మండలంలో యాసంగిలో మొక్కజొన్న పంటను అత్యధికంగా సాగు చేస్తారు. గత ఏడాది పూర్తిస్థాయిలో సాగర్ నీరు బంద్ కావడంతో మొక్కజొన్న పంటను అన్నదాతలు సాగు చేయలేదు. దీంతో పెద్ద ఎత్తున యాసంగిలో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం బోనకల్ బ్రాంచ్ కెనాలకు (బీబీసీ) సాగర్ నీటిని విడుదల చేసినప్పటికీ ఆ సాగర్ నీరు మైనర్లకు వెళ్లకపోవటంతో మైనర్ల కింద సాగుచేసిన మొక్కజొన్న పంట ఎండిపోతుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అది బోనకల్‌కు వచ్చేసరికి కొంత తగ్గుతుంది. బీబీసీ పరిధిలో ప్రధానంగా ఆళ్లపాడు, నారాయణపురం మైనర్ల కింద ప్రతి ఏడాది చివర భూములకు సాగర్ నీర అందటం లేదు. బోనకల్ మండల వ్యాప్తంగా యాసంగిలో 15,500 ఎకరాలలో అన్నదాతలు మొక్కజొన్న పంటను సాగు చేశారు.

ఆళ్లపాడు మైనర్ కాలువ కింద గోవిందాపురం ఏ, మోటమర్రి, కలకోట, రాయన్నపేట, బయ్యారం, అల్లినగరం గ్రామాలకు చెందిన రైతుల భూములు సాగవుతున్నాయి. ఆళ్లపాడు మైనర్ కింద మొక్కజొన్న పంటను అత్యధికంగా సాగు చేశారు. ఒక్కొక్క ఎకరానికి 20 నుంచి 25 వేల వరకు అన్నదాతలు పెట్టుబడి పెట్టారు. 15,500 ఎకరాలకు గాను నేటికీ అన్నదాతలు సుమారు రూ.33.75 కోట్లు పెట్టుబడి పెట్టి ఉన్నారు. దాదాపు మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కజొన్న పంట పొట్ట దశలో ఉంది. పొట్ట దశలో సాగునీరు అందకపోతే పంట మొత్తానికి నష్టం జరిగే ప్రమాదం ఉందని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు పూర్తిస్థాయి క్యూసెక్కుల నీటిని విడుదల చేయకుండా అరకొరగా విడుదల చేయటం వల్ల అవి బోనకల్ చేరేవరకు కొంత తగ్గి పోతుందని, దీని వలన బిబిసి నుంచి మైనర్లకు సాగర్ నీరు ఎక్కటం లేదని రైతులు అంటున్నారు. బీబీసీకి పూర్తిస్థాయిలో సాగర్ నీరు వస్తేనే బిబిసి పరిధిలో ఉన్న మైనర్లకు సాగరనీరు ఎక్కుతాయని రైతులు తెలిపారు. ఒకరోజు పెంచి ఒక రోజు తక్కువ ఇవ్వటం వలన మైనర్లకు బీబీసీ నుంచి సాగర్ నీరు ఎక్కటం లేదని మొక్కజొన్న పంటకు సక్రమంగా సాగర్ నీరు అందక ఆళ్లపాడు మైనర్ కింద సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. అదే పరిస్థితి నారాయణపురం మైనర్ కింద ఉందని రావినూతల రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీబీసీకి పూర్తిస్థాయిలో క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మైనర్లకు కూడా పూర్తిస్థాయిలో సాగర్ నీటిని సరఫరా చేస్తే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు అంటున్నారు.



20 ఎకరాలకు రూ. 5 లక్షలు పెట్టుబడి పెట్టా :
మల్లాది లింగయ్య, రైతు, ఆళ్లపాడు

ఆళ్లపాడు మైనర్ కింద 20 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశాను. ఒక్కొక్క ఎకరానికి రూ 25 వేల చొప్పున మొత్తం సుమారు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ఆళ్లపాడు మైనరకు పూర్తిస్థాయిలో సాగర్ నీరు రావటం లేదు. 20 ఎకరాలు కంకి వేసే దశలో ఉంది. చాలావరకు మొక్కజొన్న పంట సాగునీరు అందక వడబడిపోతుంది. కంకి వేసే దశలో సాగునీరు అందకపోతే పంట గణనీయంగా తగ్గిపోతుంది. కనీసం సగం పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి ఉండదు. కంకి వేసే దశలోనే పూర్తిస్థాయిలో సాగునీరు ఉండాలి. ఆళ్లపాడు మైనర్ కింద ప్రతి సంవత్సరం చివర భూములకు సాగర్ నీరు అందటం లేదు. దీనివలన ప్రతి సంవత్సరం తాము నష్టపోతూనే ఉన్నాము. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి ఆళ్లపాడు మైనర్‌కు పూర్తిస్థాయిలో సాగర్ నీటిని విడుదల చేసి తమ పంటలను కాపాడాలని కోరాడు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- 10న హైదరాబాద్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయండి
- వ్యకాస జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్లో వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం రూరల్ మండల కమిటీ సమావేశం కర్లపూడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఎన్నికల్లో ఆరు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అధికారం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అనే ఒక్క గ్యారెంటీ మాత్రమే నెరవేర్చిందని, మిగతా ఐదు హామీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు 2024 సంవత్సరంలో 20 రోజులు ఉపాధి హామీ పనికి వెళితేనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలవుతుందని చెప్పడం దుర్మార్గమైన చర్య అన్నారు. భూమిలేని నిరుపేదలందరికీ ఇందిర ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా కోసం గ్రామాల్లో కమిటీలు వేశారని ఆ కమిటీల్లో కాంగ్రెస్ కార్యకర్తలే ఉన్నారని, కమిటీల్లో ప్రతిపక్ష పార్టీలకు కూడా అవకాశం ఇచ్చి అర్హులైన జాబితాను తయారు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్ పై రాష్ట్ర ప్రభుత్వం మేనమేషాలు లెక్కిస్తుందని, తగురీతిలో స్పందించడం లేదని విమర్శించారు. ఎన్నికల హామీలు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 10వ తేదీన హైదరాబాదులోని ఇందిరా పార్కులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ధర్నాకు అన్ని ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, పొన్నెకంటి సంగయ్య, నంద్ర ప్రసాద్, ఉరడీ సుదర్శన్‌రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా నాయకురాలు పెండ్యాల సుమతి, పిఎన్ఎం జిల్లా నాయకులు నందిగామ కృష్ణ, వ్యకాస నాయకులు వడ్లమూడి నాగేశ్వరరావు, మద్ది వెంకటరెడ్డి, దండగల రాంబాబు, పగిడిపల్లి ఉపేందర్, పొన్నం భాస్కర్‌రావు, గుర్రం ఉపేందర్, ఎస్కే.రంజాన్ పాషా, మడిపల్లి వెంకన్న, రాజశేఖర్, గుంటి వెంకన్న, సైదులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సిందే

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీతో లింకు పెట్టవద్దు
- సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు



నవతెలంగాణ-మధిర

ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సిందే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీతో లింకు పెట్టవద్దని సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. మధిర బోడెపుడి భవన్ నందు ఓట్ల శంకర్రావు అధ్యక్షతన సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని తెలియజేశారు. అర్హులైన పేదలందరికీ పథకాలు అందే విధంగా విధి, విధానాలు ఉండాలి తప్ప, అర్హులని తగ్గించే విధంగా నిబంధనలు పెట్టటం సరైంది కాదని అన్నారు. ఎన్నికల ముందు పేద ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటిని అమలు చేయడం కోసం ఉద్యమిస్తూనే మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పార్టీ మండల కమిటీకి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీల నరసింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు, మండల నాయకులు నాయుడు శ్రీరాములు, షేక్ ఉద్దండు సాహెబ్, కుక్క మోహన్ రావు, భాషనేని వెంకట నరసయ్య గౌరరాజు ధనలక్ష్మి వజ్రానపు మధు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని రోడ్డెక్కిన మహిళలు

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని కిష్టయ్యబంజర గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదంటూ ఖాళీ బిందెలతో గ్రామంలోని రోడ్డుపై మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎస్సీ కాలనీ వాసులు మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం కింద గ్రామంలో తాగునీటి కోసం 20 వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మించడం జరిగిందని అన్నారు. మిషన్ భగీరథ వాటర్ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అరకొరగా సరఫరా అవుతుందన్నారు. ఎస్సీ కాలనీలోని 30 కుటుంబాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీలో తాగునీటి కుళాయిలు లేకపోవడంతో గ్రామంలోని ఓ వ్యక్తికి సంబంధించిన బోర్ వద్ద నుంచి ప్రతిరోజు తాగునీటిని తెచ్చుకోవడం జరుగుతుందని అన్నారు. ఇతరత్రా అవసరాలకు నీటి సరఫరా లేక సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి పనులు చేసుకోవాల్సి వస్తుందంటూ తెలిపారు. తాగునీటి సరఫరా విషయంపై పలుమార్లు గత ప్రభుత్వంలో ఉన్న పాలకవర్గానికి, సంబంధిత శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదు అన్నారు. ప్రస్తుత ఇన్చార్జి కార్యదర్శి అడిగితే పంచాయతీలో నిధులు లేవంటూ సమాధానం చెబుతున్నారు అన్నారు. ప్రస్తుతం మండల స్థాయి, గ్రామస్థాయి ప్రత్యేక అధికారులకు, స్థానిక ఎంపీడీవోకు, ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా పలుమార్లు తాగునీటి సమస్య విషయమై తెలిపినప్పటికీ నేటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తాగునీటి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో కిష్టయ్య బంజారా ఎస్సీ కాలనీకి చెందిన పెరుమళ్ళపల్లి రమేష్, దాసు, వాడపల్లి లెనిన్, మహేష్, సురేఖ, కాశీ మల్ల ప్రవీణ్, వాడపల్లి ఝాన్సీ, రజిని, జంగం మారయ్య, సుశీల, రాంబాబు, కృష్ణ, వాడపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరురాలు స్వర్ణలత మృతి

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గోళ్ళ శ్రీనివాసరావు సతీమణి గోళ్ళ స్వర్ణలత(42) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో రెజొనెన్స్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ స్కూల్ విద్యార్థులు నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో అండర్-14 బాలుర కటా విభాగంలో కె.ధనుష్ బంగారు పతకాన్ని, అండర్-14 స్పారింగ్(కుమిటో) విభాగంలో పి.రామ్‌ప్రసాద్ రజత పతకాన్ని సాధించి రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థులు జాతీయస్థాయిలో తమ కరాటే నైపుణ్యాలను ప్రదర్శించి తిరుగులేని శక్తిగా నిలిచి వారి అత్యుత్తమ ప్రదర్శనతో ఛాంపియన్‌షిప్ ట్రోఫిని కూడా కైవసం చేసుకొని ప్రముఖుల అభినందనలు పొందడం జరిగిందని పాఠశాల డైరెక్టర్స్ కె.శ్రీధర్‌రావు, కృష్ణవేణి తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో వారు విద్యార్థులను అభినందించి ఆశీర్వదించారు.

9న అక్షరాలతోవ 7వ వార్షికోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం

ఈ నెల 9న ఖమ్మంలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరుగనున్న సుప్రసిద్ధ సాహితీ సంస్థ అక్షరాల తోవ ఏడో వార్షికోత్సవం వాల్‌పోస్టర్‌ను ఖమ్మంలోని న్యూఇరా స్కూల్‌లో ప్రముఖ కవి, విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు, విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు ఐ.వి రమణారావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో అక్షరాల తోవ సాహిత్య సంస్థ చేస్తున్న సేవ ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ పాల్గొన్నారు.

సర్వజ్ఞ విద్యార్థికి బంగారు పతకం

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మంలోని గాంధీచౌక్ వర్తక సంఘ భవనంలో సైదులు కరాటి స్కూల్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంగు-ఫు చాంపియన్ షిప్‌లో సర్వజ్ఞ విద్యార్థిని కె.శ్రీ రామ కృతిక బంగారు పతకం సాధించిందని పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి.నాగేంద్ర కుమార్ తెలిపారు. ఈ ఆర్‌వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ బంగారు పతకం సాధించిన విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా చదువుతో పాటు విద్యార్థులకు ఆటలలో శిక్షణ ఇస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తూ వాళ్ల మనోధైర్యంతో పాటు ఏకాగ్రతకు, క్రమశిక్షణకు ఆటలు ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కే. నీలిమ మాట్లాడుతూ విద్యార్థిని కె. శ్రీ రామ కృతికకి అభినందనలు తెలిపారు. ఆడపిల్లలకు స్వీయ భద్రతలో భాగంగా పాఠశాలలో కరాటే నేర్పిస్తున్నామన్నారు. ముస్ముందు మరెన్నో విజయాలు సాధించాలని తెలియజేస్తూ వారి సంతోషాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పవిత్ర, కరాటే మాస్టర్ ఉపేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ షోటోకాన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో సత్తాచాటిన న్యూఇరా విద్యార్థి

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని సైదులు కరాటే స్కూల్ వారు కరాటే, కుంగ్ ఫూ చాంపియన్ షిప్ 2025 ఈనెల 2వ తేదీన గాంధీచౌక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అండర్ 12 విభాగంలో ఖమ్మం జిల్లాలోని న్యూఇరా పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సయ్యద్ అమీర్ పాషా, బ్లాక్ బెల్ట్ జాతీయ స్థాయిలో కటా విభాగంలో మూడవ స్థానం, కుమిటి (ఫైట్) విభాగంలో మొదటి స్థానం గెలుచుకున్నాడని పాఠశాల చైర్మన్ ఐ.వి.రమణారావు , డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వరరావు తెలిపారు పతకం సాధించిన అమీర్ పాషాను అభినందించి భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలలో గెలవాలని కొనియాడారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం అల్పాహారం అందజేశారు. క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మంచిగా చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. నంబూరు మోహన్‌రావు ఈ కార్యక్రమానికి స్పాన్సర్ చేశారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శీలం వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
6
బుధవారం | ఫిబ్రవరి 05, 2025 | www.navatelangana.com

బాల భారతి విద్యార్థికి

ప్రధానమంత్రి అభినందన పత్రం

నవతెలంగాణ-తల్లాడ



తల్లాడ బాల భారతి విద్యాలయం విద్యార్థి తోట అజయ్‌కు 2023-24 విద్యా సంవత్సరానికి మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుండి అభినందన పత్రం కొరియర్ ద్వారా అందిందని పాఠశాల కరస్పాండెంట్ కే.ప్రవీణ్ తెలిపారు. తోట అజయ్ వికసిత్ భారత్ లక్ష్యంతో గుజరాత్ లోని వాద్ నగర్ లో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఈ విశిష్టమైన గుర్తింపును పొందారు. మోడీ అభినందన పత్రాన్ని పంపించి రాబోయే పరీక్షల్లో మంచి ప్రదర్శన చూపాలని ఆకాంక్షించారు. ఈ గౌరవాన్ని అందుకున్న తోట అజయ్‌ను పాఠశాల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, కేఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లూరు రామారావు అభినందించారు.

14 మంది యువకులపై కేసు నమోదు

- ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని న్యూసెన్స్ చేస్తున్న 14 మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఖమ్మంలో రోడ్లపై రాత్రిపూట ఓవర్ స్పీడ్‌తో ట్రిబుల్ రైడ్‌తో బైక్‌లను అడ్డదిడ్డంగా నడుపుతూ, విపరీతమైన శబ్దాలు, స్టంట్స్ చేస్తూ సామాన్య ప్రజలకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న 14 మంది యువకులను సోమవారం రాత్రి ఖమ్మం టూ టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపార. వారి వద్ద నుండి 7 బైకులను స్వాధీనం చేసుకొని వారిపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.
ఎవరైనా రాత్రి పది గంటల తరువాత ఖమ్మం పట్టణంలో అనవసరంగా రోడ్లపై ఇష్టం వచ్చినట్లు బైకులపై తిరుగుతూ సామాన్య ప్రజలకు, శాంతిభద్రతలకు ఇబ్బందులు కలగజేస్తే వారి బైకులను సీజ్ చేసి, వారిపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, ముఖ్యంగా యువత రాత్రిపూట జల్సా తిరుగుళ్ళు మానుకోవాలని హెచ్చరించారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో తమ ప్రతిభను చాటాలి

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రాజేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

విద్యార్థులు పోటీ పరీక్షల్లో తమ ప్రతిభని చాటాలని వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, ప్రతిభా పరీక్షలు ఉపయోగపడతాయని, విద్యార్థులు ప్రతిభా పరీక్షలు ద్వారా మానసిక ధైర్యాన్ని పెంచుకుని ఒత్తిడిని తగ్గించుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రాజేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు భాగం హేమంత్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఎస్ఎస్పి క్యాంపులో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి టాలెంట్ టెస్ట్ పేపర్‌ను వారు ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రాజేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు శివరామకృష్ణ, ఎస్ఎస్పి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్, వైవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు నాగుల మేర, శివ నాయక్, వంశి, హరికృష్ణ, మనోజ్ గోపి పాల్గొన్నారు.



బీవీకే ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

నవతెలంగాణ-ఖమ్మం


మాజీ ఎంఎల్ఏ బోడేపూడి వెంకటేశ్వరరావు పేరుతో ఖమ్మం సుందరయ్య భవన్ లో నడుస్తున్న బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మరో ఉచిత కార్యక్రమం ప్రారంభం అయింది. దాతల సహకారంతో ఉచిత కుట్టు మిషన్ కార్యక్రమాన్ని బివికె ట్రస్ట్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, సీఐటియూ నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీవీకే ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం, పేద ప్రజల కోసం ప్రతి నెలా మెడికల్ క్యాంపు నిర్వహణ చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా కరోనా సమయంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ మధ్య వచ్చిన వరదలు సమయంలో కూడా ఉచితంగా సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. దాతలు సహకారంతో సేవా కార్యక్రమాలు పెంచుతామని అన్నారు. మూడు నెలల పాటు మహిళలు కుట్టు మిషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి ఉచితంగా కుట్టు మిషన్ ఇస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో ఎవరైనా ఈ సహకారం పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఏ. జబ్బర్, ఎస్.నవీన్ రెడ్డి, అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, బి సుదర్శన్, గోవిందరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమే

- పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ్ కుమార్

నవతెలంగాణ నేలకొండపల్లి

క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే నివారించడం సాధ్యమేనని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆలేటి పరంజ్యోతి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్యాన్సర్ వ్యాధిపై సంపూర్ణమైన అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థి దశలో క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండటం వలన వారి కుటుంబానికి తద్వారా సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో నోటి క్యాన్సర్, గర్భాశయ, అండాశయ కాన్సర్, వంటివి అధిక శాతం గుర్తించినట్లు తెలిపారు. విద్యార్థులు ముఖ్యంగా యువత పొగాకు, గంజాయి, గుట్కా, తాగుడు వంటి మత్తు పదార్థాలు జోలికి పోకుండా జీవన విధానాన్ని సులభతరం చేసుకున్నట్లయితే క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించబడుతున్నాయని విద్యార్థులు తమకు ఏ విధమైన సందేహాలు ఉన్నప్పటికీ ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం కళాశాల ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ ఆర్ శ్రావణ్ కుమార్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యులు డాక్టర్ నిరోషా, డాక్టర్ మాధవి, హెచ్ఇవో చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ బీవీ రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా తుమ్మల యుగేందర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో పింజరమడుగు మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య ఆధ్వర్యంలో తుమ్మల యుగేందర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్తా హెూం నందు కార్యకర్తలు నడుమ భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మార్తా హెూం లో ఉన్న అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనాథ ఆశ్రమం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సాధారణ సెలవుగా ప్రకటించాలి

నవతెలంగాణ-కారేపల్లి

బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి రోజును సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని కారేపల్లి మండలంలోని లంబాడీ సంఘాల ఐక్య వేదిక మంగళవారం ఎంపీడీవో జీ.సురేందర్, డిప్యూటీ తహసీల్దార్ల లక్ష్మిలకు వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు బానోత్ రాములు, అజ్మీర వీరు, బి.శంకర్, దేవుసింగ్, రాంబాబు, రాంజీ, రాంకోటి, బోడ రవి ఉన్నారు.

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

- యాత్రికులను ఆకర్షించేలా పాలేరు లేక్ పార్క్ వద్ద పనులు చేపట్టాలి
- పిక్నిక్ స్పాట్ కింద ఖమ్మం ఖిల్లా అభివృద్ధికి చర్యలు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను చరిత్ర ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని, ఆ దిశగా అధికారులు అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పురావస్తు, పర్యాటక శాఖ అధికారులతో నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సమీక్షించారు. నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, పాలేరు పార్క్, ఖమ్మం ఖిల్లా వంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ వివరాలు తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రాత్మక ప్రాంతాల వద్ద సిమెంట్ కట్టడాలను తగ్గించాలని, అక్కడ చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో మన చరిత్ర ప్రతిబింబించేలా అధికారులు చర్యలు చేపట్టాలని, చారిత్రక ప్రాంతాల సందర్శకులకు మన చరిత్ర తెలిసే విధంగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అన్నారు. బౌద్ధ స్థూపం వద్ద ఓపెన్ ఎయిర్ మ్యూజియం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని, అక్కడ వాకింగ్ పార్క్ ఏరియా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. రాతి శిల్పాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు అధికంగా పర్యాటకులు వచ్చే విధంగా జాతీయ రహదారులలో, ముఖ్యమైన కూడలీల వద్ద సమాచార బోర్డులు, పర్యాటక ప్రాంతాలకు దారి చూపించే సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. మన చరిత్ర తెలిసే విధంగా చారిత్రాత్మక ప్రాంతాల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్ బ్లాకులు, వసతుల కల్పన చేయాలన్నారు. ప్రపంచంలోని ఏథెన్స్ లోని పార్థినన్, ఈజిప్టు కర్నాక్ టెంపుల్ వద్ద అక్కడి చరిత్ర తెలిసే విధంగా అద్భుతంగా ఏర్పాట్లు చేశారని, అదేవిధంగా మన జిల్లాలోని చారిత్రక ప్రాంతాలలో కూడా ప్రజలకు సులువుగా చరిత్ర అర్థమయ్యే విధంగా ఏర్పాట్లు చేయుటకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాలేరు లేక్ పార్కు వద్ద ఉన్న పాత నిర్మాణాలకు కావాల్సిన మరమ్మతులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సందర్శన ప్రాంతాలుగా తీర్చి దిద్ది, చక్కటి ప్రాంతం సందర్శించిన అనుభూతి కలిగే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పాలేరు పార్క్ వద్ద



అవసరమైన టాయిలెట్ బ్లాక్, టికెట్ కౌంటర్, ముఖ్యమైన మరమ్మతులు వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సందర్శకుల బోటింగ్ కు చర్యలు చేపట్టాలని, కాటేజీల నిర్మాణానికి ప్రణాళిక చేయాలని తెలిపారు. పాత్రికేయులు, ఉద్యోగులు, జిల్లాలోని ఇతర ప్రముఖులు పలుమార్లు ఖమ్మం ఖిల్లాను సందర్శించేలా కార్యక్రమాలు రూపొందించాలని, పిక్నిక్ స్పాట్ కింద ఖమ్మం ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు అక్కడ నాలుగు నుండి ఐదు వ్యూ పాయింట్ లను అభివృద్ధి చేయాలని కలెక్టర్ తెలిపారు. రోప్ వే నిర్మాణానికి సమస్యల పరిష్కారం త్వరితగతిన చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ నరసింహా రావు, ఆర్కిటెక్చర్ వి. సత్య శ్రీనివాస్, సీనియర్ ఇంజనీర్ వెంకటేష్, టూరిజం శాఖ డీఈలు ఎస్.రామకృష్ణ, ఎం.వి. శ్రీధర్, పురావస్తు శాఖ ఏడిలు బి. మల్లు నాయక్, ఎస్. నర్సింగ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాపరంగా వెనుకబడిన జిల్లాల్లో ఫలితాల మెరుగుకు కేంద్రం ఏం చర్యలు తీసుకుంటోంది..?

- గత ఐదేళ్లుగా ఎన్ని జిల్లాలు గుర్తించారు..?
- చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలేంటి..?
- లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామసహాయం

నవతెలంగాణ-ఖమ్మం



దేశంలో విద్యాపరంగా వెనుకబడిన జిల్లాల్లో.. మెరుగైన ఫలితాలు సాధించేందుకు, అక్కడ విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు చేపడుతోందని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మంగళవారం లోక్ సభలో ప్రశ్నించారు. ఇంకా.. గత ఐదేళ్ల కాలంలో విద్యాపరంగా వెనుకబడిన ఎన్ని జిల్లాలను గుర్తించారని, తాజా జనాభా లెక్కల ప్రకారం ఆయా జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ నిష్పత్తి ఏ విధంగా ఉందని ఎంపీ ప్రశ్నలు సంధించారు. దీనికి కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. విద్యాపరంగా వెనుకబడిన జిల్లాలు దేశవ్యాప్తంగా 112 ఉన్నాయని.. అందులో తెలంగాణ నుంచి మూడు జిల్లాలు ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం కలవని తెలిపారు. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందేలా, విభిన్న విద్యాసామర్థ్యాలు పెంపొందించేలా 2018లో నీతి ఆయోగ్ ద్వారా.. కార్యక్రమాలు చేపట్టామని, 2020 నుంచి సమగ్ర శిక్షా పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా 1,182 రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల మంజూరు చేసినట్లు చెప్పారు. వీటిల్లో నాణ్యతను పెంపొందించేందుకు 194 హాస్టళ్లకు రూ. 476.16 కోట్లు ఆమోదించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టి, ఓబీసీ, మైనారిటీ, వెనుకబడిన వర్గాల బాలికల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలైన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు ప్రవేశపెట్టినట్లు వివరించారు.
దేశంలో ఇప్పటివరకు సమగ్ర ఇ - కామర్స్ (ఆన్‌లైన్‌లో వస్తువులు, సేవల వ్యాపారం) విధానం లేదని, పూర్తి పర్యవేక్షణ లేక లక్షలాదిమంది చిరు వ్యాపారుల జీవనోపాధి పై ప్రభావం పడుతోందని, ఇ - కామర్స్ పూర్తి పర్యవేక్షణకు ప్రత్యేక చట్టం రూపొందిస్తారా..? అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఏదైనా ఏకరూప విధానం ఉందా అని ప్రశ్న సంధించగా.. కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, ఐటీ శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.
ఇ - కామర్స్ రంగం సమగ్ర చట్టపరమైన విధానాలతో నిర్వహించబడుతుందని అన్నారు. వినియోగదారుల రక్షణ నియమాలు పాటిస్తామని, జీఎస్టీ చట్టం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, ఎఫ్ డీఐ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతుందని తెలిపారు. దేశంలోని చిరు వ్యాపారుల ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుందని తెలిపారు. డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ), ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్డీసీ) ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని అన్నారు.

ఫలించిన సీఐటీయూ పోరాటం

- ఎఫ్‌సీఐలో కార్మికుల తొలగింపు పట్ల గోదాం ఎదుట ఆందోళన
- లారీలను అడ్డుకున్న నాయకులు చర్చలు జరిపిన పోలీసులు, అధికారులు
- తొలగించిన వారిని విధుల్లో తీసుకుంటామని హామీ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఎఫ్‌సిఐలో పనిచేస్తున్న కొంతమంది కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ మంగళవారం సీఐటియు ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఎఫ్‌సిఐ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమం సిఐటియు త్రీ టౌన్ కన్వీనర్ యర్రా మల్లికార్జున అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటియు రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, సిఐటియు జిల్లా నాయకులు వై.విక్రమ్ మాట్లాడుతూ ఎఫ్సీఐలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను అర్థాంతరంగా తీసివేయడం చాలా దారుణం అని వారు అన్నారు. రాత్రికి రాత్రే పనిలో నుంచి తీసివేయడం వల్ల వాళ్ళ కుటుంబాలు మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మహిళా కార్మికుల పట్ల కూడా అసభ్యంగా ప్రవర్తించి కొద్దిమంది మహిళలను సబ్ కాంట్రాక్టర్ పనిలో నుంచి తీసివేయడం వల్ల వారు ఏడుస్తున్నారని వారి సందర్భంగా తెలిపారు. కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తున్న సబ్ కాంట్రాక్టర్ రవి కాంటాక్ట్‌ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తూ ఎఫ్సీఐ లోపలికి వెళ్లే లారీలను నిలిపివేశారు. దీంతో అధికారులు పోలీసు వారికి సమాచారం ఇచ్చారు. ఖమ్మం త్రీటౌన్ సీఐ ఎఫ్.సి.ఐ దగ్గరికి చేరుకొని ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులతో చర్చలు జరిపారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడామని, కొంతమంది కార్మికులను పనిలోకి తీసుకున్నారని వారు తెలిపారు. అదేవిధంగా సబ్ కాంట్రాక్టర్ గా ఉన్న రవి మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని సిఐటియు నాయకులు సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళా కార్మికులకు జరిగిన అన్యాయం విషయంలో తక్షణమే సబ్ కాంట్రాక్టర్ రవిని అదుపులోకి తీసుకొని విచారిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన కార్మికులను, మహిళలను మరో రెండు రోజులలో పనిలోకి తీసుకుంటామని ఈ సందర్భంగా ఎఫ్సీఐ కాంట్రాక్టర్ సీఐటీయూ నాయకులకు తెలిపారు. అదే విధంగా ఇంతకాలం పెండింగ్లో ఉన్న డబ్బులు కూడా విడుదల చేస్తామని తెలిపారు. సిఐటియు అంటే నిరంతరం కార్మికుల పట్ల పోరాటాల నిర్వహించే సంఘమని, ఏ సమస్య అయినా పోరాడి సాధించుకోవచ్చని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్రా



శ్రీనివాసరావు, సీఐటియు జిల్లా నాయకులు ఎంఏ జబ్బార్, రైతు సంఘం జిల్లా నాయకులు షేక్ మీరా సాహెబ్, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.నవీన్ రెడ్డి, దొంగల తిరుపతిరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, సీపీఐ(ఎం), సీఐటియు జిల్లా నాయకులు భూక్య శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, బత్తిని ఉపేందర్, సిఐటియు జిల్లా నాయకులు ముదాం శ్రీనివాసరావు, ఖమ్మం డివిజన్ నాయకులు 35వ డివిజన్ కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, యర్రా రంజిత్, షేక్ హిమామ్, కెవిపిఎస్ జిల్లా నాయకులు నాయకులు షేక్ సైదులు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు, కూరపాటి శ్రీనివాస్, సారంగి పాపారావు, బీఎస్ఎన్ఎల్ జిల్లా నాయకులు తిరుమలచారి, మహిళా సంఘం త్రీ టౌన్ అధ్యక్షురాలు బండారు సునీత, షేక్ అమీనా, సిద్దల రాజు, మీనాల మల్లికార్జున్, పంది స్వామి, ఎఫ్సీఐ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మరుగుజ్జు ప్రవీణ్‌కు "మార్పు" చేయూత

నవతెలంగాణ-వైరాటౌన్

మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామం నివాసి మరుగుజ్జు పూర్ణకంటి ప్రవీణ్‌కు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన పూర్ణకంటి ప్రవీణ్ పూర్తి అంగవైకల్యంతో పుట్టడం వల్ల ఏ పని చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. ప్రవీణ్ తండ్రి చనిపోయాడు. తల్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి దయనీయ స్థితిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ మార్పు స్వచ్ఛంద సంస్థను సంప్రదించగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత పూర్ణకంటి ప్రవీణ్ ఇంటికి వెళ్ళి 5000/- అందజేశారు. ఈ సందర్భంగా గుడిమెట్ల రజిత మాట్లాడుతూ మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి చేతనైన సహాయం చేస్తున్నామని, చిన్న సహాయం కూడా ఆపదలో ఉన్నవారికి చాలా ఉపయోగ పడుతుందని, మానవత్వంతో దాతలు ముందుకు వచ్చి వికలాంగులకు చేయూత అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాపగంటి రాంబాబు, పూర్ణకంటి పద్మ, పూర్ణకంటి కావ్య, పూర్ణకంటి లోకేష్, మంద కౌసల్య, పాపగంటి వాసు, బల్లేపోగు ధనలక్ష్మి, గుజ్జా పూర్ణ, చర్చి ఫాదర్ పూర్ణకంటి ఏసు దాసు తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో విషం కలిపి పెట్టిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

భోజనంలో విషం కలిపి పెట్టిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ జిల్లా అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి డి.రాంప్రసాదరావు తీర్పునిచ్చారు. ఏసిపి, సీఐ, ఎస్సైలు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం చంద్రుతండా గ్రామానికి చెందిన బోడ హరిదాసు, బోడ మాల్సూర్, బోడ భద్రులను అదే గ్రామానికి చెందిన బోడ చిన్న అను వ్యక్తి పెద్దకర్మ భోజనాలకు రమ్మని పలుమార్లు ఇంటి దగ్గరికి వచ్చి పిలిచి తీసుకెళ్లి ఐబి మద్యం బాటిల్ లో విషం కలిపి 14-08-2021న హత్య చేశారు. నలుగురు నిందితులపై స్థానిక పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి చార్జ్ షీట్ ఫైల్ చేయడంతో 30 మంది సాక్ష్యులను విచారించి 4-02-2025న కోర్టులో హాజరు పరిచగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణమోహన్రావు కేసును వాదించగా నేరం రుజువుఅయింది. నిందితుడు బోడ చిన్నాకు జీవిత ఖైదుతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

మరణంలో కూడా వీడని బంధం

48 గంటల వ్యవధిలో భార్యాభర్తలు మృతి



- సీపీఐ(ఎం) బలోపేతానికి మట్టూరి దంపతుల కృషి
- నివాళులర్పించిన సీపీఐ(ఎం) జిల్లా నాయకులు

నవతెలంగాణ-కల్లూరు

నూరేళ్ల దంపతులుగా ఇద్దరు కలిసి జీవించిన వారి బంధం మరణంలో కూడా వీడలేదు. ఆయన లేని ఈ జీవితం తాను ఎలా కొనసాగించాలనే మనోవేదనతో భర్త మతి చెందిన 48 గంటల్లోనే ఆ గుండె కూడా ఆగి పోయింది. మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మట్టూరి భద్రయ్య, సతీమణి లింగాల తొలి గ్రామపంచాయతీ సర్పంచ్ మట్టూరి సీతారత్నం మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు.
మట్టూరి భద్రయ్య అనారోగ్య కారణాలతో శనివారం రాత్రి మృతి చెందిన విషయం విధితమే. ఆయన సతీమణి మట్టూరి సీతారత్నం భర్త ఆశయానికి తాను కూడా తోడై భర్తకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆయన చేస్తున్న సీపీఐ(ఎం) ఉద్యమాలకు చేదోడువాదోడుగా ఉంటూ, కొన్ని రోజులు పాటు భర్త ఇంటికి రాకపోయినా అంతా తానై కుటుంబాన్ని పిల్లల్ని చూసుకునేవారు. ఒక్కోసారి కేవలం బట్టలు మార్చుకొని పోవడానికి ఇంటికి వచ్చిన భర్తకు బట్టలు సిద్ధం చేసి పెట్టి ఉంచేవారు. మీ ఆశయానికి కొనసాగించండి.. నీకు తోడుగా నేనుంటా అని భరోసా కల్పించేవారు. ఆ విధంగా పిల్లల్ని ఉన్నతవంతులుగా తీర్చిదిద్ద డంతోపాటు వ్యవసాయ పనులు కూడా చూసుకొని ఎనలేని కృషి చేశారు. ఈ విధంగా సీపీఐ(ఎం) సత్తుపల్లి డివిజన్లో బలోపేతానికి ప్రత్యక్షంగా భర్త, పరోక్షంగా భార్య కృషి చేశారు. ఎర్ర బోయినపల్లి గ్రామపంచాయతీ నుండి లింగాల గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయగా తొలి సర్పంచ్‌గా సీపీఐ(ఎం) తరఫున సీతారత్నం ఎన్నికై 5 సంవత్సరాలు పాటు గ్రామానికి సేవలు అందించారు. 15 సంవత్సరాల క్రితం మట్టూరి భద్రయ్య క్యాన్సర్ వ్యాధికి గురయ్యారు. అప్పటినుండి భర్తకు ఎలాంటి ఇబ్బంది రాకుండా కంటికి రెప్పలాగా కాపాడుకుంటూ సేవలందించారు. తనకు మోకాలు ఆపరేషన్ అయిన గుండెకు స్టంట్ పడిన తాను అనారోగ్యానికి గురి అయినప్పటికీ భర్తకు తానే సేవలు అందించాలని సేవలందించారు. భర్త పడే బాధను కళ్ళారా చూసి తాను బాధపడేది. కుమారుల సహకారంతో భర్తను దూది శ్వాస విడిచే వరకు చిన్నపిల్లవాడిలాగా సేవలందించారు. మట్టూరి భద్రయ్య, శనివారం సాయంత్రం మృతి చెందారు. అప్పటి నుండి తనకు తోడు దూరమైందని మనోవేదనకు గురై ఆయన లేని జీవితం తాను ఎలా సాగించాలని ఆవేదనతో సోమవారం రాత్రి గుండెపోటు వచ్చింది. కుమారులు శ్రీనివాసరావు, స్టాలిన్, హుటాహుటిన కల్లూరు తరలించి వైద్య సేవలు అందించినప్పటికీ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొన్ని గంటల వ్యవధిలోనే భార్యాభర్తలు ఇరువురు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



నేత్రాలు దానం

సీతారత్నం నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి కుమారులు శ్రీనివాసరావు, స్టాలిన్లు దానం చేయటానికి ముందుకు రావడంతో సంస్థ వైద్యులు కళ్ళను స్వీకరించి నేత్రనిధికి తరలించారు.

సీతారత్నం మృతికి సీపీఐ(ఎం) నేతలు నివాళి

మట్టూరు భద్రయ్య సతీమణి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకొని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకుని సీతారత్నం భౌతికకాయంపై సీపీఐ(ఎం) జండా కప్పి నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి వర్గం సభ్యులు మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు తన్నీరు క్రిష్ణార్జునరావు, శీలం పకీరమ్మ, తల్లాడ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, కల్లూరు మండల కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, పెనుబల్లి మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, పార్టీ నాయకులు పారుపల్లి క్రిష్ణారావు, నల్లమల ప్రతాప్, మందడపు రామారావు, మామిళ్ల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | ఫిబ్రవరి 05, 2025 | www.navatelangana.com

ఓటరు జాబితాకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన



నవతెలంగాణ-పాల్వంచ

ఓటరు జాబితాకు రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన కోరారు. భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీలలో ఓటరు జాబితా వివిధ దశల తయారీ, ప్రచురణ అభ్యంతరాల స్వీకరణ పై జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో విద్యా చందన అధ్యక్షతన మంగళవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశం మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం జనవరి 30వ తేదీన విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీలో ఓటరు జాబితా తయారు చేయడం, ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ ఫిబ్రవరి 3 నుండి 7వ తేదీ వరకు పూర్తి చేయుటలో రాజకీయ పార్టీలు సహకరించాలని అన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీలో 41 వేల ఎనిమిది మంది ఓటర్లు, సారపాకలో 19044 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏదైనా తప్పులు లేదా మార్పులు ఉన్నట్లయితే లికిత పూర్వకంగా స్థానిక ఎంపీడీవోలకు ఆరవ తేదీ సాయంత్రంలోగా అందజేయాలని తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామని ఆమె అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్ర మౌళి, నేషనల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఐ(ఎం) రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డీటీకి టీఎన్జీవోస్ బృందం శుభాకాంక్షలు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

టీఎన్జీవోస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రెటరీ డెక్క నరసింహారావు గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా డిప్యూటీ తహసీల్దార్‌గా జాయిన్ అవుతున్నటువంటి ధనియాలు వెంకటేశ్వరరావు, గుండు రాజులుకు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రెవిన్యూ వ్యవస్థ నందు డిప్యూటీ తహసీల్దారు అత్యంత కీలకమైన బాధ్యతలని, అట్టి బాధ్యతలకు వారు వన్నె తేస్తారని తెలియజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఇటు ప్రజలకి అటు ఉద్యోగస్తులకి అందుబాటులో ఉంటామని తెలుపుతూ టీఎన్జీవోస్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షులు గద్దల నరసింహారావు, ట్రెజరర్ పడిగ నరసింహారావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సాదిక్ పాషా, గాంధీ, లింగమూర్తి, పుల్లారావు, నరసింహారావు, బిక్కులాల్, క్రాంతి, వెంకటేశ్వర్, జగపతి, బ్రహ్మారావు, తదితరుల పాల్గొన్నారు.

ప్రతీ పంచాయతీలో ఓటర్ల జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-చంద్రుగొండ

మండలంలోని ప్రతి పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని ఎంపీడీవో అశోక్ తెలిపారు. మంగళవారం ఓటర్ల డ్రాప్ పబ్లికేషన్స్ పై నిర్వహించిన సమావేశంలో ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. మండలంలోని 14 గ్రామపంచాయతీలో 23893 మంది ఓటర్లు ఉన్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ ఖాన్, అఖిలపక్షం నాయకులు కొడకండ్ల వెంకటరెడ్డి, ధారా వెంకటేశ్వర్లు, దారం గోవిందరెడ్డి, పెద్దిన్ని వేణు, నల్లమోతు రఘుపతిరావు, బొర్రా కేశవులు, వారధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి మండలం 9వ మైలు తండాలో కృషి విజ్ఞాన కేంద్రము, వ్యవసాయ శాఖ సంయుక్తముగా రైతులకు మునగ సాగు, ఆయిల్ పామ్ సాగు, కూరగాయల సాగు పైన అవగాహన కార్యక్రమము చేపట్టినట్లు మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతుకు లాభదాయకమైన, మేళుకువలు యాజమాన్య పద్ధతులు, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, వచ్చే విదంగా పలు సలహాలు, సూచనలు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న, పంటలు పండియడం వంటి అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె.ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, ఇల్లందు డివిజన్ ఏడీఏ లాల్ చంద్, శాస్త్రవేత్త బి.శివ, రైతులు పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో పన్నులు వసూళ్లు ప్రారంభం



నవతెలంగాణ-అశ్వారావుపేట

నూతన పురపాలక శాఖలో ఆధ్వర్యంలో పన్నుల వసూళ్ళు ప్రారంభం అయ్యాయి. మున్సిపల్ కమిషనర్ కే.సుజాత ఆదేశాల మేరకు అశ్వారావుపేట పురపాలక సంఘం పేరున రసీదు పుస్తకాలను చేత బట్టి వసూళ్ళు ప్రారంభించారు. మున్సిపాలిటీలో విలీనమైన అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాల చెరువు గ్రామాలలో ఇప్పటివరకు కుంటు బడిన పన్నుల వసూళ్ళను మార్చి చివరి వరకు పూర్తి చేయాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ఇంటి పన్నులతో పాటు నీటి పన్ను, వ్యాపార రుసుము వంటి పన్నులను వసూళ్ళు వేగవంతం చేయాలని సూచించారు. ఈ వసూళ్ళు కార్యక్రమంలో వార్డు అధికారులు కె.శ్రీరామ్మూర్తి, సందీప్, స్వరూపతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్పీ పార్టీకి యెర్రా కామేష్ రాజీనామా



నవతెలంగాణ-కొత్తగూడెం

బీఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి యెర్రా కామేష్ మంగళవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2020 నవంబర్ 12వ తేదీన బీఎస్పీలో చేరినట్లు, ప్రతి సంవత్సరం జిల్లా అధ్యక్ష హెూదాలో 2020, 2021వ సంవత్సరంలో నాకు నిర్దేశించిన జన కళ్యాణ్ దివస్ డబ్బులను అందజేయడం జరిగిందని చెప్పారు. 2022-23 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెూదాలో జిల్లా కమిటీకి నిర్దేశించిన నిధులు సమకూర్చినట్లు తెలిపారు. 2023 శాసనసభ ఎన్నికల్లో పార్టీ నుండి పోటీ చేయుటకు అవకాశం కల్పించినందుకు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాని అట్టి రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌కు పంపినట్టు తెలిపారు. ఇన్ని రోజులు బీఎస్పీలో తనకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్ పికింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలి

- సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిమాండ్

నవతెలంగాణ-మణుగూరు

సేల్ పికింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మణుగూరు ఓసి మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లుకి వినతి పత్రాన్ని మంగళవారం అందజేసినట్టు సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఆదేర్ల సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మణుగూరు ఓసీలో సెల్ పీకింగ్ కాంటాక్ట్ కార్మికులకు నెల నెల వేతనాలు చెల్లించడంలో జాప్యం చెయ్యడంతో కుటుంబపోషణ భారంగా మారి జీతాలు అందాక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించి సదరు కాంట్రాక్టర్ వద్దనుండి వేతనాలు సరైన సమయానికి అందేలా చర్యలు తీసుకోవలని బ్యాంకు ద్వారా వేతనం చెల్లిచాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పిట్ ఏఐటీయూసీ నాయకులు జెల్లరాపు రమేష్, కాంట్రాక్టు కార్మికులు ప్రవీణ్, సుమంత్, సారయ్య, ప్రవీణ్ కుమార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

షణ్ముక్ సాయిని అభినందించిన డీఎస్పీ



నవతెలంగాణ-పాల్వంచ

ఇటీవల ఖమ్మంలో జరిగిన నేషనల్ లెవెల్ కరాటే కాంపిటీషన్లో పాల్వంచ ఏఐఎం లీడ్ స్కూలుకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి షణ్ముక్ సాయి ప్రథమ బహుమతి పొందిన సందర్భంగా పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్, సీఐ కే.సతీష్ అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అభినందనలు తెలియజేస్తూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా తమ ప్రాతినిధ్యం కనపరచాలని ఆకాంక్షించారు. ఏఐఎమ్ లీడ్ స్కూల్లో విద్యార్థులకు చదువులతోపాటు ఆటల్లో కూడా వారి ప్రాతినిధ్యాన్ని అందించటం గొప్ప అంశమని అభినందించారు. నేషనల్ లెవెల్ కరాటే కాంపిటీషన్లో మొదటి బహుమతి సాధించడం పాల్వంచకు దక్కిన ఒక అదృష్టంగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రెంటాల నాగభూషణం మాట్లాడుతూ ఏఐఎం లీడ్ స్కూలుకు కాన్సెప్ట్ బేసిడ్ లెర్నింగ్‌లో విద్యాబోధన జరుగుతుందని విద్యార్థులు ప్రతిదీ వ్యక్తిగత అనుభవాల ద్వారా నేర్చుకుంటారని క్రీడలకు పాఠశాలలో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ పట్టణ సీఐ కే.సతీష్, ఎస్ఐ రాఘవయ్య, పాఠశాల ఏవో మోహన్ రావు, పీఈటీ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు కాసాని ఐలయ్య



- కాసాని స్ఫూర్తితో భూమి పోరాటాలు ఉధృతం చేస్తాం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ

నవతెలంగాణ-చర్ల

జీవించినంత కాలం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప ప్రజానాయకుడు కాసాని ఐలయ్య అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు కీర్తించారు. మంగళవారం బందెల చంటి అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో మచ్చ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక భూమి, కూలి పోరాటాలు నిర్వహించిన చరిత్ర కాసానిదన్నారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థా యిగా నిలిచిపోయే గొప్ప కమ్యూనిస్టు నాయకుడన్నారు. సుజాతనగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకధాటిగా 22 సంవత్సరాలు ప్రజలకు సేవ చేసి వారి మన్ననలు పొందాడన్నారు. కాసాని స్ఫూర్తితో విప్లవ కార్యాచరణలో సీపీఐ(ఎం) కార్యకర్తలు కదిలి వచ్చి ప్రజా సమస్యల పై పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు పొడుపుగంటి సమ్మక్క, తాటి నాగమణి, పామర్ బాలాజీ, దొడ్డి హరినాగ వర్మ, ఊడుగుల షారోణి, శ్యామల చంద్రం, వరదల వరలక్ష్మి, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు కాసాని

సంతాప సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర నేత ఏజే రమేష్

ఇల్లందు : బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు కాసాని ఐలయ్యని సీపీఐ(ఎం) రాష్ట్ర నేత ఏజే రమేష్ అన్నారు. స్థానిక ఏలూరి భవన్‌లో మంగళవారం కాసాని ఐలయ్య సంతాప సభ మండల కమిటీ ఆధ్వర్యంలో మునిగంటి లక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రమేష్ పాల్గొని మాట్లాడుతూ కాసాని ఐలయ్య కొత్తగూడెంలో అనేక ప్రాంతాలలో గుడిసెల పోరాటాలు ఉధృతంగా చేసి అనేక చోట్లలో వేలాది మంది పేద ప్రజలతో గుడిసెలు వేయించి అనేక మందికి ఇళ్ళ స్థలాలు ఇప్పించిన మహనీయుడు కాసాని ఐలయ్య అన్నారు. సుజాతనగర్ గ్రామ పంచాయతీకి వారు, వారి సతీమణి లక్ష్మీ సర్పంచ్‌గా పని చేశారని ఆయన తెలిపారు. అనేక వ్యవసాయ కూలీ పోరాటాలు ఉధృతంగా చేసిన పోరాట యోధుడు అన్నారు. అలాంటి మహా నేత కాసాని సంతాప సభలు ఈ నెల మొదటి వారం వారం రోజులు జరపాలని పార్టీ జిల్లా కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ సభలో జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, ఆలేటి సంధ్య, మాదరపు వెంకటేశ్వర్లు, కే.మరియా, కోడెం బోస్, ఎండీ అబ్బాస్, తాళ్లూరి పద్మ, కదారి వెంకటమ్మ, తాండ్ర కాంత, సంతోష, కమల, హసీనా తదితరులు పాల్గొన్నారు.



బీటీపీఎస్ డైరీని ఆవిష్కరించిన సీఈ

నవతెలంగాణ-మణుగూరు

బీటీపీఎస్ నూతన డైరీ, క్యాలెండర్లను బీటీపీఎస్‌లో కర్మాగార చీఫ్ ఇంజనీర్ బి.బిచ్చన్న మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్మాగారంలో అధిక విద్యుత్ ఉత్పత్తికి ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ సాంకేతిక సమస్యలను అధిగమించాలని సూచించారు. ఇంజనీర్ల సమస్యల పరిష్కారం కోసం పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అంకితభావంతో పని చేస్తుందని కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపరిండెంట్ ఇంజనీర్లు డబ్ల్యూ రమేష్ బాబు, టి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ... జెన్కోలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం కోసం అసోసియేషన్ నిస్వార్థంగా పోరాటం చేస్తుందన్నారు. ఈ అసోసియేషన్, ఉద్యోగ జేఏసీ కృషి వల్లే రామగుండం థర్మల్ స్టేషన్‌ను జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ రెడ్డి, జెన్కో కార్యదర్శి బి.రవి ప్రసాద్, బ్రాంచ్ కార్యదర్శి రవితేజ, నాయకులు రాము, వెంకటేషన్, మహేష్, నరేష్, సాయిరామ్, రషీద్ అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

5, 6న పాల్వంచలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

- 23 మండలాల నుంచి 250 మంది ప్రతినిధులు
- విద్యారంగ అభివృద్ధిపై సమగ్రంగా చర్చకు తీర్మానాలు
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అభిమన్యు



నవతెలంగాణ-ఇల్లందు

ఈ నెల 5, 6 తేదీలల్లో పాల్వంచలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు జరగనున్నాయని వీటిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బయ్య అభిమన్యు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం వివిధ సెంటర్లలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్నదని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల కోసం, మెస్ కాస్మోటిక్స్ చార్జీల పెంపు కోసం, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఫీజులు నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్, ప్రభుత్వ హైస్కూల్లో ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించామ న్నారు. అనేక మంది విద్యార్థి అమరవీరులు ప్రాణ త్యాగం చేసిన త్యాగాల గడ్డపై 4వ మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకం అన్నారు.

23 మండలాల నుంచి 250 మంది ప్రతినిధులు

జిల్లా మహాసభలకు జిల్లాలోని 23 మండలాల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో జిల్లా విద్యారంగ అభివద్ధికి అనేక అంశాలపై సమగ్రంగా చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. మహాసభల జయప్రదంకై విద్యారంగ శ్రేయోభిలాషులు, మేధావులు, ఉపాధ్యాయులు, అభ్యుదయవాదులు, విద్యార్థులు తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హేమంత్, నాగరాజు, రాఘవ, మధు, అరవింద్, భరత్, చైతన్, గణేష్, నరేందర్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్లు ఇచ్చిన వారికే బిల్లులు

- లేదంటే కాంట్రాక్టర్ ఎదురుచూపులు
- నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు
- ఇబ్బందులు పడుతున్న కొందరు కాంట్రాక్టర్లు



గొల్లగూడెంలో ఇటీవల నిర్మించిన ఓ సీసీ రోడ్డుపై కంకర తేలి గుంతలు కనిపిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-అశ్వాపురం

కాంట్రాక్ట్ వర్క్ చేసిన వాళ్ల పర్సంటేజీలతో చేతులు తడిపిన వారికే పీఆర్ఏఈ బిల్లులు చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు కాంట్రాక్టర్లు మండలంలో నిర్మాణం చేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ రోడ్లను పర్యవేక్షించే బూర్గంపాడు సబ్ డివిజన్ ఏఈని ప్రసన్నం చేసు కుంటూ ఆయనకు ముట్ట చెప్పాల్సిన పర్సెంటేజీని ముట్ట చెప్పి చాకచక్యంగా బిల్లులు చేయించు కుంటున్నారని కొందరు కాంట్రాక్టర్లు గుసగుసలా డుతున్నారు. కమీషన్ ఇస్తే ఎంబి రికార్డ్, లేదంటే నో రికార్డ్ అన్న సందంగా పీఆర్ఏఈ వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. అంతేకాకుండా ఎటువంటి డెవలప్మెంట్ లేని గ్రామీణ ప్రాంతాలను గుర్తించి అక్కడ చేపట్టా ల్సిన అభివృద్ధిని చేపట్టించడంలో కూడా సదరు ఏఈ పూర్తిగా విఫలమయ్యాడని పలువురు అంటు న్నారు. మండలానికి పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులను పర్యవేక్షణ చేపట్టేందుకు పంచా యతీరా జ్ శాఖ నుండి పూర్తి స్థాయి ఏఈ లేకపోవడంతో మండలంలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలిస్తూ మూడు నాళ్ళ ముచ్చటగానే ముగుస్తున్నాయని పలువురు అంటున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు వదులుతూ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టిన నెలలు గడవకముందే కంకర తేలి గుంతల మయంగా తయారవుతున్నాయని మండల ప్రజలు అంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాంట్రాక్టర్లు ఇష్టాను సారంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి నాణ్యతను పాటించకుండా రోడ్లు పోయడం వల్లే ఈ రోడ్లు కంకర తేలి ఇబ్బందికరంగా మారుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నప్పుడు పర్యవేక్షణ చేపట్టి నాణ్యత ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాసాని, భద్రయ్యలకు నివాళులు



నవతెలంగాణ-దమ్మపేట

సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో అమరజీవులు కామ్రేడ్‌లు కాసాని ఐలయ్య, మట్టూరి భద్రయ్యలకు నివాళులు అర్పించారు. స్థానిక సుందరయ్యభవన్‌లో మంగళవారం ఐలయ్య, భద్రయ్యల సంస్మరణ సభ కుంటా జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంస్మరణ సభకు జిల్లా పార్టీ కమిటీ సభ్యులు పిట్టల అర్జునరావు, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీరణలు హాజరై అమరజీవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వారు తమ జీవితపర్యాంతం రైతులకు, కార్మికుల, కష్టజీవుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేశారని అన్నారు. కాబట్టి వారు ధన్యజీవులయ్యారని పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా తాము నమ్మిన సిద్ధాంతం కోసం తమ సొంత ప్రయోజనాలు సైతం పక్కన పెట్టి సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాలలో పార్టీ నూతన శ్రేణుల్లోకి వెళ్ళేందుకు చివరికంటా పనిచేశారని కొనియాడారు. వారి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమ సమజా నిర్మాణం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, నాగమణి, మంగల నిర్మల, బుల్లెమ్మ, బూదమ్మ తదితరులు పాల్గొన్నారు.



త్రిష మరింత ఎత్తుకు ఎదగాలి

- ప్రపంచ వేదికలో సత్తా చాటడం గర్వకారణం
- సీపీఐ ఆధ్వర్యంలో అభినందన సభ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ముద్దుబిడ్డ ప్రపంచ అండర్ 19 క్రికెట్ కప్ విజేత గొంగడి త్రిష మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించి, జాతీయ మహిళా ప్రధాన క్రికెట్ జట్టుకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ ఆకాంక్షించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ నాయకులు కంభంమెట్టు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... భద్రాచలం పట్టణంలో పుట్టి పెరిగి తండ్రి రామిరెడ్డి అడుగుజాడలలో క్రికెట్ ఓనమాలు నేర్చుకొని జాతీయస్థాయికి త్రిష ఎదగడం భద్రాచలానికే కాకుండా తెలంగాణకే గర్వకారణం అని అన్నారు. రాబోయే రోజుల్లో భారత ప్రధాన జట్టులో చోటు సాధించి ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వి ఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, శోభన్, సాయి, మహేష్, త్రిమూర్తులు, కొండబాబు, గంగాధర్, సాయిరాం, విజయ్ కుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట కాంప్లెక్సు పాఠశాలల్లో బాల మేళా ప్రారంభం

- బాల మేళాతో విద్యార్థుల సామర్థ్యాలు అంచనా : ఎంఈఓ



నవతెలంగాణ-అశ్వారావుపేట

అక్షరాస్యత, సంఖ్యాశాస్త్ర పునాది కార్యక్రమంతో విద్యార్థులు అభ్యసించిన అంశాలను ప్రదర్శించేందుకు అంచనా వేసేందుకు బాల మేళా చక్కని వేదిక అని ఎంఈఓ ప్రసాదరావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ వినూత్న కార్యక్రమంలో బాల మేళాలో విద్యార్థులు సామర్థ్యాలను ఏ మేరకు సాధించగలిగారు అనేది అంచనా వేయవచ్చని, గణితం భాషా సామర్థ్యాలను ఇక్కడ సామూహికంగా ప్రదర్శిస్తారు అని, విద్యార్థులకు ఇది ఆట విడుపు గానే గాక వారి ప్రతిభాప్రదర్శనకు కేంద్రంగా ఉంటుంది అని అన్నారు. అశ్వారావుపేట కాంప్లెక్ పరిధిలోని పాఠశాలల్లో నిర్వహిస్తున్న బాల మేళా-2025 మంగళవారం నుండి ప్రారంభం అయ్యాయి. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి పి.ప్రసాదరావు, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయురాలు పి.హరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం నుండి 11వ తేదీ వరకు కాంప్లెక్సులోని వివిధ ప్రాథమిక పాఠశాలల్లో ఈ బాల్ మేళా నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులతో కాంప్లక్సు స్థాయి బాల్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్సు సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, కార్యదర్శి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి, సహెూపాధ్యాయురాలు శారద విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి పురోభివృద్ధికి కృషి చేయండి

- లక్ష్యసాధన ఆధారంగా ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు
- ప్రకటించిన సింగరేణి యాజమన్యం



నవతెలంగాణ-ఇల్లందు

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదనల కోసం లక్ష్యసాధన ఆధారంగా ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులను సింగరేణి యాజమన్యం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం కార్యాలయం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లందు ఏరియాలో వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్దేశించి ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం 72.00 మెట్రిక్ టన్నులుగా నిర్ణయించబడిందన్నారు. జనవరి, 2025 వరకు సాధించిన లక్ష్యం 57.59 మెట్రిక్ టన్నులు కాగా, లక్ష్యం 3.86 మిట్రిక్ టన్నుల లోటు ఉందన్నారు. మిగిలిన రెండు నెలల 01.02.2025 నుండి 31.03.2025 వరకు ఇంకా 18.27 మిట్రిక్ టన్నులు సాధించాల్సి ఉందన్నారు. నెలవారీ బొగ్గు రవాణా లక్ష్యంగా హాజరు శాతం పెంచుకుంటు, లక్ష్యసాధన ఆధారంగా ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు ఇవ్వలని సింగరేణి యాజమన్యం నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు.

ఉద్యోగి నెలలో కనీసం 22 మస్టర్లు హాజరు ఉండాలి

బొగ్గు ఉత్పత్తి చేసే ఓసీ గనులు, సీహెచ్పిలు/సీఎస్పీలలో పనిచేసే అన్ని ఎన్సీడబ్ల్యూఏ ఉద్యోగులకు ఫిబ్రవరి 1 నుండి మార్చి 31 వరకు ఓసి, గనులు అండ్ సీహెచ్‌పీలలో పనిచేసేవారు నెలవారీ బొగ్గు పంపిణి లక్ష్యాన్ని సాధించడం, ప్రతి ఉద్యోగి నెలలో కనీసం 22 మస్టర్లు హాజరు కలిగి ఉండాలని జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య తెలిపారు. ఇలాంటి ఉద్యోగులకే ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులందరు యంత్రాల పని గంటలను సద్వినియోగం చేసుకోవాలని రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని, అలాగే హాజరు శాతం పెంచాలని సింగరేణి పురోభివృద్ధి కృషి చేయాలన్నారు.

8
నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | ఫిబ్రవరి 05, 2025 | www.navatelangana.com

లేబర్ కార్డు ఇప్పించే బాధ్యత మేస్త్రీలు తీసుకోవాలి

- బిల్డింగు వర్కర్స్‌కు యూటీలిటీ సెంటర్ ఏర్పాటు
- అవగాహనా సదస్సులో కార్మిక శాఖాధికారి శాస్త్రి

నవతెలంగాణ-ఇల్లందు

భవన నిర్మాణరంగ పనులకు కూలీలను తీసుకువెళ్లే మేస్త్రీలు విధిగా వారికి లేబర్ కార్డు ఇప్పించే బాధ్యత కూడా తీసుకోవాలని కార్మిక శాఖాధికారి శాస్త్రి ఆదేశించారు. వెల్ఫేర్ బోర్డు ఫలాలు బిల్డింగ్ వర్కర్స్ మాత్రమే పొందాలన్నారు. స్థానిక బిల్డింగ్ వర్కర్స్ అడ్డా పై సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం బిల్డింగ్ వర్కర్స్‌కు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఇల్లందు ఏఎల్ఓ శాస్త్రి పాల్గొని మాట్లాడుతూ బిల్డింగు వర్కర్స్ కోసం ఏర్పడ్డ వెల్ఫేర్ బోర్డు ఫలాలను అనేక మంది అనర్హులు ఉపయోగించుకుంటున్నారని అసలైన బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు కార్డు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ కార్డు వల్ల కలిగే ఉపయోగాలు పొందలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా వెల్ఫేర్ బోర్డు కార్డు లేని వారు వెంటనే కార్డును ఆన్‌లైన్ ద్వారా పొందాలని సూచించారు. బిల్డింగు వర్కర్స్ యూటీలిటీ సెంటర్‌కు కలెక్టర్ స్థలాన్ని జెకె గ్రంథాలయం ప్రక్కన కేటాయించారని దాని నిర్మాణ పనులు ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ ముగియగానే చేపడతామని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టులు

- చర్యలను ఖండిస్తున్నాం : జిల్లా నేత రాజేందర్

నవతెలంగాణ-ఇల్లందు

భారత రాష్ట్ర సమితి పార్టీ కేంద్ర నాయకత్వం అసెంబ్లీ ముట్టడికి ఎటువంటి పిలుపు ఇవ్వనప్పటికి జిల్లా పోలీస్ యంత్రాంగం గత అర్ధరాత్రి నుండి భద్రాద్రి జిల్లా వ్యాప్తముగా పలు పట్టణాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను అర్ధరాత్రి నుండి ముందస్తు అరెస్టుల పేరిట జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ తెలిపారు. ఇల్లందు పట్టణంలో కూడా పోలీస్ అధికారులు తనతో సహా సత్యనారాయణ, శ్రీను, అబ్దుల్ నభిలను వేకువ జామున 5.00 గంటలకు అరెస్ట్ చేయడం జరిగినదని తెలిపారు.

ఎంపీడీవోని కలిసిన సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్

నవతెలంగాణ-పినపాక

నూతన ఎంపీడీవో సునీల్ కుమార్‌ను పినపాక సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిట్టా వెంకటేశ్వర్లు మొక్కను అందజేసి ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో తన పరిధిలో ఉన్న, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు కొంపెల్లి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు యాకన్నా, ప్రధాన కార్యదర్శి గుడికందుల రాజశేఖర్, ట్రెజరర్ గుమాస్ వెంకటేశ్వర్లు, సభ్యులు కొంపల్లి నాగేష్, దొడ్డ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలుగు బెల్లి నర్సిరెడ్డిని గెలిపించండి : టీపీటీఎఫ్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ నెల 27న జరగబోవు శాసన మండలి ఎన్నికలలో టీపీటీఎఫ్ బలపరుస్తున్న టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగు బెల్లి నర్సిరెడ్డిని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులుగా మరోక మారు గెలిపించుకుందాం అని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కే.మాధవరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. విద్యారంగ, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యలపట్ల, వాటి పరిష్కారం పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తే కాక, 2019 నుండి శాసనమండలిలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల గొంతుకగా నిరంతరం పని చేశారని అన్నారు. ఆయన విజయం కాంక్షిస్తూ మంగళవారం అశ్వారావుపేటలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థించారు. శాస్త్రీయ దృక్పధం, నిజాయితీ, నిబద్ధత కలిగి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం శ్రమించారని తెలిపారు. అధిక మెజారిటీతో గెలిపించాలని, తదనుగుణంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించుకోవాలని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను కోరారు.

రేషన్ దుకాణాలలో విస్తృత తనిఖీలు

నవతెలంగాణ-మణుగూరు

మండలంలోని వివిధ రేషన్ దుకాణాలలో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ విస్తృతంగా మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం పక్కదారి పడితే ఉపేక్షించేది లేదని డీలర్లను హెచ్చరించారు.

హామీల అమలు కోసం 20న చలో హైదరాబాద్

- న్యూడెమోక్రసీ నేతలు సాధినేని, మధు

నవతెలంగాణ-కొత్తగూడెం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అములు కోసం ఈ నెల 20న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి సాధినేని వెంకటేశ్వర రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధులు విమర్శించారు. మంగళవారం రైటర్ బస్తీలోని ఐఎఫ్‌టియూ కార్యాలయంలో న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జే.సీతారామయ్య, అధ్యక్ష కార్యదర్శులు కే.సారంగపాణి, ఏఐకేఎంఎస్ అధ్యక్షులు తుపాకుల నాగేశ్వర రావు ఉమర్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్, ఎండి.రాసుద్దీన్, పొడుగు నరసింహారావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షల డప్పులు, వేల గొంతుకల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో స్థానిక ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కండె రాంబాబు, కార్యవర్గ సభ్యుడు కండె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లక్షల డప్పులు వేల గొంతుకలు కార్యక్రమం గోడ పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకోవడం జరిగిందని, పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ లక్షల డప్పులు వేల గొంతుకలు కార్యక్రమం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సీఎం అనుమతి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణలో కచ్చితంగా మాదిగల ఆత్మగౌరవ సభను జరుపుకుంటామని సీఎం సానుకూలంగా మాదిగల ఆత్మగౌరవ సభకు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ నాయకులు కండె చిన్న ముత్యం, చిన రామ్మూర్తి, నారాయణ, మోహన్ రావు, ముసలయ్య, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానాలతో పార్టీ నిర్మాణం చేయండి

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు నరసింహులు

నవతెలంగాణ-ఇల్లందు

నూతన విధానాలతో పార్టీ బలోపేతం చేయండి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండండని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు అన్నారు. నర్సింహులును హైదరాబాద్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇల్లందు నియోజకవర్గం మాజీ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చాందావత్ రమేష్ బాబు, సీనియర్ నాయకులు కారు నర్సన్న కలిశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంత చేసినందుకు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ విధానాలపై కార్యకర్తలకు నాయకులకు అవగాహన కల్పించి పార్టీని గ్రామ స్థాయి నుండి బలపేతం చేయాలన్నారు. పార్టీ కార్యక్రమలను కార్యకర్తల భాగస్వామ్యం చేసి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు తెలిపారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

నవతెలంగాణ-అశ్వాపురం

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన మంగళవారం గ్రామపంచాయతీ ఎన్నికల కోసం వార్డులవారిగా సప్లమెంటరీ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల జాబితాను తెలియయుటకు మండల స్థాయి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామపంచాయతీలో నూతనంగా ఎంపికైన ఓటర్లతోపాటు తొలగించాల్సిన ఓటరు జాబితా పై స్థానిక నాయకులతో సమీక్షించారు. ఇటీవల వాటర్ జాబితాలో నూతనంగా 369 మంది యువకులు ఓటు హక్కు పొందినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సూపరిండెంట్ పిచ్చేశ్వరరావు, యూడీసీ పద్మావతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, అనంత నేను సురేష్, పవన్ సాయి, ఐలయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ పోరాట ఫలితమే యూటీలిటీ సెంటర్

- జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి

నవతెలంగాణ-ఇల్లందు



బిల్డింగ్ వర్కర్స్ అడ్డా పై కార్మికులకు బాత్ రూమ్, రెస్టు రూం, డైనింగు హాల్ నిర్మించాలని గతంలో కలెక్టర్‌కు వినతులు ఇచ్చిన ఫలితంగా యుటిలిటీ సెంటర్ మంజూరు చేశారని అది సీఐటీయూ పోరాట ఫలితమేనని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి అన్నారు. బిల్డింగ్ వర్కర్స్‌కు లేబర్ కార్డు రెన్యువల్ ఐపోతే 30రోజులు గ్రేసు పిరియడ్ ఇవ్వాలని అలాగే నెల ముందు నెల రెన్యువల్ గురించి మెసేజ్ డిపార్ట్మెంట్ పంపాలని కోరారు. తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో మన్యం మోహన్ రావు, కామ నాగరాజు, మహమూద్, సత్యనారయణ కోరి, భద్రు, లక్ష్మణ్ పాసి, కటకం రాజయ్య, రవి కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణకే బాల రక్షా భవన్

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కొత్తగూడెం



బాలల రక్షణకే బాల రక్షా భవన్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాష్ నగర్ 15వ వార్డులో మంగళవారం జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాల రక్ష భవన్‌ను కలెక్టర్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాల రక్షా భవన్‌లోని అన్ని గదులను పరిశీలించారు. బాలల రక్షణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయంకు అవసరమైన కంప్యూటర్లు, ఇతర సామగ్రి ఏర్పాటుకు నివేదికలు అందజేయాలని మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినాకు ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల రక్షాభవన్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయమండలి, ప్రత్యేక బాలల పోలీసు విభాగం, జాతీయ బాల కార్మిక నిర్మూలనా పథకం, జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్, చైల్డ్ లైన్ అన్నీ కలిపి ఒకే చోట అందుబాటులో ఉంటాయన్నారు. బాలల రక్షణకు సంబంధించిన అన్ని అంశాలు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని పేర్కొన్నారు. బాలల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ భారతీయ రాణి, డీసీడీవో హరికుమారి, సీడబ్ల్యుసీ సభ్యులు సుమిత్రాదేవి, షాదిక్ పాషా, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ సందీప్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



వేసవిలో తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్‌ను ప్రత్యేక డ్రైవ్‌పై మండల స్థాయి సమావేశాలను నిర్వహించి, రోజు వారీ షెడ్యూల్‌ను రూపొందించి మండల బృందాలను ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, మిషన్ భగీరథ ఏఈ, పంచాయతీ సెక్రటరీలు కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడైతే తాగునీటి సరఫరాలో సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించి తద్వారా వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. అన్ని మరమ్మతులు, సమస్యలను పరిష్కరించి రానున్న వేసవిలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ గ్రామాలలో తాగు నీటి సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 18005994007 ద్వారా తెలియపరచడం ద్వారా పరిష్కరింపబడతాయని కలెక్టర్ తెలిపారు.

సామాజిక న్యాయానికి ప్రతీక ప్రజాపాలన

- తోట దేవి ప్రసన్న

నవతెలంగాణ-కొత్తగూడెం



సామాజిక న్యాయానికి ప్రతీక ప్రజాపాలన అని రాష్ట్రంలో కుల గనణకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, క్యాబినెట్ మంత్రుత్వనికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు జిల్లా మహిళా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల, జనగనన చేపట్టాలన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నటువంటి బీఆర్ఎస్ బీసీలను పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు సవితి తల్లి ప్రేమను వలకబోస్తుందని విమర్శించారు. రిజర్వేషన్కు 33 శాతం ఉంటే దానిని 18 శాతం తగ్గించి కెసిఆర్ బీసీలపై వివక్ష చూపించి ఇప్పుడు కవితమ్మ బీసీల కోసం ఒక దంపుడు ఉపన్యాసం ఇవ్వడం విచిత్రంగా ఉందన్నారు. కానీ కుల జనగణ సర్వే చేయించి బీసీలకు 42శాతం తగ్గొద్దు అని చెప్పినటు వంటి ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెందుతుదన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు రాజేశ్వరి, రాణి, జ్యోతి, పద్మ, సౌజన్య కృష్ణ వేణి, శ్రీలక్ష్మీ సుశీల, స్వరూప, రూప, పార్వతి, శాంత కుమారి, జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

10 విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగొట్టాలి
- ఐటీడీఏ పీఓ బి.రాహుల్

నవతెలంగాణ-బూర్గంపాడు



గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై సంబంధిత హెచ్ఎం, వార్డెన్లు, సబ్జెక్ట్ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించి పిల్లలందరూ అత్యుత్తమ మార్పులతో పాసయ్యేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పు సాఖ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలు, తరగతి గదులు, అపరిశుభ్రంగా ఉండడం సైన్స్ ల్యాబ్ నిర్వహణ తీరు సరిగా లేకపోవడంతో హెచ్ఎం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పదవ తరగతి పిల్లలతో ప్రత్యేకంగా సమావేశమై పాఠశాలలో సౌకర్యాలు గురించి అలాగే కొత్తగా ప్రవేశపెట్టిన మెనూ అమలు చేస్తున్నది, లేనిది అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున పిల్లలందరూ మనసులో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని చదువుపై దృష్టి సారించి భయం లేకుండా పరీక్షలు రాయాలని ఆయన అన్నారు. అందుకు సంబంధిత ఉపాధ్యాయులు పదవ తరగతి పిల్లలలో సబ్జెక్టులలో వెనుకబడ్డ పిల్లలకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని, ప్రతి రోజు క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ తప్పనిసరిగా నిర్వహించి, పిల్లలలో ఉన్న పరీక్షల భయాన్ని పోగొట్టాలని ఆయన అన్నారు. అలాగే స్లిప్ టెస్ట్ నిర్వహణ సక్రమంగా జరగాలని, పిల్లలందరూ మెనూ ప్రకారం పౌష్టికరమైన ఆహారం అందేలా చూడాలని, పరిసరాలు ఎప్పుడు శుభ్రంగా ఉండాలని, డార్మెటరీ, డైనింగ్ హాల్, వంటగది, స్టోర్ రూమ్ ప్రతిరోజు శుభ్రం చేయాలని ఆయన పేర్కొన్నారు. వంట చేసే సిబ్బంది శుభ్రత పాటించాలని ఆయన అన్నారు. పిల్లలు ఎవరికి ఎటువంటి సెలవులు ఇవ్వకూడదని, పరీక్షలు అయ్యే వరకు ఎవరు పాఠశాల విడిచి పోకుండా చూసే బాధ్యత సంబంధిత హెచ్ఎం చూసుకోవాలని ఆయన అన్నారు. హెచ్ఎం, వార్డెన్, సిబ్బంది అందరూ స్థానికంగా ఉండాలని ఆయన అన్నారు. అనంతరం సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ క్లాసులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భీమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓవైపు పనిభారం...మరోవైపు పథకాల లొల్లి

- సతమతమవుతున్న పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-పినపాక



ప్రత్యేక పాలనలో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. అప్పులు చేసి గ్రామ పంచాయతీలలో పనులు నిర్వహిస్తే బిల్లులు రాక గోస పడుతుంటే ప్రభుత్వం అదనపు పనిభారాన్ని మోపుతూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యేలా చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలను ప్రగతి పథకంలోకి తీసుకువెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. ఆ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నాయి. ఆ పథకాల అమలు బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై మోపడంతో రోజు రోజుకు పని భారం వారిపై పెరుగుతుంది.

రోజువారీ గ్రామపంచాయతీ పనులను యాప్‌లో ఎప్పటికప్పుడు పరచాల్సిన బాధ్యత సైతం సెక్రెటరీలపైనే ఉంది. గ్రామపంచాయతీ పాలకుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక పాలన కొనసాగుతున్నది. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అంతా తామై గ్రామపంచాయతీలలో పాలనను ముందుకు నడిపిస్తున్నారు. గ్రామాల్లో ఉదయం చెత్తసేకరణకు ట్రాక్టర్ల నిర్వహణ, వీధిదీపాలు, పారిశుధ్యం వంటి పనులకు కార్యదర్శులు సొంతంగా డబ్బులు ఖర్చు చేసే పరిస్థితి సైతం నెలకొంది. కానీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులపాలై కొంతమంది సెక్రటరీలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. గ్రామాల్లోని అన్ని పనుల్లో గ్రామపంచాయతీ సెక్రటరీలు కీలక పాత్ర పోషిస్తున్నారు. నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల్లో తలమునకలవుతున్నారు. ప్రతిరోజూ ఉదయం సరైన సమయానికి జీపీఎస్ అప్లోడ్ చేయలేకపోతే ఉన్నత అధికారులు మెమోలు జారీ చేయడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్న సందర్భాలు సైతం ఉన్నాయి. గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, చెత్తసేకరణ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ, పల్లె ప్రయిటౌతి వనాలు, వర్మీ కంపోస్టు యార్డులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల అందజేత, పన్నుల వసూళ్లు, పింఛన్ల పంపిణీ పర్యవేక్షణ వంటి పనులు నిత్యకృత్యంగా వారికి ఉంటాయి. దీంతోపాటు అదనంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని ఉద్దేశంతో ప్రజలకు నిరంతరంగా దగ్గరగా ఉండే సెక్రటరీలకు ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన, కులగణన సర్వే, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, సర్వేకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చటం వంటివి ఆధనంగా అప్పజెప్పింది. ఈ బాధ్యతను సైతం వారు బాధ్యతాయుతంగా నిర్వహించారు. కానీ ఈ పథకాలలో కొంతమంది పేర్లు రాకపోవడంతో ప్రజలు గ్రామ సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితి సైతం నెలకొంది. కేవలం వారు అధికారులకు నివేదికను మాత్రమే తెలియజేసే వారన్న సంగతి లబ్దిదారులు గుర్తుంచుకోవాలి. అర్హత కలిగిన లబ్దిదారులు తమ పేరు రాకపోతే సెక్రటరీలను దరఖాస్తులు సమర్పించాలని చెబుతున్న లిస్టులో పేరు లబ్దిదారులు సెక్రటరీల కారణంగానే ఇతను పేరు రాలేదని ఆరోపించడం కొంతమంది సెక్రటరీలను మానసిక వేదనకు గురిచేస్తుంది. దీనిపై కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి సెక్రటరీ అదనపు భారం పడకుండా చూడాలని పలువురు వేడుకుంటున్నారు.

తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-దమ్మపేట



మండలంలోని గండుగులపల్లి గ్రామంలో తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో స్వగ్రామం గండుగులపల్లిలో తుమ్మల యుగంధర్ ఆయన ఇంటి వద్దకు పలువురు చేరుకొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా యుగంధర్ అభిమానుల మధ్య కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఆయనకు శుభకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర వసంతరావు, మన్యం అప్పారావు, సోయం ప్రసాద్, మాజీ ఎంపీపీ కెవి సత్యనారాయణ, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కాసాని ప్రసాద్, కాసాని మంగేశ్వరావు, తుమ్మల శేషబాబు, కొయ్యల అచ్యుతరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, కామేశ్వరరావు, యర్రంశెట్టి సత్యనారాయణ, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో గల హెడ్ లాక్స్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. దుమ్ముగూడెం గ్రామానికి చెందిన హైదరాబాదులో నివాసముంటున్న బైరెడ్డి గౌతమ్ సింహ ఆర్థిక సహాయంతో నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ కార్యక్రమాలను దుమ్మగూడెం దత్త శేష సాయి బాబా ఆలయ అధ్యక్షులు విటీపీ రమణారావు దగ్గరుండి చూసుకోగా, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచలం నర్సాపురం వ్యవస్థాపకులు శివ నాగ స్వామి ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తెల్లం సీతమ్మ, మాజీ జెడ్పీటీసీ అన్నే సత్యనారాయణమూర్తిలతో పాటు కాంగ్రెస్ నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నవతెలంగాణ-గుండాల

గుండాల గ్రామానికి చెందిన సుతారి జగ్గయ్య కాలనీ చెందిన అతని భార్య ఇటీవల కాలంలో మృతి చెందింది. గుండాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి 25 కేల బియ్యం, 5 కేజీల నూనె డబ్బా వారి కుటుంబానికి మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు మానాల నారాయణమూర్తి, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు, మానాల ప్రభాకర్ గౌరిశెట్టి ప్రభాకర్, మానాల శ్రవణ్, మానాల ఉపేందర్, గౌరిశెట్టి శరత్ తవిడి శెట్టి నాగరాజు, తౌడ్శెట్టి రాంబాబు, తాటిపల్లి సత్యం, అయిత శ్రీశైలం పూజిత్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు జనం కోసం మనం ఆర్థిక సాయం

నవతెలంగాణ-మణుగూరు



మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కారం సీతారాములు (40) ప్రమాదవశాత్తు కరెంటు పోలు పైనుంచి పడి తీవ్ర గాయాలయ్యి మంచానికి పరిమితమయ్యాడు. ఏ పని చేసుకోలేని పరిస్థితుల్లో వైద్య ఖర్చులకి ఇబ్బంది పడుతున్నారు. స్పందించిన మణుగూరు పట్టణానికి చెందిన జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ రూ.15 వేలు నగదు, 50 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు కొండా మురళీ, పునాటి పాపయ్య, వారా రామారావు పాల్గున్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ వ్యాధిపై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. సింగరేణి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు ఆదేశాలమేరకు రుద్రంపూర్ డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ ఎం.పరశురాములు సమక్షంలో డాక్టర్ డి.లలిత, హెల్త్ ఆఫీసర్, మెయిన్ హాస్పిటల్‌తో అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ షాలేం రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డాక్టర్ డి.లలిత, హెల్త్ ఆఫీసర్, మెయిన్ హాస్పిటల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జున రావు, ఐఎన్‌టియూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎస్ఓటు జిఎం జీవి కోటిరెడ్డి, ఎజిఎం (ఎఫ్ అండ్ ఏ) కే.హనా సుమలత, డిజిఎం (పర్సనల్) బి.శివ కేశవరావు, డిజిఎం (ఐఈడి) ఎస్.యోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



మణుగూరు : అనారోగ్య బారిన పడిన ప్రతి మానవుడు డాక్టర్ సలహాలతో వైద్య పరీక్షలు చేయించుకొని కోలుకోవడం సర్వసాధారణమని క్యాన్సర్ బారిన పడిన మనిషి అద్భుతం జరిగితే తప్ప జీవించడం చాలా కష్టమని అటువంటి భయంకరమైన మహమ్మారి దరిచేరకుండా రోజువారి దయనందన కార్యక్రమాలు సక్రమంగా పాటిస్తే ఎటువంటి రోగాలు దరిచేరవని గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి బండారుపల్లి మంగళవారం విద్యార్థులకు సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులు అందరితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటు చేసుకోకుండ అధ్యాపకులు సూచించే సలహాలు పాటించి బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఫ్యాకల్టీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రెండవ రోజుకు చేరుకున్న ముత్యాలమ్మ జాతర

- అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పొదెం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం గ్రామంలో తరతరాలుగా వెలసిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండవ రోజు సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయింది. అమ్మ దర్శనం కోసం భక్తులు క్యూ లైన్‌లోఎక్కువసేపు నిరీక్షించాల్సిన సమయం పట్టింది. ముత్యాలమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పవిత్ర దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీతో పాటు, అధికార యంత్రాంగం విశేష ఏర్పాట్లు చేసింది. తెలంగాణ, ఆంధ్ర, ఒరిస్సా, చత్తీస్గఢ్‌ల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముత్యాలమ్మ అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య అశ్వరావుపేట మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ చుక్క గణేష్ రెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు వారిని ఆలయ ముఖ ద్వారం నుంచే ఘన స్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వినీల్, భద్రాచలం పట్టణ అధ్యక్షులు, పరిమి శ్రీనివాసరావు, టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్ కనుబుద్ధి దేవా, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | ఫిబ్రవరి 5, 2025 | www.navatelangana.com

ఇన్ఫోసిస్‌కు ఐదుగురు ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ- ఖమ్మం

ప్రముఖ సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ లిమిటెడ్ తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గత వారం హైదరాబాద్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యాంపస్ పూల్ డ్రైవ్లో తమ విద్యార్థినులు అద్భుత ప్రతిభను కనబరచారని, జిల్లాలోని అత్యధికంగా ఐదుగురు ఎంపికవ్వడం తమకు గర్వకారణమని తెలిపారు. అటానమస్ హోదాను సాధించిన అనంతరం తమ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందించడం ద్వారా ఈ ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, డాక్టర్ జె.రవీంద్రబాబు, డాక్టర్ యస్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. యస్.సవిత, కోఆర్డినేటర్ జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నగదు బీమా అందజేత

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఇటీవల కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబ సభ్యులకు సొసైటీ అధ్యక్షులు శీలం అక్కిరెడ్డి, డిసిసిబి బ్యాంక్ మేనేజర్ దివ్య బీమా నగదును మంగళవారం లబ్దిదారులకు అందజేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన షేక్ బాబు, నండ్రు శ్యాంసుందర్, శీలం శ్రీనివాసరెడ్డి మృతి అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు సంఘ సభ్యులుగా కొనసాగుతుండటంతో మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 50 వేల రూపాయల చొప్పున లక్షా 50 వేల రూపాయలు బీమా నగదును మండల కేంద్రంలో గల ఎర్రుపాలెం డిసిసిబి బ్యాంక్ నందు లబ్దిదారులకు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, సంఘ సీఈవో వీరారెడ్డి, వేమిరెడ్డి వెంకటరెడ్డి, బ్యాంక్ సిబ్బంది లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారానికి ముందుకొచ్చిన దాతలు

నవతెలంగాణ-వేంసూరు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యార్థులకు అల్పాహారం మినరల్ వాటర్ సౌకర్యం కల్పించిన దాతలను పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. పాఠశాలలో 39 మంది పదవ తరగతి విద్యార్థులు ఉండగా అల్పాహారానికి రూ.12,100 పూర్వ విద్యార్థులు 1994 బ్యాచ్ పిల్లి సర్వేశ్వరరావు 10 వేలు, ఆరోగ్య మాత హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాయికుమార్ 10 వేలు, కంకటి రాములు 5 వేలు, పోలిశెట్టి శ్రీనివాస్ 3 వేలు, వంట్ల రమేష్, భీమవరం 2 వేలు వితరణగా ఇచ్చారు. విద్యార్థులకు పాఠశాలలో తాగునీరు లేకపోవడంతో 1994 బ్యాచ్ పూర్వ విద్యార్థి ఫక్రుద్దీన్ మినరల్ వాటర్ కొరకు 10,000 పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకరరెడ్డికి అందజేశారు.

బీబీసీకి వారబంధి లేకుండా నీటిని విడుదల చేయాలి

నవతెలంగాణ - బోనకల్

బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు వారబంధి లేకుండా నీటిని నిరంతరం సరఫరా చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఐదు మైనర్ కాలువలను సిపిఐ బృందం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ వారబంధితో బిబిసి కాలువ నుండి ఆళ్లపాడు, నారాయణపురం, కలకోట, డబ్బాకుపల్లి, పోలంపల్లి మైనర్ కాలువల చివరి భూములలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, నాయకులు గుంపుల జయరాజు, కాంగ్రెస్ నాయకులు పారా వెంకట మోహన్ రావు, షేక్ దస్తగిరి, టిడిపి నాయకులు గొల్లపల్లి కృష్ణారావు, రైతులు కాలసాని నాగేశ్వరరావు, పారా శ్రీనివాసరావు, పారా నారాయణరావు, మరీదు రామారావు, అల్లిక శ్రీనివాసరావు, మరీదు ఉపేంద్ర, గాలి రాము పాల్గొన్నారు.

తుమ్మల యుగంధర్ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ పుట్టినరోజు సందర్భంగా ఖమ్మం నగర బీసీ సెల్ ఛైర్మన్ బాణాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో 3 టౌన్ ప్రాంతంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండ్రి మార్గంలోనే పయనిస్తూ యుగంధర్ అందరి మన్ననలను పొందుతున్నారని అన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ సాంకేతిక నిపుణుడుగా కూరపాటి రాజశేఖర్

నవతెలంగాణ- ఎర్రుపాలెం



సిఆర్పిఎఫ్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కూరపాటి రాజశేఖర్ 38వ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా భారతదేశ స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్ ఎంపిక కావటం శుభ పరిణామమని పలువురు అభినందించారు. డెహ్రాడూన్లో ఈనెల ఎనిమిదో తారీకు నుంచి 12వ తారీకు వరకు జరిగే 38వ జాతీయ స్థాయి పోటీలకు సాంకేతిక నిపుణులుగా రాష్ట్రం నుంచి నలుగురు ఎంపికైన వారిలో ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన కూరపాటి రాజశేఖర్ ఉండటం చాలా సంతోషకరమైన విషయమని, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు యన్నం పిచ్చిరెడ్డి, పెద్ద గోపవరం సొసైటీ అధ్యక్షులు శీలం అక్కిరెడ్డి, మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, సీనియర్ వ్యాయామ నీలం రవికుమార్, కోనా రమేష్, నండ్రు విజయభాస్కర్, గూడూరు సత్యనారాయణరెడ్డి, నరాల సాంబశివారెడ్డి, తలపురెడ్డి గోపిరెడ్డి, రాజవరపు శ్రీనివాసరావు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు వేమిరెడ్డి వెంకటరెడ్డి, ఏఎస్ఐ బాణాల. నరసింహారావు, తలపురెడ్డి వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో రథ సప్తమి వేడుకలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం నందు రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాఘ శుద్ధ సప్తమి సూర్య జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ప్రాతః కాల అర్చనల అనంతరం లోక బాంధవుడు, ప్రత్యక్ష నారాయణుడు అయిన సూర్య భగవానునికి ప్రీతిగా పంచ సూక్తములు మహా సౌర పఠనతో భక్తులు అందరి సమక్షంలో పొంగలి తయారు చేసి స్వామివారికి నివేదించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ మాట్లాడుతూ సూర్యభాగవానుడు ఒక్కడే మనకు నిత్యం కనబడే దేవుడని, ఆరోగ్య ప్రదాత అని, ప్రతిరోజూ సూర్య దేవుని ప్రార్థించిన వారికి ఆత్మ పీడలు ఆరోగ్య బాధలు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణఅధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు దంపతులు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షించగా అర్చకులు ఉప్పల రాజీవ్ శర్మ దంపతులు దేవస్థానం పక్షాన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

యార్లగడ్డ వరమ్మ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ - బోనకల్

బోనకల్ గ్రామ సమీపంలో డిసెంబర్ 31న కూలీల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన బోనకల్ గ్రామానికి చెందిన ఆంధ్రప్రభ విలేఖరి యార్లగడ్డ శ్రీనివాసరావు మాతృమూర్తి యార్లగడ్డ వరమ్మ మృతి చెందింది. దీంతో వరమ్మ కుటుంబాన్ని మంగళవారం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు బోనకల్‌లో పరామర్శించారు. శ్రీనివాసరావుని ప్రమాద సంఘటనను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాసరావుకి ధైర్యం చెప్పి సంతాప సానుభూతి తెలిపారు.

క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-తల్లాడ

ప్రజలు క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని పీహెచ్సీ వైద్యులు డాక్టర్ రత్న మనోహర్ తెలిపారు. తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం క్యాన్సర్‌పై ఆశ కార్యకర్తలకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలి మార్పుల్లో అతి ముఖ్యమైన ఆహారం, చక్కెర, కొవ్వు పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వలన, వేపుడు, కూల్ డ్రింక్స్ మొదలైన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల బరువు పెరిగి, ఉబకాయం రావడం క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు, అమ్మాయిలు చిన్న వయసులో రజస్వలు కావడం వల్ల రొమ్ము క్యాన్సర్లు, గర్భకోశ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. పొగాకు ఉత్పత్తులు, మద్యం తాగడం మొదలైన దురలవాట్లతో కాలేయ, నోటి, జీర్ణ కోశ క్యాన్సర్లు, ప్రభలే ప్రమాదం ఉందన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండి క్యాన్సర్‌ను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ భాస్కర్, సూపర్వైజర్లు పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, ఝాన్సీ, రాజశ్రీ, పల్లె దవాఖాన వైద్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సత్తుపల్లి



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ యుగంధర్ జన్మదిన వేడుకలు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల కార్యక్రమంలో తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యుగంధర్ చేతుల మీదుగా దయానంద్ కేక్ కట్ చేయించారు. అనంతరం యుగంధర్‌ను దయానంద్ సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, శివ వేణుబాబు, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, చలసాని సాంబశివరావు, ఉడతనేని అప్పారావు, వెల్ది జగన్మోహనరావు, మానుకోట ప్రసాద్, పింగుల సామేలు, గఫార్, బత్తుల భరత్‌కుమార్, గొర్లమారి రామ్మోహనరెడ్డి, సందీప్‌గౌడ్, విజయసారథిరెడ్డి, కోలగట్ల చెన్నారావు, కావేటి అప్పారావు, కోటమర్తి జవహర్‌లాల్, తోట సుజలరాణి, కంటె నాగలక్ష్మి, రజియా, కనపర్తి కుమారి, నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ సర్రాబు ప్రకాశరావుకి నివాళి

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరంలోని రోటరీనగర్‌లో నివాసముంటున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పురుషోత్తమరావు తండ్రి సర్రాబు ప్రకాశరావు ఇటీవల ఖమ్మంలో మరణించారు. వారి సంస్మరణ సభ మంగళవారం రోటరీనగర్‌లోని వారి స్వగృహంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకాశరావు తల్లాడ మండలం ముచ్చవరం గ్రామంలో జన్మించి టీచర్‌గా పనిచేస్తూ పార్టీ సభ్యుడిగా, సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారని గుర్తు చేశారు. తల్లాడ పార్టీ ఆఫీసు నిర్వహణకు ఆయన సొంతంగా నెల నెలా విరాళంగా ఇచ్చి పార్టీకి సహాయం అందించారని, పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవాడని కొనియాడారు. సొసైటీ డైరెక్టర్‌గా యజ్ఞ నారాయణపురం నుండి ఎన్నికై పని చేశారని తెలిపారు. రిటైర్ అయిన తర్వాత కూడా పెన్షనర్స్ సంఘంలో పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, మాదినేని రమేష్, జిల్లాకమిటీ సభ్యులు ఝాన్సీ, నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, నాయకులు తాతా భాస్కర్‌రావు, దేవేంద్ర, ముళ్ళపాటి రామారావు పాల్గొన్నారు.

సహకార సంఘం రైతులకు రుణమాఫీ కాలేదని అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ఎర్రుపాలెం మండల పరిధిలోని అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు 191 మంది రైతులకు వడ్డీ మాత్రమే రుణమాఫీ జరిగిందని, అసలు రుణమాఫీ కాకపోవడంతో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, కార్యదర్శి బొంతు రాంబాబు ఆధ్వర్యంలో రైతులతో కలిసి అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం ఖమ్మంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డీ మాత్రమే రుణమాఫీ జరిగి అసలు రుణమాఫీ కాకపోవడానికి కారణమేంటని ఎన్నిసార్లు వ్యవసాయ శాఖ అధికారులను కలిసి రైతులు తమ గోడును వెల్లబోసుకున్న పట్టించుకున్న నాథుడు లేడని రైతులు మొత్తుకుంటున్నారని తెలిపారు. టెక్నికల్‌గా అధికారులు చేసిన తప్పిదాన్ని సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. అయ్యవారగూడెం సొసైటిలో 191 మంది రైతులకు లక్ష రూపాయలు లోపు పంట రుణం వడ్డీతో కలిపి 99 కోట్ల 50 లక్షల 739 రూపాయలు రుణమాఫీ చేయాల్సి ఉండగా వడ్డీ 5 లక్షల 3 వేల 790 రూపాయలు మాత్రమే మాఫీ చేశారు. సొసైటీలో ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎస్‌కె మీరా, దివ్వెల వీరయ్య మద్దాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 10న చలో హైదరాబాద్

- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం
- తెలంగాణకు అన్ని రంగాలకు నిధులు కేటాయించాలి
- గిరిజన, వ్యకాస నాయకులు భూక్యా వీరభద్రం,

మెరుగు సత్యనారాయణ

నవతెలంగాణ-వైరాటౌన్



కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని, తెలంగాణకు మొండి చేయి చూపించిన కేంద్ర బడ్జెట్‌ను సవరించి తెలంగాణకు తగిన స్థాయిలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 10వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా వేలాది మందితో జరుగుతుందని, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ కోరారు. మంగళవారం వైరా బోడెపుడి భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం వైరా మండలం కార్యదర్శి తూము సుధాకర్ అధ్యక్షతన జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు బడ్జెట్లో నిధులు కోత విధించి పేదలకు పనులు దొరకకుండా చేసిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పరిశ్రమలకు ఎలాంటి నిధులు కేటాయించలేదని విమర్శించారు. విద్యా వైద్యం ఉపాధిని పూర్తిగా విస్మరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా మెజార్టీ ప్రజలకు వ్యతిరేకంగా ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరుగు మహాధర్నాలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం వైరా పట్టణ కార్యదర్శి గుమ్మ నరసింహారావు, షేక్ రెహానా బి, షేక్ మజీద్, యనమద్ది రామకృష్ణ, ఓర్సు సీతారాములు, శివాజీ పాల్గొన్నారు.

ప్రజాసేవని మించింది లేదు





- ఆకలికి అన్నం.. ఆపదకి చిన్న సాయం..
- బాధకి ఓదార్పు ఎంతో అవసరం
- పౌర సన్మాన కార్యక్రమంలో వక్తలు

నవతెలంగాణ- చెర్ల

ప్రతి మనిషి తన నిజ జీవితంలో ప్రజాసేవ చేయడంలో శ్రద్ధ వహించాలని ప్రజాసేవను మించిన కర్తవ్యం మరొకటి లేదని వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో డాక్టర్ లైన్ నీలి ప్రకాష్ డాక్టర్ గూడూరి సుదర్శన్ రావులకు నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమంలో పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చర్ల ప్రాంతంలో డాక్టర్ నీలి ప్రకాష్ ఆర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ సుదర్శన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని అన్నారు. వారాంతపు సంతకు వచ్చే నిరుపేద ఆదివాసీలకు భోజనం పెట్టి ఆకలి తీర్చడం, విద్య వైద్య ఖర్చుల నిమిత్తం ఎంతోమందిని ఆదుకోవడం చాలా గర్వించ తగ్గ విషయమని ఆయన అన్నారు. భద్రాచలం పట్టణంలో మొట్టమొదటిగా ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభించి ఎంతోమంది నిరుపేదలకు వైద్య సేవలు అందించడం, బడుగు బలహీన వర్గాల అభ్యుదయాని కి తనదైన శైల్లో ఆపన్న హస్తం అందించడంలో తన ప్రత్యేకతను సాటుకున్న ఆర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ జీవివి సుదర్శన్ రావు వక్తలు తమ తమ అభినందనలు తెలిపారు. ఆకలితో ఉన్నవారికి కాస్త అన్నం.. ఆపదలో ఉన్న వారికి చిన్న సాయం... బాధలో ఉన్న వారికి కొంచెం ఓదార్పు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్క మనిషి ఎదగాలని వక్తలు సూచించారు . ఇంతటి మానవత్వాన్ని ప్రదర్శించే వారిని చర్ల పౌర సమితి సన్మానించడం హర్షనీయమని వక్తలు తెలిపారు. సన్మాన గ్రహీతల కు వెనువెంట ఉండి అన్ని విధాలా తోడ్పాటును అందిస్తున్న కుటుంబ సభ్యులను మేమున్నాం కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా గురుదేవ్ విద్యార్థులచే ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సన్మాన కార్యక్రమంలో ఎస్ కే షాజహాన్, శేశెట్టి సాంబయ్య, పరుచూరి రవి, డాక్టర్ జయ భారతి, నీలి దుర్గ, ఎర్రంకి బాబ్జి, నీలి నందు ,తడికల లాలయ్య, రవీంద్ర క్లాత్ స్టోర్స్ రవీంద్ర, దొడ్డి తాతారావు, సిహెచ్ నాగబాబు, ధనికొండ శ్రీనివాసరావు,పెద్ద ఎత్తున చర్ల పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

నవతెలంగాణ పాల్వంచ

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో డిపార్ట్మెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే ప్రోగ్రాంను నిర్వహించారు. ప్రొఫెసర్ పి.పద్మ మాట్లాడుతూ క్యాన్సర్‌పైన అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తర్వాత వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె మాధవి, సైన్స్ ఇన్‌చార్జ్ డి.రమేష్ విద్యార్థులకు క్యాన్సర్ నివారణ సూచనలను ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విమల, దీపిక, హారిక రాజ్ కుమార్, పర్వీన్ బేగం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుపై ఎఫ్‌పీఓలకు శిక్షణ

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఐఐఓపీఆర్ (భారత జాతీయ ఆయిల్ ఫాం పరిశోధనా విభాగం) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా పెదవేగిలో తెలంగాణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నెలకొని ఉన్న ఎఫ్‌పిఓ (ఫాం ఆయిల్ ఫెడ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్) బృందాలకు మంగళవారం ఆయిల్ ఫాం సాగు, అంతర్ పంటలు, ఆశించే చీడపీడలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.వీ ప్రసాద్, సహ సైంటిస్ట్ డాక్టర్ రామచంద్రుడు రైతులకు అవగాహన కల్పించారు. అశ్వారావుపేట, అంకం పాలెం, వెంకటాద్రి ఎఫ్‌పిఓ సభ్యులు తుంబూరు మహేశ్వర రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, తుమ్మ రాంబాబు, సంతపురి చెన్నారావు, ఆళ్ళ నాగబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించుకుందాం

నవతెలంగాణ- టేకులపల్లి

వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించుకుందామని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్య కిషోర్ సింగ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం టేకులపల్లిలో జరిగిన టిపిటిఎఫ్, టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ఐక్య సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గత ఆరు సంవత్సరాల కాలంలో అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయుల పక్షాన, నిలబడి నిరంతరం విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో తమ గొంతును వినిపించారని, నిజాయితీగా, నిబద్ధతగా ఉపాధ్యాయుల పక్షాన నిలబడ్డారని తెలిపారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు వి. వరలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి డి.హరి, మండల కార్యదర్శి బి.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీటీసీ స్థానంగా "నడిమి గూడెం" : ఎంపీడీవో డి.శ్రీనివాస్

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

మండలంలో గతంలో అనంతోగు, ఆళ్ళపల్లి, పాతూరు, మర్కోడు (నాలుగు) ఎంపీటీసీ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. కానీ, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మండలంలో ఓటర్ల ప్రాతిపదికన అదనంగా ఎంపీటీసీ స్థానంగా నడిమిగూడెంను పెంచడం జరిగిందని స్థానిక ఎంపీడీవో డి.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చేయడం జరిగిందన్నారు. అదనంగా ఎంపీటీసీ స్థానం పెరగడంతో 5 ఎంపీటీసీ స్థానాల్లో కింది విధంగా గ్రామ పంచాయతీల వివరాలు ఇలా ఉన్నాయి.. మర్కోడు ఎంపీటీసీ ఎన్నికలో మర్కోడు, అడవి రామవరం గ్రామ పంచాయతీలు ఉంటాయన్నారు. నడిమిగూడెం ఎంపీటీసీ ఎన్నికలో నడిమిగూడెం, బోడాయికుంట, పాతూరు గ్రామ పంచాయతీలు ఉంటాయని చెప్పారు. రాఘవాపురం ఎంపీటీసీ ఎన్నికలో రాఘవాపురం, రామాంజిగూడెం, పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయతీలు ఉంటాయని తెలిపారు. ఆళ్ళపల్లి ఎంపీటీసీ ఎన్నికలో ఆళ్ళపల్లి, దొంగతోగు గ్రామ పంచాయతీలు ఉంటాయని అన్నారు. అనంతోగు ఎంపీటీసీ ఎన్నికలో అనంతోగు, రాయిపాడు గ్రామ పంచాయతీలు గలవని పేర్కొన్నారు.

టైనిటాట్స్ హైస్కూల్‌లో 'చిన్నారి'

నవతెలంగాణ- ఖమ్మం



మహిళ శిశు సంక్షేమ శాఖ, వైద్య శాఖ కలిసి నిర్వహించే "చిన్నారి " అనే కార్యక్రమం మంగళవారం టైనిటాట్స్ హైస్కూల్‌లో నిర్వహించారు. దానిలో భాగంగా విద్యార్థులకు వేరు వేరుగా అవగాహన కల్పించారు. పిల్లలకు సంబంధించినటువంటి అంశాలు బాల్యవివాహలు, మంచి స్పర్శ- చెడు స్పర్శ , మాదకద్రవ్యాలు, ఇంటర్నెట్ దుర్వినియోగం, పిల్లల అక్రమ రవాణా, పిల్లల శరీరంలో వచ్చేటువంటి మార్పులు, లైంగిక వేధింపులు, ఇతర అంశముల గురించి వివరించారు. ఇతరులకు చెప్పుకోలేని సమస్యలు 1098కు కాల్ చేసి వివరించినట్లయితే పరిష్కారాన్ని వెంటనే తెలియచేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి దుర్గా భవాని, శిశు సంక్షేమ శాఖ జండర్ స్పెషలిస్ట్ ప్రమీల, పాఠశాల కరస్పాండెంట్ శెట్టి భాస్కర్, ఉపాధ్యాయులు సబిత, సంధ్య నాజీయ, ఝాన్సి, నీసర, జ్యోతి, జ్యోతిశ్రీ, అలేఖ్య, నాగమణి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరా

ఖమ్మం జిల్లా వైరా మండలంలో విప్పలమడక, సిరిపురం గ్రామాలలో మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు.చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రులు ప్రకటించినా అధికారులు కొనుగోలు చేయడం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. వైరా మండలం విప్పల మడక గ్రామంలో ధాన్యం రాశుల వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రాసులను జనవరి 31 వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి చివరి తేదీ గడువు కంటే నాలుగు రోజుల ముందుగానే కొనుగోలు నిలుపుదల చేశారని అన్నారు. వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో వరి నాట్లు అలస్యం కావడం వల్ల వరి కోతలు జనవరి రెండవ వారం లోకూడా జరిగాయని అన్నారు. మిగిలిన ధాన్యం కొనుగోలు సమస్యపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి రైతులు తీసుకువచ్చారని,వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అధికారులను రెవెన్యూ మంత్రి ఆదేశించినా ధాన్యం కొనుగోలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వారం రోజులు ధాన్యం కొనుగోలు గడువు ఇచ్చినట్లయితే కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు పూర్తి అయి ఉండేదన్నారు. మంగళ, బుధ వారాల్లో రైతుల ధాన్యం కొనుగోలు చేసి కాటాలు వేయక పోతే ప్రత్యక్ష ఆందోళనలు చేయాల్సి ఉంటుందని రాంబాబు స్పష్టం చేశారు . ధాన్యం రైతులు మాట్లాడుతూ 20 రోజుల క్రితం కోసి ఆరబెట్టిన ధాన్యం ఎక్కువగా ఎండి పోతుందని,గ్రామం లో కోతుల,కుక్కల మందలు ధాన్యం రాశులను పాడుచేస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో విప్పలమడక మాజీ సర్పంచ్ లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్ పాపయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు మేడా శరబంధి, ఎస్ కె జానిమీయా, నీటి సంఘం మాజీ అధ్యక్షులు కొల్లా వెంకటేశ్వరరావు, రుద్రాక్షల వెంకటయ్య, దేవభక్తిని అర్జున్ రావు, కిలా రు భద్రయ్య, మురళి, సాంబశివరావు, రామారావు, పుల్లారావు, మహిళా రైతులు పాల్గొన్నారు..

జూనియర్ కళాశాల విద్యార్థులకు అన్నదానం

నవతెలంగాణ- కల్లూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుమారుడు యుగంధర్ పుట్టినరోజు సందర్భంగా కళాశాల విద్యార్థులు మధ్య కేక్ కట్ చేసి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, కాలేజీ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ పసుమర్తి చంద్రరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహారావు, ఖమ్మంపాటి శ్రీనివాసరావు- వెంకటేశ్వర్లు, పెద్దబోయిన శ్రీను, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్ చౌదరి, ధారా రంగ, మట్ట రామకృష్ణ, నోటి కృష్ణారెడ్డి, బాల, యాస శ్రీకాంత్, మిమిక్రీ కిషోర్, కనకపుడి జయరాజు, కుంచాల గురవయ్య, యూసూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో తప్పులను సరిచూసుకోవాలి

నవతెలంగాణ- ఎర్రుపాలెం

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ లిస్టులో తప్పులను సరి చూసుకోవాలని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులను ఎంపీఓ గంధం శ్రీలక్ష్మి కోరారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఓటర్ లిస్టును డిస్ ప్లే చేశామని, వాటికి సంబంధించిన అభ్యంతరాలను తప్పులను సరి చేసుకొని మార్పు చేర్పులను సంబంధిత బిఎల్ఓకు తెలపాలని ఆమె కోరారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, తిరుపతిరావు, మాజీ జెడ్పిటిసి సీలం కవిత, కృష్ణారెడ్డి, తెలుగుదేశం నాయకులు మోహన్‌రావు, బిజెపి నాయకులు కోటేశ్వరరావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు నమ్మొద్దు

- త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయ్
- గ్రూపులొద్దు-ఏకాభిప్రాయంతో అభ్యర్థులను దించండి
- కాంగ్రెస్ నాయకులతో సమావేశం జరిపిన డాక్టర్ దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు నమ్మొద్దని, వాళ్లపని అయిపోయిందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ కల్లూరు, తల్లాడ మండలాలకు చెందిన ఆ పార్టీ ముఖ్య నాయకులతో అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ దయానంద్ ఆయా మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో మంగళవారం జరిగిన సమావేశంలో దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. త్వరలోనే స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మనపార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. స్థానిక ఎన్నికల్లో గ్రూపులకు తావులేకుండా అందరి ఏకాభిప్రాయంతో అభ్యర్థులను పోటీకి దించాలని దయానంద్ కోరారు. మీ గ్రామ అభివృద్ధి మీ చేతుల్లోనే ఉందని ఈ సందర్భంగా నాయకులకు పలు సూచనలు, సలహాలను దయానంద్ అందించారు. అంతకు ముందురోజు (సోమవారం రాత్రి) వేంసూరు, పెనుబల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో డాక్టర్ సమావేశం జరిపి పైన తెలిపిన విషయాలనే ప్రస్తావించారు.

అసెంబ్లీ ఉన్నరోజే క్యాబినెట్ సమావేశమా?

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అసెంబ్లీలో బీసీ గణనపై చర్చ అని చెప్పి.. తీరా అసెంబ్లీకి వస్తే రెండు నిమిషాల్లో సభ వాయిదా వేయడంపై బీజేపీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం శాసనసభ వాయిదా పడిన అనంతరం అసెంబ్లీ మీడియా వద్ద బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇతర ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, రాకేష్ రెడ్డి, రామారావు పవార్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవర్తన చూస్తుంటే చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించడం లేదని విమర్శించారు. క్యాబినెట్ సమావేశం అసెంబ్లీ ఉన్నరోజే ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ప్రాధాన్యత గల అంశాలపై సుదీర్ఘ చర్చ జరగాలన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులం అసెంబ్లీలో సమస్యలు చర్చించేందుకు వచ్చామని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి ఉదయం నాలుగు గంటలకు లేచి బయలుదేరి వస్తే అసెంబ్లీ వాయిదా వేశారని వాపోయారు. ప్రభుత్వం తీరు సమస్యలను పరిష్కారం చేసే విధంగా కనిపించడం లేదన్నారు. ఇది మంచి సంప్రదాయం కాదన్నారు.

బీసీగణన ఓ తప్పుల తడక : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనూ ఇలా జరగలేదని, సభ బిజినెస్ గురించి ఒక్కమాట కూడా చెప్పకుండా శాసనసభను వాయిదా వేశారని మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, తలసానీ శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మంత్రివర్గ భేటీ దృష్ట్యా సమావేశాలను వాయిదా వేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. దీంతో మధ్యాహ్నాం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ.. బీసీ గణన తప్పుల తడకలా ఉందని, రాష్ట్రం, శాసనసభ పరవు పోయిందని అన్నారు. క్యాబినెట్ మీటింగ్ పూర్తి కాలేదని శాసనసభను ఎలా వాయిదా వేస్తారని ప్రశ్నించారు. అసెంబ్లీని ఒక్క నిమిషంలోనే వాయిదా వేయడం చరిత్రలో లేదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభా ప్రొసీజర్స్‌ను తుంగలో తొక్కి అవమానించే విధంగా వ్యవహరిస్తోందన్నారు. కీలకమైన అంశాలు అసెంబ్లీలో చర్చకు పెట్టినప్పుడు ముందుగానే మంత్రివర్గ సమావేశం పెడ్తారని, అలా కాకుండా అసెంబ్లీ సమావేశం ఉందనగా గంట ముందు మంత్రివర్గ సమావేశం ఎలా పెడ్తారని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ వర్గీకరణ రెండూ ఒకేరోజు ఎలా పెడ్తారన్నారు. బీసీ, ఎస్సీ వర్గీకరణపై చర్చకు ఆహ్వానించి సమావేశాన్ని వాయిదా వేయడం ఏంటన్నారు. బీసీలకు, శాసనసభ్యులకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 50 సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. బీసీలు రాజ్యాధికారం సాధిస్తారనే భయంతో వారి జనాభాను తక్కువ సంఖ్యలో చూపిస్తున్నారని మాజీ మంత్రి తలసాని అన్నారు. సభను ఒక్కరోజు నిర్వహించడం అన్యాయమని, నాలుగు రోజులైనా పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం మరో ఉద్యమం తప్పదన్నారు.

బీసీలపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోలేదు.. ఇప్పుడు బీసీలపై ఆ పార్టీ మొసలి కన్నీరు కారుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం ఉదయం శాసనసభ వాయిదా అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. గతంలో ఒక్కరోజు సర్వే చేసి నివేదిక బయట పెట్టని ఆ పార్టీ ఇప్పుడు బీసీ కులగణనపై మాట్లాడుతున్నదన్నారు. స్పీకర్ అనుమతితో సభ వాయిదా పడిందన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న బీసీల రిజర్వేషన్లు 29 శాతానికి తగ్గించిన ఘనత బీఆర్ఎస్ వారిదేనని విమర్శించారు. అప్పుడు బీసీలపై మీకు ఉన్న చిత్తశుద్ధి ఏమైందని ప్రశ్నించారు. మీలా నలుగురు నాలుగు గోడల మధ్య మాట్లాడి సభను ముగించే పద్ధతి తమది కాదన్నారు. మీరు అటకెక్కించిన కులగణనలో 51శాతం బీసీలుంటే.. తమ కులగణన సర్వేలో 56శాతం బీసీలు ఉన్నారని చెప్పారు.

గంగుల కమలాకర్‌కు మాట్లాడే హక్కు లేదు : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

గంగుల కమలాకర్‌కు బీసీ కులగణనపై మాట్లాడే హక్కు లేదని, 50 రోజుల్లో కులగణన దేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు ఫాంహౌజ్‌లో దాచిపెట్టారని, రాజకీయంగా, విద్య, ఉపాధిపరంగా బీసీలను అణగదొక్కారని అన్నారు. చర్చల్లో పాల్గొనే దమ్ము ధైర్యం లేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. తెలంగాణ దేశానికి రోల్ మోడల్ అని అన్నారు. బీసీలకు పదేండ్లు అన్యాయం చేసి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పారు. లెక్కలతో అన్ని ఆధారాలూ తమ దగ్గర ఉన్నాయన్నారు.

50 రోజుల్లో కులగణన పూర్తి చేశాం : విప్, ఎమ్మెల్యే రామచంద్రు నాయక్


కులగణన సర్వేను 50 రోజుల్లో పూర్తిచేసి.. దేశ చరిత్రలో తెలంగాణ ఒక రోల్ మోడల్‌గా నిలిచిందని ప్రభుత్వ విప్ రామచంద్రుడు నాయక్ తెలిపారు. సభాపతి అందరికీ మాట్లాడే అవకాశం ఇస్తామన్నా.. రాజకీయ అవివేకంతో బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీసీ, బడుగు బలహీన వర్గాలకు అనుకూలంగా ఆ పార్టీ నేతలు మాట్లాడటం లేదన్నారు. ప్రజలే వారికి బుద్ధి చెప్పాలన్నారు.

మీలాగా స్క్రిప్ట్ చదవడం లేదు : ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి

ఇంటి దగ్గర తయారు చేసిన స్క్రిప్ట్‌ను మీలాగా తాము చదవడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి విమర్శించారు. ఫాంహౌజ్‌లో నలుగురు కూర్చొని బిల్లులు అసెంబ్లీలో పెట్టే సంప్రదాయం తమది కాదని, ప్రతిదీ ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతుందని చెప్పారు. ఇది హరీశ్‌రావు గుర్తించాలన్నారు. తమలా తలుపులు మూసి, అందరినీ బయటకు పంపి బిల్లులు పాస్ చేయించుకోవడం లేదన్నారు. ఎవరు పారదర్శకంగా పాలిస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు.

సోలార్ ప్లాంట్ సమీపంలో అగ్నిప్రమాదం

- అప్రమత్తమైన అధికారులు
- ఖమ్మం జిల్లా ఉసిరికాయలపల్లిలో ఘటన



నవతెలంగాణ-కారేపల్లి

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి సోలార్ ప్లాంట్ సమీపంలోని గుట్టపై మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. సోలార్ ప్లాంట్ ప్రహరీ గోడ సమీపంలోని ఓసీ మట్టి దిబ్బలపై సింగరేణి కాలరీ సంస్థ మొక్కలు నాటింది. ఆ దిబ్బలపై ఉన్న తుప్పలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించడంతో మంటలు ఎగిసి పడి మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. గుట్ట పక్కన సోలార్ ప్లాంట్ ఉండటంతో అధికారులు అప్రమత్తమై ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పే పనులు చేపట్టారు.

బడ్జెట్ నిర్ణయాలు కార్పొరేట్లకు ఊతం

ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర

- రాష్ట్రం విషయంలోనూ నిర్లక్ష్య ధోరణి
- 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి ఏం ప్రయోజనం : రంగారెడ్డి జిల్లా ప్రజాసంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సామాజిక తరగతుల నిధులు పెట్టుబడిదారులకు ధారాదత్తం



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్.. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు ఊతం ఇస్తూ.. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేకంగా ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. సామాజిక తరగతులకు దామాషా ప్రకారం కేటాయించాల్సిన నిధులను ఒకట్రెండు శాతానికి పరిమితం చేసి.. వారి వాటాను పెట్టుబడిదారుల సంక్షేమానికి కేటాయిస్తోందన్నారు. దేశ ఉత్పత్తి రంగంలో కీలకమైన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల చేతిలో బందీ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని జాన్‌వెస్లీ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డి ఏఎమ్ఆర్ కన్వెన్షన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అప్పులు చేసి కార్పొరేట్ బడా వ్యాపారులకు ధారాదత్తం చేస్తోందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద దేశంలో 30 కోట్ల కూలీలకు పని కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.

కనీస వేతనం రూ. 400 ఏడాది 150 రోజులు కూలీలకు పని కల్పించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోందన్నారు. గత బడ్జెట్ కంటే ఈ ఏడాది ఎరువుల సబ్సిడీకి నిధులు తగ్గించిందన్నారు. పంట మద్దతు ధర ఊసే ఎత్తలేదన్నారు. అసంఘటిత కార్మికుల సంక్షేమం తమకు పట్టనట్టు కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కనీస వేతనం అమలు చేయాలని ఎన్ని సమ్మెలు చేసినా.. కార్మికుల ప్రయోజనాల కంటే తమకు పెట్టుబడిదారుల ప్రయోజనమే ప్రాధాన్యం అన్నట్టు కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. సామాజిక తరగతుల నిధులను కార్పొరేటు శక్తుల సంక్షేమానికి మళ్లిస్తోందన్నారు. జనాభా దామాషా ప్రకారం.. దేశంలో 16 శాతం ఉన్న ఎస్సీలకు బడ్జెట్‌లో 16 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా 5 శాతం నిధులే కేటాయించి 11 శాతం నిధులు ఇతర అవసరాలకు మళ్లిస్తున్నట్టు తెలిపారు. అలాగే, 7శాతం ఉన్న గిరిజనులకు 2 శాతం మాత్రమే కేటాయించినట్టు వివరించారు. బీసీలు 50శాతం ఉన్నప్పటికీ వారికి నిర్దిష్టమైన బడ్జెట్ లేని పరిస్థితి ఉందన్నారు. దీన్ని బట్టి చూస్తే కేంద్ర ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమానికి ఏ విధంగా కృషి చేస్తుందో అర్థం చేసుకోవన్నారు.

ప్రపంచ ఆర్థిక అభివృద్ధిలో భారత దేశం మూడవ స్థానంలో ఉందని చెబుతున్న మోడీ.. విద్యా వైద్య రంగానికి ఎందుకు సంపూర్ణమైన బడ్జెట్ కేటాయించడం లేదని ప్రశ్నించారు. విద్యా రంగానికి 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉంటే 2.5 శాతం నిధులు మాత్రమే కేటాయించారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు లేవన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, బి.సామేల్, దుబ్బాక రాంచందర్, ఈ.నర్సింహ, జగదీశ్, పి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్లు స్వాధీనం

- తాళాలు పగుల గొట్టి గృహప్రవేశం
- నిర్మాణం పూర్తయినా తమకు ఇండ్లు కేటాయించడం లేదంటూ స్వచ్ఛందంగా తాళాలు వేసుకున్న పలువురు మహిళలు
- నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఘటన




నవతెలంగాణ-మోర్తాడ్

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయినా తమకు ఇండ్లు కేటాయించడం లేదని విసిగెత్తిన పలువురు మహిళలు.. ఇండ్ల తాళాలు పగులగొట్టి స్వాధీనం చేసుకొని గృహప్రవేశం చేశారు. అనంతరం తమ తాళాలు వేసుకున్నారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకొని ఏండ్లు గడుస్తున్నా అధికారులు తమకు ఇండ్లు కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు నివాస గృహాలు లేక అద్దె ఇండ్లల్లో నివసిస్తున్నామని, ప్రస్తుతం తాము నివసిస్తున్న గృహాల్లో పాములు వస్తున్నాయని, ఖాళీగా ఉన్న నివాస గృహాలను తమకు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. తాము మాత్రం ఎవరు చెప్పినా వినబోమని, ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లల్లో తాము నివసిస్తామని తెలిపారు. ప్రస్తుతం పి బ్లాక్, క్యూ బ్లాక్, ఆర్ బ్లాక్‌లోని 24 నివాస సముదాయాల్లోని ఇండ్లకు తాళాలు వేసి ఉండగా.. వాటిని తొలగించి మహిళలు తమ తాళాలను వేసుకొని ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అర్హులైన తమకు ఎందుకు నివాస గృహాలు కేటాయించడం లేదని, తమకు తక్షణమే నివాస గృహాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వాటిని పంచేవరకూ తాము ఈ నివాస గృహాల్లోనే ఉంటామని, తమకు నివాస గృహాలు లేవంటూ పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నారు. తమను బలవంతంగా ఇక్కడి నుంచి పంపించాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ అధికారులతో పాటు పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పంపిణీ చేసేవరకు ఎవరూ దౌర్జన్యాలకు పాల్పడరాదని, లబ్దిదారులను ఎంపిక చేసి వారికి పట్టా సర్టిఫికెట్లను అందజేసిన అనంతరమే వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అలాకాకుండా ప్రభుత్వ తాళాలను తొలగించి దౌర్జన్యాలకు పాటుపడితే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆ ఇండ్ల వద్ద గ్రామ పంచాయతీ అధికారులను అక్కడ కాపలా ఉంచారు.

అమెరికా X చైనా

బీజింగ్ : అమెరికా విధించిన టారిఫ్‌లపై చైనా ప్రభుత్వం దీటుగా స్పందించింది. అమెరికా నుంచి దిగుమతయ్యే బొగ్గు, ఎల్ఎన్‌జీ ఉత్పత్తులపై 15శాతం, ముడి చమురు, ఇతర ఉత్పత్తులపై పది శాతం అదనపు సుంకాలను విధిస్తున్నట్టు చైనా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 10 నుంచి ఈ టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. అంతర్జాతీయ చట్టం మౌలిక సూత్రాలు, టారిఫ్ లా వంటి చైనా చట్టాలు, ఇతర నిబంధనలకు అనుగుణంగానే ఈ చర్యలు తీసుకున్నట్టు కస్టమ్స్ టారిఫ్ కమిషన్ మంగళవారం ప్రకటించింది. కెనడా, మెక్సికో, చైనా దేశాల ఉత్పత్తులపై ఈ నెల 1న అదనపు దిగుమతి సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు.

వ్యవసాయ పనిముట్లు, ఆటోమొబైల్స్ పికప్ ట్రక్కులు వంటి వాటిపై కూడా 10శాతం అదనపు టారిఫ్‌లు అమలు కానున్నాయని కమిషన్ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఏ ఏ ఉత్పత్తులకు ఎంతెంత అదనపు సుంకాలనేవి అనుబంధ పత్రాల్లో వెల్లడించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుత బాండెడ్ విధానాలు, పన్ను తగ్గింపు, మినహాయింపు విధానాలేవీ మారబోవని, తాజా టారిఫ్‌లకు ఎలాంటి మినహాయింపుల, తగ్గింపు వుండబోదని కమిషన్ ప్రకటన పేర్కొంది.

చైనా నుండి దిగుమతయ్యే ఉత్పత్తులపై అదనంగా 10శాతం సుంకాలు విధిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) వివాదాల పరిష్కార యంత్రాంగంలో చైనా ఫిర్యాదు నమోదు చేసింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. చైనా చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించుకోవడం కోసమే ఈ చర్య తీసుకున్నట్లు వాణిజ్య శాఖ ప్రతినిధి మీడియాకు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా అధిక టారిఫ్‌లను విధించడం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని విమర్శించింది. ఈ చర్య అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోగా చైనా, అమెరికాల మధ్య నెలకొన్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తుందని తెలిపింది. చైనా దిగుమతులపై ట్రంప్ విధించిన 10శాతం సుంకాలు మంగళవారం నుండి అమల్లోకి వచ్చాయి.

బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు గట్టి మద్దతుదారుగా డబ్ల్యుటిఓ సభ్య దేశాలతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా వుంటుందని వాణిజ్య ప్రతినిధి చెప్పారు. ఏకపక్షవాదం, వాణిజ్య రక్షణవాదం వంటి చర్యల వల్ల బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు ఎదురయ్యే సవాళ్ళను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే అంతర్జాతీయ వాణిజ్యాభివృద్ధిని పరిరక్షించేందుకు కట్టుబడి వుంటామని తెలిపారు.

తెలంగాణలో బీసీ జనాభా 1,64,09,179

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. దాదాపు 50 రోజుల పాటు సర్వే జరిగిందన్నారు. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాలు, పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలో మొత్తంగా 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే చేశామని తెలిపారు. సర్వే ప్రకారం ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), బీసీలు (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 (46.25 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనారిటీలు 44,57,012 (12.56 శాతం) మంది ఉన్నారని తెలిపారు. ఈ నివేదికను సంక్షేమ విధానాల తయారీకి వినియోగిస్తామని స్పష్టం చేశారు. జనగణన కంటే పకడ్బందీగా కులగణన చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించామని తెలిపారు. ఒక ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇండ్లకంటే ఎక్కువగా సర్వే చేయలేదని వివరించారు. 8 పేజీలతో ఉన్న ప్రశ్నాపత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేశామన్నారు. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల పాటు పనిచేసి డేటా క్రోడీకరించారని తెలిపారు. మొత్తంగా రూ. 125 కోట్లు ఖర్చు చేసి సర్వే ద్వారా సమగ్ర వివరాలు సేకరించామన్నారు. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్వే చేయించాం" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

సర్వే వివరాలు...

రాష్ట్రంలో మొత్తం 3,54,77,554 మందిని సర్వే చేశారు.

బీసీ జనాభా 1,64,09,179 (ముస్లిం మైనార్టీ మినహా) మొత్తంలో 46.25శాతం

ఎస్సీలు 61,84,319 (మొత్తంలో 17.43 శాతం)

ఎస్టీలు 37,05,929 (మొత్తంలో 10.45 శాతం)

ముస్లిం మైనార్టీలు మొత్తం 44,57,012 (మొత్తంలో 12.56 శాతం).

వీరిలో ఒసీలు 8,80,424 (2.48 శాతం), బీసీలు 35,76,588 (10.08శాతం)

ఓసీ జనాభా (ముస్లిం మైనార్టీలో 8,80,424 ఒసీలను కలుపుకుని) 56,01,539 (15.79శాతం)

మా భూములు మాకే ఉండాలి


- ఇండస్ట్రియల్ పార్క్‌కు భూములివ్వం
- ఆర్డీవోకు చౌటపల్లి రైతుల వినతి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

దళితుల కోసం ఆనాడు ఇందిరమ్మ హయాంలో పేదలకు ఇచ్చిన భూములను నమ్ముకుని జీవిస్తున్నామని, ఆ భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తే తమ భూములు ఇవ్వబోమని ఆ భూములు తమకే ఉండాలని మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం చౌటపల్లి, తోటపల్లి గ్రామ రైతులు ఆర్డీవోకు విన్నవించారు. అనంతరం ఎలాగైనా తమ భూములను తమకే ఉండేలా చూడాలని డీఏఓకు రైతులు ఒక్కొక్కరిగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. హుస్నాబాద్ నుంచి జనగామ వరకు నేషనల్ హైవే కాబోతుందని, చౌటపల్లి గ్రామ శివారులో రోడ్డుకు ఇరువైపుల ఉన్న 312 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమి విలువలు పెరుగుతున్నాయన్నారు. అలాంటి భూమిలో ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం అక్కన్నపేట మండల కేంద్రంలో చాలా భూములు ఉన్నాయన్నారు. పేదల కోసం ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 312లో పేద దళితులమైన ఎస్సీ కుటుంబాలకు ఒక్కొక్కరికి 10, 20 గుంటల భూమిని ఇచ్చారని, తమ తాతల కాలం నాటి భూమి, భూములపై ఆధారపడి చాలా కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. అలాంటి భూములను ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కుకు తీసుకోవద్దని కోరారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చౌటపల్లి రైతులు పార్కు కోసం భూమిని తీసుకోవద్దని వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. జనవరి 28న చౌటపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్.. పేద ప్రజల భూములను తమకే ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌటపల్లి, తోటపల్లి రైతులు మాశం రాద, బైనాల శ్రీనివాస్, సుద్దాల సుమంత్, గోదార్ల నాగభూషణం, కామాద్రి లక్ష్మి, బైనాలా రాణి, సూరవ్వ, కందుకూరి కనకవ్వ, కామాద్రి రాంబాబు, గణేష్, మంచి కట్ల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయులను వెనక్కి పంపిన ట్రంప్

వాషింగ్టన్ : అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అమెరికాలో చట్ట విరుద్ధంగా నివసించే వారిపై చాలా దూకుడుగా చర్యలు తీసుకుంటూ ఆగమేఘాల మీద వారిని వారి స్వదేశాలకు పంపుతున్నారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్థాయిలో ఈ బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా మైగ్రేంట్లను వెనక్కి పంపించేందుకు మిలటరీ విమానాలను ఉపయోగిస్తున్నారు. ముందుగా మైగ్రేంట్లను సైనిక స్థావరాలకు తరలించి, అక్కడ నుండి వారిని వారి దేశాలకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు గ్వాటెమాలా, పెరూ, హోండూరస్‌లకు మైగ్రేంట్లను తీసుకుని మిలటరీ విమానాలు వెళ్ళాయి. ఈ క్రమంలో తాజాగా మంగళవారం కొంతమంది భారతీయులను తీసుకుని అమెరికా మిలటరీ విమానం బయలుదేరిందని సంబంధిత అధికారులు తెలిపారు. వీరిలో వీసా గడువు తీరినా కూడా అక్కడే వున్నవారు, లేదా సరైన పత్రాలు లేకుండా వెళ్ళినవారు వున్నారని భావిస్తున్నారు. ఆ విమానంలో 205మంది భారతీయులు వున్నట్లు తెలుస్తోంది. సి-17 యుఎస్ మిలటరీ విమానంలో వీరిని తరలిస్తున్నారని, 24గంటల్లో భారత్‌కు చేరుకుంటారని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు.ఇలా అక్రమంగా అమెరికాలో నివసిస్తున్న వారిని వెనక్కి వారి దేశాలకు పంపడానికి మిలటరీ విమానాలు వాడుతుండడంతో ఇదొక ఖర్చుతో కూడిన వ్యవహారంగా మారింది. గ్వాటెమాలాకు పంపడానికి ఒక్కో మైగ్రేంట్‌కు 4,675 డాలర్లు చొప్పున ఖర్చు అవుతోందని అమెరికా డేటా వెల్లడించింది. కాగా భారత్ దీనిపై సానుకూలంగా స్పందించింది. అమెరికాలోనే కాదు, ప్రపంచ దేశాల్లో ఎక్కడైనా సరే కాల పరిమితి కన్నా ఎక్కువ కాలం వుంటున్న వారిని వెనక్కి రప్పించడానికి తాము సిద్ధంగానే వున్నామని తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని స్పష్టం చేసింది. ఇది అనేక రకాలైన వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి వుంటుందని వ్యాఖ్యానించింది.

చర్లపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

- పారిశ్రామికవాడలో ఎగిసిపడిన మంటలు
- నాలుగు పరిశ్రమలు దగ్ధం
- రూ.15కోట్ల ఆస్తి నష్టం!



నవతెలంగాణ - చర్లపల్లి

హైదరాబాద్ చర్లపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ. 15కోట్ల ఆస్తినష్టం జరిగినట్టు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వోదయ సెల్వెంట్ రసాయన పరిశ్రమలో సుమారు రూ.10 నుంచి 15కోట్ల ముడి సరుకు ఉంది. మంగళవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వచ్చాయి. మెల్లమెల్లగా పక్కనే ఉన్న ముడి సరుకులకు అంటుకోవడం, అందులో ఎక్కువగా కెమికల్స్ ఉండటంతో మంటలు ఎగిసిపడ్డాయి. పెద్దఎత్తున్న దట్టమైన పొగ అలుముకుంది. ఆ తర్వాత పక్కన ఉన్న పరిశ్రమలోకి కూడా భారీగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాదాపు పది ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు ఇంటికి వెళ్లిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు. సర్వోదయ కెమికల్స్, మహాలక్ష్మి, హైటెక్, హరిత పరిశ్రమలు అగ్నికి పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే, ఈ ప్రమాదంలో మహాలక్ష్మి రబ్బర్ కంపెనీకి మంటలు అంటుకోవడంతో రసాయనాల ఘాటుతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మంటలు చుట్టుపక్కల పరిశ్రమలకు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సుమారు రూ.15కోట్ల ఆస్తినష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంతో అశోక్‌నగర్ హెచ్‌సీఎల్ చౌరస్తా నుంచి బి.యస్.రెడ్డి నగర్ చర్లపల్లి రైల్వే స్టేషన్‌కి వెళ్లే రహదరి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.

ప్రమాదం విషయం తెలుసుకున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందికి సూచనలు ఇస్తూ ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద స్థలాన్ని చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాలుర లైంగిక వేధింపుల ఘటనలో ముగ్గురిపై కేసు

- ఏ2గా హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, ఏ3గాఏటీడబ్ల్యూవో జహీరుద్దీన్
- ఖమ్మంజిల్లా రేలకాయలపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో ఘటన

నవతెలంగాణ-కారేపల్లి

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రేలకాయలపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో బాలురపై డిప్యూటీ వార్డెన్ భూక్య వెంకటేశ్వర్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో డిప్యూటీ వార్డెన్ భూక్య వెంకటేశ్వర్లుతో పాటు హెచ్ఎం శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవో జహీరుద్దీన్‌లపై కేసు నమోదైంది. రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లు ఇటీవల ఆశ్రమ పాఠశాలలో ఉంటూ బాలురపై లైంగికంగా (స్వలింగ సంపర్కం) వేధింపులకు పాల్పడ్డారని విద్యార్థులు చెబుతున్నారు. ఈ విషయాన్ని హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావుకు విద్యార్థులు ఫిర్యాదు చేయగా ఆయన ఏటీడబ్ల్యూవో జహీరుద్దీన్‌కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఏటీడబ్ల్యూవో విచారణ చేయగా విచారణ నివేదిక ఆధారంగా డిప్యూటీ వార్డెన్ వెంకటేశ్వర్లును పీవో సస్పెండ్ చేశారు. డిప్యూటీ వార్డెన్‌పై బాధిత బాలుని తండ్రి కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా డిప్యూటీ వార్డెన్ వెంకటేశ్వర్లుపై కేసు నమోదైంది. ఈ లైంగిక వేధింపుల ఘటనలో పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారని ఏ2గా హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, ఏ3గా ఏటీడబ్ల్యూవో జహీరుద్దీన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరిని హతమార్చిన మావోయిస్టులు

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన


నవతెలంగాణ-చర్ల

చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాసగూడెం పోలీసు స్టేషన్ పరిధిలోని బుడగిచెరు గ్రామంలో పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గ్రామస్తులను మావోయిస్టులు హత్య చేశారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. బీజాపూర్ జిల్లాలో ప్రజలు పంచాయతీ, పురపాలక సంఘం ఎన్నికల హడావుడిలో ఉన్న సమయంలో మావోయిస్టులు పంజా విసిరారు. తర్రెమ్ పోలీసు స్టేషన్ పరిధిలోని బుడ్డిచెరు గ్రామానికి చెందిన మడివి మున్నా, తలబ్బారా గ్రామానికి చెందిన కారం హరిజును అత్యంత దారుణంగా గొంతు కోసం హత్య చేశారు. ఘటనా స్థలంలో మావోయిస్టులు లేఖను వదిలి వెళ్లారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నందునే శిక్ష విధించినట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మావోయిస్టుల చర్యలతో గిరిజన గూడెంలో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పట్టు చీరల ఇస్త్రీ ఇలా

బట్టలు ఇస్త్రీ చేసుకునేటప్పుడు, ముఖ్యంగా పట్టు చీరల ఇస్త్రీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. సాధారణ దుస్తుల మాదిరి వాటిని ఇస్త్రీ చేస్తే త్వరగా పాడైపోయే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో తెలుసుకుందాం.

- చీరలు కొనేటప్పుడే వాటిని ఇస్త్రీ చేయవచ్చో లేదో తెలుసుకోవాలి.
- ఇస్త్రీ చేసేటప్పుడు చీరపై కాటన్ వస్త్రం ఉంచి చేయాలి. ఇలా చేస్తే, వేడికి కాలిపోకుండా ఉంటాయి.
- ఐరన్ బాక్స్ మోడ్స్‌ని మార్చుకోకుండా ఇస్త్రీ చేయకూడదు. అలాగే ముందుగా చీర అంచులను ఇస్త్రీ చేయాలి. ఆ తర్వాతే చీర మధ్యలో చేయాలి. ఇలా చేస్తే ముడతలు చక్కగా పోతాయి.
- ఐరన్ చేయగానే వెంటనే మడతలు పెట్టకూడదు. హ్యాంగర్‌కు వేలాడదీయాలి. వెంటనే మడత పెడితే ముడతలు వచ్చేస్తాయి.



తొలి మహిళా లోకో పైలెట్‌కు అరుదైన ఆహ్వానం

ఇటీవలె జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మహిళలకు జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు సాధారణ మహిళలు అరుదైన ఆహ్వానాన్ని అందుకున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆధ్వరంలో జరిగిన 'ఎట్ హెూమ్ రిసెప్షన్'ను హాజరయ్యారు. ద్రోణాచార్య, పద్మశ్రీ అవార్డు గ్రహీత పూర్ణిమ మహాతో, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడిపిన మొదటి గిరిజన లోకో పైలట్ రితికా తిర్కిలను ఈ అరుదైన గౌరవం దక్కింది.



ఆమెకు మొదట ఈ-మెయిల్ వచ్చింది. కానీ దాన్ని ఆమె నమ్మలేదు. ఏదో ఫేక్ మెయిల్ అనుకొని పెద్దగా పట్టించుకోలేదు. అయితే కొద్ది రోజుల్లోనే రాష్ట్రపతి భవన్ నుండి అధికారిక ఆహ్వానం అందడంతో ఆమె ఆశ్చర్యపోయింది. ఆమే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు మొదటి మహిళా గిరిజన అసిస్టెంట్ లోకో పైలట్‌గా నియమించబడిన రితికా టిర్కీ. రాష్ట్రపతి భవన్‌లో జరిగే 'ఎట్ హోమ్' రిసెప్షన్ కోసం ఆమెకు ఆహ్వానం అందించడానికి పోస్ట్ ఆఫీస్ అధికారుల బృందం వచ్చి తన తలుపు తట్టినపుడు ఆమె నోట మాట రాలేదు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ (వెస్ట్) పరీక్షిత్ సేథ్ పర్యవేక్షణలో పోస్ట్‌మ్యాన్ ద్వారా జంషెడ్‌పూర్‌లోని జుగ్సలైలోని ఆమె నివాసానికి ఈ ఆహ్వానం అందింది. ఒక లోకో పైలెట్‌గా ఉన్న 27 ఏండ్ల రితికా రాష్ట్రపతి నుండి తనను ఆహ్వానం అందుతుందని ఎప్పుడూ ఊహించలేదు.

గౌరవం దక్కింది

'మొదట్లో నాకు ఈ-మెయిల్ వచ్చినప్పుడు, అది ఫేక్ మెయిల్ అనుకున్నాను. కానీ పోస్టాఫీసు నుండి ఒక బృందం నా తలుపు తట్టినప్పుడు ఆశ్చర్యంతో నోట మాటరాలేదు' అంటూ రితికా ఓ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన భావాలను పంచుకున్నారు. సాధారణ కుటుంబానికి చెందిన ఒక గిరిజన అమ్మాయికి ఈ అరుదైన అవకాశం అందుకున్న ఆమె తన సమాజానికి మరింత గౌరవాన్ని అందించింది. మహిళలకు స్ఫూర్తిగా నిలిచింది. వాస్తవానికి తను పని చేస్తున్న పురుషాధిక్య రంగంలో ఆమె సాధించిన అత్యుత్తమ విజయాలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. భారతీయ రైల్వేలలో మహిళలకు ఒక మార్గాన్ని ఏర్పరచడానికి ఉన్న అడ్డంకులను ఆమె అధిగమించింది.



అంకితభావంతో చేయడమే

రాష్ట్రపతి భవన్ నన్ను 'మహిళా సాధకురాలు'గా ఆహ్వానించింది. ప్రతి స్త్రీ స్వతంత్రంగా ఉండాలని నేను నమ్ముతున్నాను. ప్రస్తుతం మహిళలు దాదాపు ప్రతి రంగంలోనూ పనిచేస్తున్నారు. ఇంకెక్కడైనా వారు పని చేయని చోటు వుంటే అక్కడకు కూడా అతి త్వరలో చేరుకుంటారని నేను భావిస్తున్నాను' అని రితికా అన్నారు. ఈ ప్రపంచంలో ఏ పని తక్కువ కాదు. మనం ఎంచుకున్న పని ఏదైనా దాన్ని పూర్తి అంకితభావంతో చేయడమే మనముందున్న ఏకైక కర్తవ్యం. ఆపై విజయం తప్పకుండా వస్తుంది' అంటూ ఆమె జతచేశారు.

మొదటి గిరిజన మహిళ

టాటానగర్ - పాట్నా మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో అసిస్టెంట్ లోకో పైలట్‌గా పనిచేస్తున్న రితిక, ఈ ప్రతిష్టాత్మక పాత్రను పోషించిన మొదటి గిరిజన మహిళ. అంతే కాదు ఇప్పుడు ఆమె కుటుంబానికి, తన రాష్ట్రంలోని ప్రతి మహిళకూ ఎంతో గర్వకారణం. జార్ఖండ్‌లోని ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చిన రితికా రాంచీలో పాఠశాల విద్యను పూర్తి చేశారు. బిఐటి మెస్రా నుండి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బి.టెక్ పట్టా అందుకున్నారు.

కొత్త శిఖరాలకు చేరుకుంది

రితికా తండ్రి రిటైర్డ్ ఫారెస్ట్ గార్డ్. రైల్వేలతో రితికా కెరీర్ ధన్‌బాద్ రైల్ డివిజన్ కింద బొకారోలోని చంద్రపురాలో ప్రారంభ మైంది. 2021లో టాటానగర్‌కు బదిలీ అయ్యింది. అక్కడే ఆమె పదోన్నతి పొందింది. తన కెరీర్‌లో కొత్త శిఖరాలకు చేరుకుంది. అసిస్టెంట్ లోకో పైలట్‌గా పదోన్నతి పొందే ముందు ఆమె సరుకు రవాణా రైళ్ల, ప్రయాణీకుల సేవలను సంబంధించిన రైళ్లను నడుపుతూ ముందుకు సాగింది. 2024లో ఆమె పదోన్నతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నిర్వహణలో పాల్గొనడానికి వీలు కల్పించింది. అక్కడ ఆమె ఇప్పుడు కీలకమైన సిబ్బంది సభ్యురాలిగా పనిచేస్తున్నారు.



విలువిద్యలో కోచ్ పూర్ణిమ

విలువిద్య కోచ్ అయిన పూర్ణిమ మహతో 'ఎట్ హోమ్ రిసెప్షన్'లో పాల్గొనడానికి టాటా స్టీల్ ఆర్చరీలో కోచ్‌గా ఢిల్లీకి వెళ్లారు. పూర్ణిమ 1994 నుండి టాటా స్టీల్‌లో క్రీడాకారిణిగా ఉన్నారు. 2000లో ఆమె విలువిద్యలో కోచ్ అయ్యారు. 2013లో ద్రోణాచార్య అవార్డును అందుకున్నారు. 2024లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమెకు పద్మశ్రీని ప్రదానం చేశారు. ఎట్ హోమ్ రిసెప్షన్‌కు హాజరు కావల్సిందిగా మొదట తనకు మెయిల్ వచ్చిందని, ఆ తర్వాత ధృవీకరణ చేస్తూ రాష్ట్రపతి భవన్ నుండి ఫోన్ కాల్ వచ్చిందని పూర్ణిమ పంచుకున్నారు. 'మొదట నేను నమ్మలేకపోయాను కానీ మెసేజ్ చూసిన తర్వాత గర్వంగా అనిపించింది' అని ఆమె చెప్పారు. ఈ రోజు టాటా స్టీల్ మద్దతుతో నాకు విలువిద్యలో గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు నాకు కొత్త దిశను ఇచ్చింది. రాష్ట్రపతి నుండి ఆహ్వానం అందుకోవడం ఒక కొత్త విజయం' అని ఆమె అన్నారు.



ప్రాసెస్ ఫుడ్‌తో ప్రమాదం...

మారిన కాలంతో పాటు తీసుకునే ఆహారంలో కూడా మార్పులు వచ్చాయి. ఫాస్ట్ ఫుడ్, ప్రాసెసింగ్ ఫుడ్‌కు ఎక్కువగా ఆదరణ పెరుగుతోంది. సూపర్ మార్కెట్లు, బేకరీలు చిన్న చిన్న పట్టణాల్లోకి కూడా అందుబాటులోకి రావడంతో ప్రజల ఆహారపు అలవాట్లలో భారీగా మార్పులు వచ్చాయి. అయితే ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.



ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు ప్రాసెస్ ఫుడ్ కారణమవుతుందని చెబుతున్నారు. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం పెరుగుతుంది. సాధారణంగా ప్రాసెస్ చేసిన ఆహారం ఎక్కువ కాలం నిల్వ ఉండాలనే ఉద్దేశంతో చక్కెర, ఉప్పు కంటెంట్‌ను ఎక్కువగా యాడ్ చేస్తుంటారు. వీటిలో ప్రమాదకరమైన రసాయనాలతో పాటు కార్బోహైడ్రేట్లు, కొవ్వులు ఉంటాయి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినడం ఊబకాయం, వృద్ధాప్యం వచ్చే అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు.

ప్యాకింగ్ ఫుడ్ ఎక్కువగా నిల్వ ఉండేందుకు గాను.. ఎక్కువ మొత్తంలో స్టార్చ్‌ను ఉపయోగిస్తారు. స్టార్చ్ అనేది ఒకరమైన పాలిమర్.. ఇది గ్లూకోజ్ చైన్‌లో ముఖ్యమైన భాగం. ఆహారంలో అధిక మొత్తంలో స్టార్చ్ ఉండటం వల్ల, శరీరంలో చక్కెర స్థాయి ప్రమాదం చాలా పెరుగుతుంది. ఇది శరీరంలో ఉన్న కణజాలాన్ని కూడా దెబ్బతీస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది. టిక్ ప్యాక్ ఆహారాల్లో ట్రాన్స్ ఫ్యాట్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది. ఇది గుండె ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది.

కదంతొక్కిన వీఆర్‌ఏలు

(మొదటిపేజీ తరువాయి)

దిగారు. పోలీసులు ఎంత నచ్చజెప్పినా ఆందోళనకారులు తమ పట్టు వీడలేదు. గంటకుపైగా రోడ్డుపైనే బైటాయించి నిరసన చేపట్టారు. దాంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. బంజారాహిల్స్, కమాండ్ కంట్రోల్ వైపు కమాన్ నుంచి పెన్షన్ ఆఫీస్ వరకు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దాంతో వీఆర్‌ఏల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములును బలవంతంగా పోలీస్ వాహనంలో ఎక్కించారు. అడ్డుకునేందుకు యత్నించిన వారిని సైతం బలవంతంగా అరెస్ట్ చేశారు. మహిళలు, వృద్ధులు అని చూడకుండా రోడ్లపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. అనంతరం వారిని ఎస్ఆర్‌నగర్, బోయినపల్లి, జూబ్లీహిల్స్, బొల్లారం, బండ్లగూడ, చంద్రాయణగుట్ట, కంచన్‌బాగ్ తదితర పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో కొంత మంది వీఆర్‌ఏలు ప్రజాభవన్ దగ్గరికి వెళ్లి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ నాయకులు కె. నగేష్ కుమార్, కె. రమేష్, మధు, సాగర్, అంజనేయులు, హరీష్, గంగమల్లు, శ్రీకాంత్, రాజశేఖర్, ఇమామ్బాషా, నాగేశ్వరరావు, రవి సాగర్, సతీష్, ఈశ్వర్‌శెట్టి, శ్రీశైలం, లలితతో పాటు వెయ్యిమందికి పైగా వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం
వంగూరి రాములు, వీఆర్‌ఏల జేఏసీ రాష్ట్ర కన్వీనర్

"61 సంవత్సరాల వయస్సు పైబడిన 3,797 మంది వీఆర్‌ఏల వారసులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. 18 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 340 మంది వీఆర్‌ఏలు మరణించారు. బతుకుదెరువులేక కొందరు తమ ఆస్తులను అమ్ముకుంటే మరికొందరు అప్పుల పాలయ్యారు. అప్పులు తీరక, వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరణాలన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను రేవంత్‌రెడ్డి సర్కార్ నిలబెట్టుకోవాలి. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తాం. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతాం" అని రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పసిగుడ్డు పాలకూ కట్టమైతాంది

(మొదటిపేజీ తరువాయి)

తీసుకెళ్లాడు. పని కుదరని వాళ్లు ఇంకా ఎదురు చూడసాగారు. అప్పటికే సమయం ఉదయం 10 గంటలు దాటింది. అడ్డాల్లోని కూలీల మెదళ్లలో 'ఈ రోజు పని దొరుకుతుందా? దొరకదా?' అన్న ఆలోచన గింగిరంగా తిరుగుతుండగా.. అక్కడికి వచ్చే వారిలో ఏ ఒక్కరినీ వదలకుండా 'సార్ పని ఉందా.. లేబర్ కావాలా?, కూలి కొంత తక్కువిచ్చినా మంచిదే. మేం వస్తాం సారూ!' అంటూ అడుగుతున్న దీనస్థితి కనిపించింది. 'పని దొరికితే ఆ డబ్బులతో బియ్యం, కారం, ఉప్పు, పప్పులు కొనుకుందును కదా అనిపిస్తుంది. పని లేని రోజున మా లాంటి వాళ్లమంతా కలిసి కష్టసుఖం మాట్లాడుకుని.. తిరిగి ఇంటికెళ్లిపోతాం' అంటూ లక్ష్మమ్మ, కల్యాణి చెప్పుకొచ్చారు. ఏడాది కాలంగా పనుల్లేక వారంలో రెండురోజులే పని దొరుకుతుందని, కుటుంబం గడవటం కష్టంగా మారిందంటూ వాపోయారు.

రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన అసంఘటితరంగ కార్మికులు 2.70కోట్ల మందిలో నిర్మాణ రంగం కార్మికులే అత్యధికం. ఉమ్మడి కరీంనగర్ వరకు చూస్తే అన్నిరంగాల్లోని కార్మికులు 4,88,120 మంది ఉంటే.. నిర్మాణ రంగ కార్మికులు 57,583 మంది ఉన్నారు. వీరిలో కొంతమంది ఆయా కాంట్రాక్టర్లు, బిల్డర్ల వద్ద.. పని ఉన్న చోట ముందే మాట్లాడుకుని వెళ్తుంటే.. సుమారు 10శాతం మంది మేర (5వేల మందికిపైగా) ఉమ్మడి జిల్లాలోని రెండు కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీల్లోని ఆయా అడ్డాలకు పని కోసం ప్రతిరోజూ వస్తూపోతున్నారు. సుమారు2వేల మందివరకు వలస కార్మికుల తాకిడీ వీరి 'ఉపాధి'పై తీవ్ర ప్రభావం చూపుతోంది.

పని దొరకాలనే ఆశ ఉంటుంది కదా..



స్వామి, గట్ల మల్యాల, నంగునూర్ మండలం సిద్దిపేట

నెలలో 10 రోజులైనా పని దొరకదు. పని దొరికిన రోజు కూడా కాంట్రాక్టరు వచ్చి చేయాల్సిన పని చూపించి ప్రారంభించేవరకూ అనుమానమే. ఇప్పటి వరకు ఎప్పుడూ నెలలో 30 రోజులు పని దొరకలేదు. నాకే కాదు మా అడ్డాలో ఎవరికీ దొరకదు. ఒకే కాంట్రాక్టరు వద్ద పని చేసినా కూడా రోజూ పని ఉండదు.

ఏ రోజూ ధైర్యంగా నిద్రపోలేదు



రాజు, అక్కనపెల్లి, హుస్నాబాద్

నేను అడ్డాకూలీగా పదేండ్లుగా పని చేస్తున్నాను. అంతకు ముందు చిన్నచితకా పనులు చేసుకుంటూ ఉండేటోన్ని. ఇంటిల్లిపాది పని చేస్తున్నా రోజూ పని దొరక్కపోవడం, కరెంటు, డిష్, పాలు, ఇంటి కిరాయి, పండుగలు, అడపాదడపా వచ్చే రోగాలకే సంపాదించినదంతా అయిపోతోంది. పైసా కూడా దాచుకోలేకపోయిన. ఒక్కమాటలో చెప్పాలంటే సంపాదిస్తున్నదంతా రెండుపూటల తిండి.. ఇంటి అద్దెలు కట్టుకోడానికే సరిపోతుంది. ఏ రోజూ ధైర్యంగా నిద్రపోలేదు.

తీవ్ర సంక్షోభంలో నిర్మాణ రంగం

(మొదటిపేజీ తరువాయి)

ఏటా రెండు కోట్ల ఎస్ఎఫ్‌టీ వరకు గ్రానైట్ ఉత్పత్తి చేసేవి. ఇప్పుడు చాలా కటింగ్ మిషన్లలో ప్రతి ఆదివారం ప్రొడక్షన్ హాలిడే ప్రకటించి ఉత్పత్తి నిలిపివేస్తున్నారు. ఈ లెక్కలన్నీ తీవ్ర సంక్షోభంలో ఉన్న నిర్మాణ రంగానికి అద్దం పడుతున్నాయి.

రెండేండ్లలో 1.55కోట్ల మంది తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభలో ఈ విషయాన్ని వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 86,17,887 మంది, 2023-24లో 68,86,532 మంది కార్మికుల పేర్లను తొలగించినట్టు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రెండేండ్లలో మొత్తంగా 1,55,04,419 మంది కార్మికుల పేర్లను తొలగించామన్నారు. నకిలీ, తప్పుడు జాబ్ కార్డులు, గ్రామాల నుంచి కార్మికుల కుటుంబాలు తరలిపోవడం లేదా సంబంధిత గ్రామాలను పట్టణాలుగా వర్గీకరించడం తదితర అంశాలు ఇందుకు కారణంగా చెప్పారు

రాష్ట్ర యూనివర్సిటీలపై కేంద్రం పెత్తనం

- వైస్రాయ్‌ల మాదిరిగా వ్యవహరించే గవర్నర్లతో స్వాధీనానికి యత్నం
- యూజీసీ సవరణలు సమాఖ్య సూత్రాలకు విరుద్ధం
- రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్
- యూజీసీ సవరణ ప్రతిపాదనలు సమీక్షిస్తాం : కేంద్ర మంత్రి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వైస్రాయ్‌ల మాదిరిగా వ్యవహరించే గవర్నర్లతో రాష్ట్ర యూనివర్సిటీలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చెలాయించాలనుకుంటోందని సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. యూజీసీ సవరణలు సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని, ఈ సవరణలు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రాల అధికారాలను మరింతగా హరించే వివాదాస్పద యూజీసీ సవరణ ప్రతిపాదనలను సమీక్షిస్తామని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజ్యసభకు హామీ ఇచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా యూజీసీ ముసాయిదా సవరణ ప్రతిపాదనలు రాష్ట్రాల అధికారాలను అతిక్రమించాయని సీపీఐ(ఎం) రాజ్యసభ ఉప నాయకుడు జాన్ బ్రిట్టాస్ ఎత్తి చూపగా కేంద్ర మంత్రి జోక్యం చేసుకుని సమీక్ష ఉంటుందని ప్రకటించారు. జేడీయూతో సహా ఎన్‌డీఏ మిత్రపక్షాలు కూడా యూజీసీ సవరణ చర్యను వ్యతిరేకించాయి. కేరళ, తమిళనాడు అసెంబ్లీలు యూజీసీ సవరణ చర్యకు వ్యతిరేకంగా తీర్మానాలను ఆమోదించాయి.

ఆయా రాష్ట్రాల కృషితో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయని చర్చలో జాన్ బ్రిట్టాస్ అన్నారు. "వైస్రాయ్‌ల మాదిరిగా వ్యవహరించే గవర్నర్లతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విశ్వవిద్యాలయాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. కొత్త సవరణ ప్రకారం గవర్నర్లు వైస్ ఛాన్సలర్లను నియమిస్తారు. అటువంటి సవరణ సమాఖ్య సూత్రాలకు విరుద్ధం. ఇది రాష్ట్రాల అధికారాలపై అతిక్రమణ. ఇది ఆమోదయోగ్యం కాదు" అని బ్రిట్టాస్ అన్నారు. ఈ దశలో జోక్యం చేసుకోవడానికి అనుమతి కోరిన కేంద్ర మంత్రి ప్రస్తుత యూజీసీ నిబంధనలు కేవలం ముసాయిదా నిబంధనలు మాత్రమేనని, తుదివి కావని తెలియజేశారు. ముసాయిదా సవరణ ప్రతిపాదనలకు స్పందనలు వస్తున్నాయని, చాలా మంది అభిప్రాయాలను తెలిపారని అన్నారు. కొన్ని రాష్ట్రాలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయని, ముసాయిదా చట్టాన్ని ఖరారు చేసేటప్పుడు వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి తెలిపారు.

న్యాయవ్యవస్థ నుంచి ఎన్నికల సంఘం వరకు
ప్రతిదీ ప్రభుత్వ నియంత్రణే

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేస్తున్నారు. ఇదీ మైనారిటీల పరిస్థితి. ప్రతి క్రిస్మస్ నాడు, బిషప్‌లు, పాస్టర్లకు మోడీకి విందు ఏర్పాటు చేస్తారు. అది గౌరవం కోసం కాదు. భయంతో మాత్రమే. దేశవ్యాప్తంగా క్రైస్తవులపై 834 దాడులు జరిగాయి. యూపీలోని బరేలీలో ఇంట్లో బైబిల్ ఉంచుకున్నందుకు ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష విధించారు. దళితులు కూడా వేధింపులకు గురవుతున్నారు. ఢిల్లీలో జరిగిన ఓ వివాహానికి గుర్రంపై వచ్చిన ఒక దళిత వ్యక్తిని ఈడ్చుకెళ్లి కొట్టారు' అని ఆయన అన్నారు.

కేరళ దేశంలో భాగమని కేంద్ర ప్రభుత్వం భావించడం లేదు. వాయనాడ్ విపత్తు సమయంలో కూడా ఎలాంటి సహాయం అందించ లేదు. కేరళను వెనుకబడిన రాష్ట్రంగా ప్రకటిస్తే సహాయం అందిస్తానని ఓ కేంద్ర మంత్రి అన్నారు' అని జాన్‌బ్రిట్టాస్ పేర్కొన్నారు. 'శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని రాజ్యాంగం పేర్కొంది. కానీ ఇక్కడ ఒక ఐఐటీ డైరెక్టర్ గోమూత్రం తాగమని పిలుస్తున్నారు. న్యాయవ్యవస్థ నుంచి ఎన్నికల కమిషన్ వరకు ప్రతిదానినీ ప్రభుత్వం నియంత్రిస్తోంది. ఒక హైకోర్టు న్యాయమూర్తి ముస్లింలను బహిరంగంగా అవమానించారు. ఇది హజ్రత్ మోహని, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల భూమి. వారు ప్రేరణ, ప్రతిఘటన నినాదం 'ఇంక్విలాబ్ జిందాబాద్' ను లేవనెత్తారు. స్వాతంత్ర్యం పోరాటంలోని అలాంటి మంచి విషయాలను తిరిగి పొందాలి' అని బ్రిట్టాస్ అన్నారు.

రోడ్డెక్కిన రైతన్న

- యూకే ఎడిన్‌బర్గ్‌లో ట్రాక్టర్లపై నిరసన
- వారసత్వ పన్ను మార్పులకు వ్యతిరేకంగా ఆందోళన

న్యూఢిల్లీ: లేబర్ ప్రభుత్వం శరదృతువు బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన వారసత్వ పన్ను మార్పులకు వ్యతిరేకంగా స్కాటిష్ రైతులు నగర బైపాస్‌లో ట్రాక్టర్ కాన్వాయ్‌తో నిరసనగళం విప్పారు. తాజా సవరణల మార్పులు ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. దాదాపు 500 వ్యవసాయ ఎస్టేట్‌లను ప్రభావితం చేస్తాయని ప్రభుత్వం తెలిపింది.

ప్రతిపక్షాలపై విమర్శలే
సమాధానాల్లేవ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలోని సమస్యలు, సవాళ్లను ప్రస్తావించకుండా కేవలం ప్రతిపక్షాలపై విమర్శలకే పరిమితమయ్యారు. మరోవైపు ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా వారిపైనే ఎదురుదాడికి దిగారు. దీంతో ఆయన ప్రసంగం ఆసాంతం ప్రభుత్వ గొప్పలు, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడానికే ఉపయోగపడింది. ప్రధానంగా దేశంలోని రైతుల సమస్య, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలను పూర్తిగా విస్మరించారు. మరోవైపు ఢిల్లీలో నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన రాజకీయ ప్రసంగం చేశారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై విమర్శలు చేయడంతో ఓట్ల కోసం చేసిన ప్రసంగంలా అనిపించింది. దీంతో మోడీ ప్రసంగంపై ప్రతిపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి.

లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చల అనంతరం మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించిందని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని అన్నారు. "మనం 2025లో ఉన్నాం. ఒక రకంగా 21వ శతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏండ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏండ్లలో వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుగొలిపే దిశగా పని చేయనున్నాం. ఈ లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచింది" అని ప్రధాని మోడీ అన్నారు.తమ ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని మోడీ తెలిపారు. గతంలో మహిళలు బహిర్భూమి వ్యవస్థ లేక అవస్థలు పడేవారని, ఎవరైతే అన్ని సౌకర్యాలు కలిగి ఉన్నారో వారికి ఇలాంటి అవసరాలు అర్థం కావని అన్నారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని తెలిపారు. గత ఐదు దశాబ్దాలుగా 25 లక్షల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. అంకితభావంతో పథకాలు అమలు చేసినప్పుడే ఇలాంటి మార్పు సంభవమని అన్నారు. పేదల గురించి ఉత్తుత్తి హామీలు తాము ఇవ్వబోమని, అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని వాటిని అధిగమించేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు.అదే విధంగా ప్రధాని మోడీ తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు.

రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల మోడీ ప్రస్తావిస్తూ పేదల గుడిసెల్లో ఫొటో సెషన్లతో సరదాగా గడిపేవారికి పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతూ చేసే ప్రసంగాలు బోరింగ్‌గానే ఉంటాయని అన్నారు. కొందరు నాయకులు విలాసవంతమైన షవర్లు కోరుకుంటారని, తమ ప్రభుత్వం మాత్రం ప్రతి ఇంటికి నీళ్లు ఇవ్వడంపై దృష్టి సారిస్తుందని కేజ్రీవాల్ విలాసవంతమైన శీష్ మహల్ (అద్దాల మేడ)పై పరోక్ష విమర్శలు చేశారు. ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామలకు 16 పైసలే చేరుతోందని గతంలో ఓ ప్రధాని వాపోయారని, ఢిల్లీ నుంచి గల్లీ వరకూ అప్పట్లో అదే పరిస్థితి ఉండేదని మోడీ అన్నారు. అయితే ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి చేరుతోందని, నగదు బదిలీతో నేరుగా ప్రజలకే ఈ సొమ్ము అందుతోందని వివరించారు. డిజిటల్ సాంకేతికతను పారదర్శకంగా ఉపయోగించడంతో పది కోట్ల నకిలీ ఖాతాలను తొలగించినట్టు తెలిపారు.ఎల్ఈడీ బల్బులు రూ.40కు అందించామని పేర్కొన్నారు.

ఏడాదిలో 17,654 కంపెనీలు మూత

రాజ్యసభలో కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రా

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17,654 కంపెనీలు మూతపడ్డాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ గణంకాలు స్పష్ట అయ్యాయి. రాజ్యసభలో మంగళవారం వైసీపీ ఎంపీ పరిమల్ నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి 26 వరకు 17,654 కంపెనీలు మూసివేయబడ్డాయని తెలిపారు. 2023-24లో 22,044, 2022-23లో 84,801 కంపెనీలను మూసివేసారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేసే కంపెనీల చట్టం కింద దేశంలో కంపెనీలు రిజిస్ట్రేషన్ జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి 26 వరకు 1,38,027 కంపెనీలు నమోదు చేయగా, అయితే ఈ సంఖ్య 2023-24లో 1,85,318, 2022-23లో 1,59,302లో కంటే తక్కువగా ఉంది.

వాస్తవాలు తెలియజేద్దాం

14 నుంచి 20వరకు బడ్జెట్‌పై ప్రచార కార్యక్రమాలు : ఐదు వామపక్షాల పిలుపు

కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సూచించిన నేతలు

(మొదటిపేజీ తరువాయి)


(ఫైల్)

మెజారిటీ సంఖ్యలో ప్రజలను కలుసుకోవడానికి సామూహిక ప్రచారం చేపట్టాలని, అందుకోసం వామపక్షాల రాష్ట్రాల శాఖలు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. ఈ మేరకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, సమన్వయకర్త ప్రకాశ్ కరత్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఎఐఎఫ్‌బీ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్‌లు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రజల తక్షణ, మౌలికావసరాలకు కేంద్ర బడ్జెట్ దారుణంగా ద్రోహం చేసింది. మూకుమ్మడి నిరుద్యోగం, వేతనాల కుంగుబాటు, ప్రజల్లో కొనుగోలు శక్తి కుంచించుకుపోవడం కారణంగా ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులుగా మోడీ ప్రభుత్వం సంపన్నులకు మరిన్ని రాయితీలు ఇవ్వడం ద్వారా, ఖర్చుల్లో కోతలు పెట్టడం ద్వారా ఆర్థిక వ్యవస్థను ఉత్తేజితం చేయడానికి ఈ బడ్జెట్ ద్వారా ప్రయత్నించిందని వామపక్షాలు విమర్శించాయి. సంపన్నులపై, బడా కార్పొరేట్ సంస్థలపై పన్నులు విధించడం, ఉపాధి కల్పనకు సాయపడేలా ప్రభుత్వ పెట్టుబడులను విస్తరించడం, కనీస వేతనాలకు హామీ కల్పించడం ద్వారా వనరులను సమీకరించడానికి బదులుగా అందుకు విరుద్ధమైన పంథాను ప్రభుత్వం ఎంపిక చేసుకుందని విమర్శించారు. ప్రయివేటు పెట్టుబడులను పెంపొందించడం, ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు రంగం సేవలో పెట్టడం, విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించడం వంటి చర్యల ద్వారా కొద్ది మంది వద్దనే సంపద మరింతగా పోగు పడేలా ఈ బడ్జెట్‌లో చర్యలు తీసుకున్నారని వామపక్షాలు విమర్శించాయి. నిరుద్యోగం సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని, పైగా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆహార సబ్సిడీలు, వ్యవసాయం దాని అనుబంధ కార్యకలాపాలు, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం, పట్టణాభివృద్ధి రంగాలపై పెట్టే ఖర్చు గతేడాది కంటే బాగా తగ్గిపోయిందని విమర్శించింది. డిమాండ్ పెరిగినప్పటికీ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు రూ.86వేల కోట్ల వద్దే నిలిచిపోయాయని పేర్కొన్నాయి. రూ.12లక్షలకు ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని పెంచడం వల్ల ఒక వర్గం ప్రజలకు ఊరట లభించింది. కానీ, ధరల పెరుగుదల, జీఎస్టీ వంటి పరోక్ష పన్నులతో ఇబ్బందులు పడుతున్న కార్మిక వర్గంలోని విస్తృత ప్రజానీకాన్ని పూర్తిగా విస్మరించారు. పన్ను మినహాయింపు పరిమితిని పెంచడం వల్ల ఎదురైన నష్టాన్ని సంపన్నులపై, కార్పొరేట్లపై అధికంగా పన్నులు విధించడం ద్వారా తగ్గించుకోవచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా దానికి బదులు కార్పొరేట్ రంగానికి, సూపర్ రిచ్ వర్గాలకు వరాల మూటను అందించింది. 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లోని ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలన్నింటినీ వామపక్షాలు తిరస్కరిస్తున్నాయి. వాటి స్థానంలో తాము సూచించే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రవేశపెట్టాలంటూ డిమాండ్ చేయాలని తీర్మానించాయి. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, వేతనాలు పెంచడం వంటి చర్యలు డిమాండ్‌ను పెంచడానికి దోహదపడతాయని వామపక్షాల నేతలు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ప్రజల విద్యా హక్కుకు, ఆరోగ్య, సామాజిక ప్రయోజనాల హక్కులకు హామీ కల్పించడానికి దోహదపడతాయి.

తాము సూచించిన ప్రతిపాదనలను బడ్జెట్‌లో ప్రవేశపెట్టి, ఫైనాన్స్ బిల్లులో స్థానం కల్పించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి.

1.దేశంలో 200 మంది శత కోటీశ్వరుల(డాలర్లలో)పై 4శాతం సంపద పన్ను ప్రవేశపెట్టాలి, కార్పొరేట్ పన్నును పెంచాలి.

2.వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలి, వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలి.

3. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ ద్వారా చేపట్టే ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ చర్యలను, ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలి. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐలను ఉపసంహరించాలి.

4.మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను 50శాతం పెంచాలి. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలి. వృద్ధాప్య పెన్షన్లు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాల కోసం కేంద్ర కేటాయింపులు పెంచాలి.

5. ఆరోగ్య రంగ కేటాయింపులను జీడీపీలో 3శాతానికి పెంచాలి. అలాగే విద్యా రంగానికి జీడీపీలో ఆరు శాతానికి కేటాయింపులు పెంచాలి.

6.ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాలి.

7.ఎస్సీ, ఎస్టీ రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలి. వీటిల్లో ఐసీడీఎస్‌కు కూడా కేటాయింపులు పెరగాలి. అలాగే స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను పెంచాలి.

8.రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలి. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధులను గణనీయంగా పెంచాలి. రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్‌చార్జిలను రద్దు చేయాలి.

ఎట్టకేలకు ఫైనాన్స్ బిల్లు ద్వారా ఆమోదించడానికి ముందుగా కేంద్ర బడ్జెట్‌లో ఈ డిమాండ్లు లేదా ప్రతిపాదనలన్నింటినీ చేర్చాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. వీటి కోసం ప్రచారం నిర్వహించనున్నట్లు వామపక్షాలు నేతలు జారీ చేసిన ప్రకటన పేర్కొంది. ఈ ప్రతిపాదనలకు మద్దతుగా ప్రజలను సమీకరించడానికి ఫిబ్రవరి 14 నుంచి 20వరకు వారం రోజుల పాటు సామూహిక ప్రచారాన్ని చేపట్టాలని వామపక్షాలు నిర్ణయించాయి.

ఇంటింటికి తిరగడం, వీధి సమావేశాలు నిర్వహించడం, ప్రదర్శనలు, ర్యాలీలు ద్వారా మెజారిటీ సంఖ్యలో ప్రజలను కలుసుకోవడానికి సామూహిక ప్రచారం చేపట్టాలని, అందుకోసం వామపక్షాల రాష్ట్రాల శాఖలు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించినట్టు వామపక్షాల నేతలు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ సర్వే దేశానికి దిక్సూచి : మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా ఆయా కులాల వారికి న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం శాసన సభలో సీఎం ప్రవేశ పెట్టిన నివేదికపై మంత్రి మాట్లాడుతూ ఈ సర్వే దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలకు ఇది రోడ్‌మ్యాప్‌లా పనిచేస్తుందన్నారు. భావితరాలకు న్యాయం చేయటానికి సమగ్రంగా వివరాలు సేకరించామని తెలిపారు. బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధితో పని చేస్తున్నదని వివరించారు. ప్రభుత్వానికుందన్నారు. బీసీలకు న్యాయం చేసేందుకు చేపట్టాల్సిన పథకాలపై విపక్షాలు సూచనలు చేయాలని కోరారు.సర్వేలో బీసీల జనాభా తగ్గిందంటూ చేస్తున్న విమర్శల్లో నిజం లేదన్నారు. సున్నితమైన విషయంపై రాజకీయాలు చేయొద్దని కోరారు. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ విజయవంతం కావటం వల్లే జాతీయ సగటులోనూ మన జనాభా తగ్గిందని చెప్పారు.

వరుణ్ ఇన్.. బుమ్రా ఔట్..

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టు ప్రకటన



నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారతజట్టును బిసిసిఐ మరోదఫా వెల్లడించింది. గాయపడ్డ జస్ప్రీత్ బుమ్రా స్థానంలో వరుణ్ చక్రవర్తికి చోటు కల్పించింది. అలాగే సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి కూడా వన్డే జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌తో గురువారం నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారతజట్టు ఆడే చివరి సిరీస్ ఇదే కావడంతో టీమిండియా గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో పెట్టుకొని బిసిసిఐ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినిచ్చిన బోర్డు.. టి20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన వరుణ్ చక్రవర్తికి వన్డే జట్టులో చోటు కల్పించడం విశేషం. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో వెన్నునొప్పి గాయంతో ఆటకు దూరమైన బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీ నాటికి ఫిట్‌నెస్ సాధిస్తాడని సమాచారం. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీకి ప్రకటించిన జట్టులో బుమ్రాకు చోటు కల్పించిన సంగతి తెలిసిందే. రెగ్యులర్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌లో 14వికెట్లతో సత్తా చాటాడు. రాజ్‌కోట్ వేదికగా జరిగిన టి20లో ఏకంగా ఐదు వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. నాగ్‌పూర్ వేదికగా మార్చి 6నుంచి ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. దీంతో వరుణ్ చక్రవర్తి టీమిండియా జట్టు సభ్యులతో కలిసి మంగళవారం ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యాడు. లిస్ట్-ఎ క్రికెట్‌లో వరుణ్ చక్రవర్తి 19.8 స్ట్రయిక్‌రేట్‌తో 59వికెట్లు తీశాడు. విజయ్ హజారే ట్రోఫీలో 12.16సగటుతో 18వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్లు కాగా.. రెగ్యులర్ స్పిన్నర్ల కోటాలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి మాత్రమే ఉన్నారు.

జట్టు : రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, జైస్వాల్, కోహ్లి, శ్రేయస్, కెఎల్ రాహుల్, పంత్(వికెట్ కీపర్), హార్దిక్, జడేజా, సుందర్, అక్షర్, కుల్దీప్, హర్షిత్ రాణా, షమీ, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి.

భారత్ X పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్

హాట్‌కేకుల్లా అమ్ముడైన టికెట్లు



దుబాయ్: భారత్, పాకిస్తాన్ జట్లమధ్య జరిగే క్రికెట్ మజా అంటే వేరు. ఈ రెండు జట్లు తలపడుతున్నాయంటే స్టేడియాలు కిక్కిరిసిపోవాల్సిందే. ఈ క్రమంలోనే ఈనెలలో పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చే ఛాంపియన్స్ ట్రోఫీలో ఇరుజట్ల మధ్య జరిగే మ్యాచ్ క్రికెట్ మ్యాచ్ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి. ఈ మ్యాచ్ దుబాయి వేదికగా జరుగనుంది. మ్యాచ్ టికెట్ల బుకింగ్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే అమ్ముడయ్యాయంటే.. ఎంత భారీ క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఐసిసి చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్-పాక్ మధ్య గ్రూప్ దశ మ్యాచ్ ఫిబ్రవరి 23న జరుగనుంది. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ మ్యాచులన్నీ దుబాయిలోనే ఆడనున్న విషయం తెలిసిందే. దుబాయి క్రికెట్ స్టేడియం జనరల్ స్టాండ్ టికెట్ 125 దిర్హామ్స్ (రూ.3వేలు) నుంచి ప్రారంభమైంది. దుబాయిలో జరిగే మొదటి సెమీఫైనల్ మ్యాచ్ తర్వాత ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో ఎనిమిది జట్లు పాల్గొంటాయి. టోర్నమెంట్ 19 రోజుల పాటు కొనసాగుతుంది. రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియాల్లో మ్యాచులు జరుగుతాయి. పాకిస్తాన్‌లోని ప్రతి మైదానంలో మూడు గ్రూప్ మ్యాచులు జరుగుతుతాయి. భారత్ ఆడే మూడు గ్రూప్ మ్యాచ్‌లు, మొదటి సెమీఫైనల్ మాత్రం దుబాయిలోనే ఉంటుంది. ఈ ఈవెంట్‌లో టీమిండియా ఫిబ్రవరి 20న తొలి లీగ్ మ్యాచ్ ఆడుతుంది. 23న పాకిస్తాన్‌తో తలపడనుంది.ర్చి 2న చివరి లీగ్ మ్యాచ్ ఆడుతుంది.

ఆంధ్రకు మరో రెండు పతకాలు

38వ జాతీయ క్రీడలు





డెహ్రాడూన్: 38వ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మరో రెండు పతకాలు దక్కాయి. 7వ రోజు పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్, కనో స్లాలోమ్‌లో ఆంధ్రకు కాంస్య పతకాలు దక్కాయి. పురుషుల డబుల్స్‌లో గౌస్-సాయి పవన్ జోడీ, మహిళల కనో స్లాలోమ్ కేటగిరీలో డి. చేతన భగవతి కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు. ఈ పతకాలను అథ్లెట్లకు ఇంకా అందజేయని కారణంగా పట్టికలో చూపలేదు. 7వ రోజు పోటీలు ముగిసే సరికి పతకాల పరంగా కర్ణాటక అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. ఏడో రోజైన మంగళవారం పోటీలు ముగిసే సరికి కర్ణాటక 42పతకాలతో మరోసారి టాప్‌లోకి ఎగబాకింది. ఇందులో 22స్వర్ణాలు, 10రజత పతకాలతో సహా మరో 10 కాంస్యాలున్నాయి. రెండోస్థానంలో సర్వీసెస్‌కు 38 పతకాలు దక్కినా..జిందులో 19 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. ఇక పతకాల పరంగా 61పతకాలు సాధించిన మహారాష్ట్రకు కేవలం 15 స్వర్ణాలే దక్కడంతో ఆ జట్టు మూడోస్థానంలో కొనసాగుతోంది.

సరికొత్త నాగచైతన్యని చూస్తారు


దేవి శ్రీ ప్రసాద్

"తండేల్' పాటలన్నీ చాలా పెద్ద హిట్స్ అయ్యాయి. పాటలకి వస్తున్న రెస్పాన్స్‌కి హ్యాపీ. చాలా రోజుల తర్వాత వస్తున్న లవ్ స్టోరీ ఇది. 'బుజ్జితల్లి'.. పాట రిలీజైన వెంటనే ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. సుకుమార్ పాట విని 'నీ ఆల్ టైమ్ టాప్ ఫైవ్‌లో ఉంటుంద'ని చెప్పారు. అలాగే శివుని పాట, హైలెస్సో పాటలు గొప్పగా జనాల్లోకి వెళ్ళాయి. ఆడియన్స్ సాంగ్స్‌ని చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు' అని సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ అన్నారు.

- నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 7న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మీడియాతో ముచ్చటించారు.
- లవ్ స్టోరీ అనగానే నా పేరే వినిపించడం చాలా హ్యాపీగా ఉంది. 'నువ్వు వస్తావంటే నేనొద్దంటానా?, వర్షం, ఆర్య, 100% లవ్'తో పాటు 'శంకర్ దాదా, మాస్' లాంటి కమర్షియల్ సినిమాలకు కూడా అంతే అద్భుతమైన రెస్పాన్స్ ప్రేక్షకుల నుంచి వచ్చింది. ఎలాంటి సినిమా అయినా చేయగలననే పేరు రావడం, అందులో లవ్ స్టోరీస్‌కి నేనైతే బావుంటానని అందరూ భావించడం గాడ్ బ్లెస్సింగ్‌గా భావిస్తాను. ప్రేమ కథలు ఎవర్ గ్రీన్. అందరూ రిలేట్ చేసుకునేలా ఉంటాయి. ప్రేమ పాటలు ఎక్కువ కాలం నిలబడతాయి.
- నాకు కంప్లీట్ రస్టిక్ ఫోక్ స్టోరీ ఉన్న సినిమా చేయలనే ఉండేది. ఆ కోరిక 'రంగస్థలం'తో తీరింది. అందులో పాటలన్నీ జానపద మూలల్లో నుంచి చేసినట్లుగా ఉంటుంది. మళ్ళీ అలాంటి ఫోక్ టచ్ ఉన్న సినిమా 'ఉప్పెన'. అయితే అందులో కంపోజిషన్ కాస్త సూఫీ స్టయిల్, క్లాస్ మిక్స్ చేసినట్లుగా ఉంటుంది. 'తండేల్' కూడా అంతే. ఇది ప్యూర్ లవ్ స్టోరీ. పాకిస్తాన్ సరిహద్దులలో చిక్కుకున్న మన మత్స్యకారుల కథ. రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా రాసుకున్న కథ. ఇప్పటికే మూడు పాటలు విన్నారు. రాబోయే పాటలు కూడా అద్భుతంగా ఉంటాయి. నేపథ్య సంగీతం కూడా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది.
- డైరెక్టర్ చందూ గ్రేట్ విజన్‌తో సినిమా తీశాడు. చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశాడు. చైతు ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్, పెర్ఫార్మెన్స్ చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. ఎమోషన్స్ చాలా అద్భుతంగా పండించారు. ఇందులో కొత్త నాగచైతన్యని చూడబోతున్నారు (నవ్వుతూ). సాయి పల్లవి అద్భుతమైన నటి. ఇందులో కూడా ఆమె పెర్ఫార్మెన్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది. చై, సాయిపల్లవి కెమిస్ట్రీ అదిరిపోయింది. సెకండ్ హాఫ్‌లో వచ్చే ఓ సీక్వెన్స్ చాలా అద్భుతంగా ఉంటుంది. అది బిగ్ స్క్రీన్ పైన చూడాల్సిందే.
- ఇందులో చాలా మంచి యాక్షన్, బోట్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. బన్నీ వాసు, అరవింద్ చాలా గ్రాండ్‌గా సినిమా తీశారు. సినిమా ఖచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుంది.

నవచిత్రం

పాన్ ఇండియా రేంజ్‌లో..


ఏ.ఎం.రత్నం, పవన్‌కళ్యాణ్

'పవన్ కళ్యాణ్ హీరోగా తాను నిర్మిస్తున్న భారీ చిత్రం 'హరి హర వీరమల్లు' ఘన విజయం సాధిస్తుంది' అని నిర్మాత ఎ.ఎం.రత్నం నమ్మకం వ్యక్తం చేశారు. మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా ప్రకటన విడుదల చేసిన ఆయన ఈ సినిమాతో పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. భారత దేశం గర్వించదగ్గ నిర్మాతలలో ఏ.ఎం.రత్నం ఒకరు. కేవలం నిర్మాతగానే కాకుండా గీత రచయితగా, రచయితగా, దర్శకుడిగా తెలుగు, తమిళ సినీ పరిశ్రమలలో తనదైన ముద్ర వేశారు.

'కర్తవ్యం', 'పెద్దరికం', 'సంకల్పం', 'భారతీయుడు', 'నట్పుక్కాగ', 'కధలర్ దినం', 'ఖుషి', 'బాయ్స్', 'గిల్లి', '7/జి రెయిన్‌బో కాలనీ', 'స్నేహం కోసం' వంటి చిత్రాలను నిర్మించారు. మెగా బడ్జెట్ చిత్రాల నిర్మాతగా పేరొందిన ఆయన డిస్ట్రిబ్యూటర్ గాను వ్యవహరించి ఎన్నో గొప్ప చిత్రాలను ప్రేక్షకులకు చేరువ చేశారు. పవన్ కళ్యాణ్‌తో ఎ.ఎం.రత్నంకు ఎంతో అనుబంధం ఉంది. వీరి కలయికలో గతంలో 'ఖుషి, బంగారం' సినిమాలు వచ్చాయి. వీరి కాంబోలో రూపొందుతున్న 'హరి హర వీరమల్లు' మూడో సినిమా కావడం విశేషం.

'శబ్దం' రిలీజ్‌కి రెడీ


ఆది పినిశెట్టి

'వైశాలి'తో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రెస్టింగ్ సూపర్‌నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు.

7జి ఫిల్మ్స్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజా మేకర్స్ 'శబ్దం' రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రం ఈనెల 28న తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషలలో ఒకేసారి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల అవుతుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

'వైశాలి'లో 'వాటర్' హర్రర్ ఎలిమెంట్‌తో అందరినీ ఆకట్టుకున్న దర్శకుడు అరివజగన్ ఈ సినిమాలో 'సౌండ్' అనే సూపర్ నేచురల్ ఫ్యాక్టర్‌గా ఉపయోగించారు.

లక్ష్మీ మీనన్ ఈ సినిమాలో హీరోయిన్. సిమ్రాన్, లైలా, రెడిన్ కింగ్స్లీ, ఎంఎస్ భాస్కర్, రాజీవ్ మీనన్ వంటి ప్రముఖ నటులు ఈ చిత్రంలో నటిస్తున్నారు. 7జి ఫిల్మ్స్ శివ తమిళ చిత్ర పరిశ్రమలో 225కి పైగా చిత్రాలను పంపిణీ చేసి 'ద్రౌపది, రుద్ర తాండవం' వంటి చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ భారీ బడ్జెట్ చిత్రంతో పూర్తి స్థాయి నిర్మాతగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇది ఇప్పటివరకు ఆది కెరీర్‌లోనే తొలి భారీ బడ్జెట్ చిత్రం. ఈ చిత్రం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమైంది.

ప్రేక్షకులకు హర్రర్ స్టయిల్‌లో కొత్త తరహా సినిమా అనుభవాన్ని అందిస్తుంది. సంగీత దర్శకుడు తమన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఈ సినిమా 'సౌండ్' ఆధారంగా తెరకెక్కడంతో, ఈ చిత్రానికి అవుట్ స్టాండింగ్ ఆడియోగ్రఫీని టి. ఉదయ్‌కుమార్ సమకూర్చారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులుతుది దశకు చేరుకునాయి. ప్రేక్షకులు గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని పొందేలా విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ ఎఫెక్ట్స్ ఉండబోతున్నాయి. ఈ చిత్రం ఎస్ సినిమాస్ ద్వారా ఆంధ్ర, తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది అని చిత్ర బృందం తెలిపింది.

'ఇప్పటివరకు భిన్న సినిమాలు, భిన్న పాత్రలు పోషించా. వాటికి భిన్నంగా ఇందులో నా పాత్ర ఉంటుంది. ఇలాంటి మంచి సినిమాతో మరోమారు దర్శకుడు అరివళగన్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు సరికొత్త అనుభతినిస్తుందని కచ్చితంగా చెప్పగలను' అని హీరో ఆదిపినిశెట్టి చెప్పారు. ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: అరుణ్ బత్మనాబన్, ఎడిటర్: సాబు జోసెఫ్, ఆర్ట్ డైరెక్టర్ : మనోజ్ కుమార్.

భిన్న హర్రర్ సినిమా



హర్రర్, సస్పెన్స్, థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో 'భవానీ వార్డ్ 1997' చిత్రాన్ని జీడీఆర్ మోషన్ పిక్చర్, విభూ మీడియా సమర్పణలో చంద్రకాంత సోలంకి, జీడీ నరసింహ నిర్మించారు.


ఈ మూవీకి జీడీ నరసింహ దర్శకత్వమూ వహించారు. గాయత్రీ గుప్తా, గణేష్ రెడ్డి, పూజా కేంద్రే, సాయి సతీష్, జబర్దస్త్ అప్పారావు, ఈశ్వర్ బాబు ధూళిపూడి తదితరులు నటించారు.

ఈ మూవీ ఈనెల 7న రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ నిర్వహించిన చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నిర్మాత రాజ్ కందుకూరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'కంటెంట్ ఉన్న సినిమాలే ఇప్పుడు ఆడుతున్నాయి. ఈ చిత్రంలో కంటెంట్ ఉందని నేను నమ్ముతున్నాను. నాకు హర్రర్ చిత్రాలంటే చాలా ఇష్టం. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. ప్రస్తుతం చిన్న చిత్రాలే పెద్ద సౌండ్ చేస్తున్నాయి' అని తెలిపారు.

'ఇందులో మ్యూజిక్ మీ అందరినీ భయపెట్టేలా ఉంటుంది. విజువల్స్ చాలా కొత్తగా ఉంటాయి. హర్రర్ చిత్రాలను ఇష్టపడే వారందరికీ మా చిత్రం నచ్చుతుంది' అని దర్శకుడు జీ.డి. నరసింహ అన్నారు. సాయి సతీష్ మాట్లాడుతూ, 'ఇందులో మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు జీడీ నరసింహకు థ్యాంక్స్. ట్రైలర్ అందరికీ నచ్చడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు.

'సినిమా చూశాను. చాలా బాగుంది. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. మా సాయి సతీష్ నటన అందర్నీ మెస్మరైజ్ చేస్తుంది' అని అన్నారు.

హిట్ ఖాయం..


సాయిరామ్ శంకర్

'నాకు ఈ సినిమా మీద గట్టి నమ్మకం ఉంది. మధ్యలో ఫెయిల్యూర్స్ వచ్చినప్పటికీ నాతో సినిమాలు చేయడానికి నిర్మాతలు వస్తున్నారు. ఈ సినిమా కచ్చితంగా సక్సెస్ అవుతుందనే నమ్మకంతో ఉన్నా' అని హీరో సాయిరామ్ శంకర్ చెప్పారు. 'ఒక పథకం ప్రకారం'లో ఆయన నటించారు. మలయాళ దర్శకుడు వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించారు. గార్లపాటి రమేష్, వినోద్ కుమార్ విజయన్ నిర్మించారు. ఈనెల 7న సినిమా రిలీజ్ కాబోతున్న సందర్భంగా హీరో సాయిరాం శంకర్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- సినిమాలో ప్రతి పాత్రకు ఎవరి ప్లానింగ్ వారికి ఉంటుంది. కాబట్టి 'ఒక పథకం ప్రకారం' అనే టైటిల్ సెలెక్ట్ చేసుకున్నాం. మా అన్నయ్య పూరి జగన్నాథ్ ట్రైలర్ చూసి, కొత్తగా ఉందని అన్నారు.
- విశ్రాంతిలోపు విలన్ ఎవరో చెప్తే వారికి రూ.పదివేలు బహుమతిగా ఇస్తాం. ఈ కాంటెస్ట్ వల్ల చాలా మందికి సినిమా రీచ్ అయ్యింది.
- ఇందులో నేను క్రిమినల్ లాయర్‌ని. నెమ్మదిగా నా క్యారెక్టర్‌లోని ఒక్కో షేడ్ బయట పడుతుంది. క్రిమినలా లేకపోతే క్రిమినల్ లాయరా అనిపించేలా ఉంటుంది. వినోద్‌కుమార్ మలయాళ డైరెక్టర్ అయిన ప్పటికీ తెలుగు సినిమాలు, ఇక్కడి స్టైల్ బాగా ఇష్టం. 'మలయాళంలో ఓ పాయింట్ పట్టుకుని వెళ్ళిపోతారు. కానీ ఇక్కడ అలా కుదరదు, కష్టం' అంటారు ఆయన. కాబట్టి తెలుగు ప్రేక్షకులకు తగ్గట్టుగా ఫైట్ సీన్స్‌ని, సాంగ్స్‌ను డిజైన్ చేశారు. తమిళ ఫైట్ మాస్టర్ ఢిల్లీ బాబు ఫైట్స్‌ని అద్భుతంగా డిజైన్ చేశారు.
- సినిమా అంతా క్రైమ్ జోనర్‌లో సాగుతున్నప్పటికీ ఇందులో మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. అదే ఈ సినిమా ప్రత్యేకత. మా సినిమా విడుదల రోజు 'తండేల్' కూడా రిలీజ్ కాబోతోంది. అయితే దీన్ని నేను పోటీగా ఫీలవ్వను. ప్రస్తుతం ఓ మైథలాజికల్ సిరీస్‌తో పాటు 'రీసౌండ్' సినిమా చేస్తున్నాను. ఇకపై హీరోగానే కాదు, క్యారెక్టర్ బాగుంటే ఎలాంటి రోల్ అయినా చేస్తాను.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886